www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 191 | సోమవారం 01-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | పేజీలు : 12+4+ టాబ్లాయిడ్ వెల: రూ.3.00 | విజయవాడ ప్రచురణ




మాలకొండయ్య పదవీ స్వీకారం

- శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం
- అమరావతి పోలీస్ కమిషనరేట్‌పై దృష్టి
- నేరాల అదుపునకు కృషి చేస్తామని వెల్లడి

3 లో

● సస్పెన్స్ వీడింది

రజనీ.. ద లీడర్



- రాజకీయ రంగ ప్రవేశం
- కొత్త పార్టీ ఏర్పాటుపై ప్రకటన
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలకూ పోటీ
- 2019 సార్వత్రిక ఎన్నికలపై సరైన సమయంలో నిర్ణయం
- అధికారంలోకొచ్చి హామీలు తీర్చకపోతే తప్పకుంటాం

చెన్నై :
తమిళ సినీరంగ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశంపై ఆదివారం ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. వందలాది మంది మద్దతుదారుల హర్షధ్వానాల నడుమ రాజకీయ రంగ ప్రవేశ ప్రకటన చేశారు. 'నా విధి నిర్వహించడానికి ఇది సమయం. వ్యవస్థను మారుస్తాను' అని పేర్కొంటూ కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు 67 ఏళ్ల తమిళ సినీ నటుడు చెన్నైలో ప్రకటించారు. గత ఏడాది కాలానికిపై తమిళనాడులో చోటుచేసుకున్న సంఘటనలు రాష్ట్రాన్ని నవ్వులపాలు చేశాయని పేర్కొంటూ 'నేనిప్పుడు ఈ నిర్ణయం తీసుకోకపోతే, ఆ అపరాధం నన్ను వెంటాడుతుంది' అని రజనీ అన్నారు. గత ఏడాది డిసెంబరులో ఏఐఏడీఎంకె అధినేత్రి జె.జయలలిత మరణంతో రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. అయితే - మిగతా 2 లో



హ్యాపీ న్యూ ఇయర్..

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంగ్ల నూతన సంవత్సరం 2018కి ఘనంగా స్వాగతం పలుకుతూ ఆదివారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సందడి చేశారు. ఇదే సమయంలో పాత సంవత్సరం 2017కు వీడ్కోలు పలికారు. ముఖ్యంగా యువత ద్విచక్రవాహనాలు, కార్లలో రయ్.. రయ్..మంటూ తిరుగుతూ 'హ్యాపీ న్యూ ఇయర్..' అంటూ కేకలు, అరుపులతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. అర్థరాత్రి 12 కాగానే బాణాసంచా పేలుస్తూ, ఉల్లాసంగా, ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. కేకులు కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. ప్రధాన రహదారులే కాకుండా కూడళ్ల వద్ద గుంపులుగా చేరి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్న హోటళ్లు మొదలుకొని స్టార్ హోటళ్ల వరకూ.. బార్ అండ్ రెస్టారెంట్లు.. రిసార్టులు.. న్యూ ఇయర్ వేడుకలతో కళకళలాడాయి.

రాజకీయ పోరాటంతోనే

పోలవరం సాధ్యం

- వెంకయ్య, చంద్రబాబు వైఖరేమిటి?
- రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడంలో బీజేపీ తొలి ముద్దాయి
- ఎఫ్ఆర్‌డీఐతో సామాన్యులకు కష్టాలే
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ. పక్కన వనజ, ముప్పాళ్ల, దోనేపూడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
రాజకీయ పోరాట పటుత్వంతోనే పోలవరం ప్రాజెక్టు సాధ్యమవుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ స్పష్టం చేశారు. మూడున్నరేళ్లుగా కాలయాపన చేసిన కేంద్రం పోలవరంపై ఇప్పుడు హడావిడి చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దక్షిణాదిలో బీజేపీకి ఓట్లు రావన్న విషయం - మిగతా 2 లో

ప్రకృతి సేద్యానికి ఏపీ వేదిక

విశాలాంధ్ర-గుంటూరు జిల్లాపరిషత్ :
ప్రకృతి సేద్యానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కావాలని, 2018 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 'ప్రకృతి సేద్య సంవత్సరం'గా నామకరణం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆదివారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయానికి ఎదురుగా ఉన్న

- సుస్థిర అభివృద్ధి కోసమే వ్యవసాయంలో మార్పులు
- లాభసాటి చేయడమే ప్రభుత్వ లక్ష్యం : చంద్రబాబు

బైబిల్ మిషన్ ఆవరణలో వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ నేతృత్వంలో జరుగనున్న 'ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ' కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భావి తరాలకు ఉపయోగపడే ప్రత్యేక కార్యక్రమానికి సుభాష్ పాలేకర్ శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. నూతన సంవత్సరంలో వ్యవసాయంలో పాత పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన వ్యవసాయ పద్ధతులను పాటించాలని అన్నారు. సుస్థిరమైన అభివృద్ధి జరగాలని వ్యవసాయంలో అనేక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుభాష్ పాలేకర్, చంద్రబాబు, కోడెల శివప్రసాదరావు, సోమిరెడ్డి, ప్రత్తిపాటి, నక్కా ఆనందబాబు తదితరులు

మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గాలంటే ప్రకృతి వ్యవసాయం తప్ప మరో మార్గం లేదని, ప్రజల ఆరోగ్యం కూడా పెరుగుతుందన్నారు. ఏపీని ప్రకృతి సేద్య రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 2016-17 సంవత్సరంలో రాష్ట్రంలో 40 వేల ఎకరాలలో రైతులు ప్రకృతి సేద్యం చేస్తే, 2017-18 సంవత్సరంలో లక్షా యాభై వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం - మిగతా 2 లో

ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు 3 లో

స్మార్ట్ సిటీలపై మోడీ ప్రేమ ఇదేనా : రాహుల్ 9 లో

కేరళలో తగ్గిన రాజకీయ హింస 9 లో

బరితెగింపు

- సీఆర్‌పీఎఫ్ శిక్షణ కేంద్రంపై విరుచుకుపడిన ఉగ్రవాదులు
- నలుగురు జవాన్లు మృతి
- ముగ్గురు టెర్రరిస్టులు హతం



శ్రీనగర్ :
జమ్మూకాశ్మీరులో ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడిచేసి నలుగురు జవాన్లను చంపేశారు. మన భద్రతాదళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. పుల్వామా జిల్లాలోని సీఆర్‌పీఎఫ్ శిక్షణ శిబిరం మీద ఆదివారం ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. బలగాలు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో 185వ శిబిరంలోకి సాయుధ ఉగ్రవాదులు ముగ్గురు చొరబడ్డారు. గ్రనేడ్లు విసురుతూ...తుపాకీలతో విచక్షణా - మిగతా 2 లో

ఇదీ లోకం!



యువతే పునాది

- నూతన సంవత్సరంలో అందరికీ సమానావకాశాలు
- దేశవ్యాప్తంగా 4 నుంచి పరిశుభ్రతపై సర్వే
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ :
పద్దెనిమిది ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం కోరారు. యువత ఓట్లు నూతన భారతానికి పునాది అని నిరూపించబడ్డాయన్నారు. ఈ ఏడాదిలో తన చివరి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో కొత్త భారతాన్ని ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై ఎవరు ఉద్దేశపూర్వకంగా ఉంటారో దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక యువ ప్రతినిధిని ఎంపిక చేసి ఢిల్లీలో ఆగస్టు 15న 'మాక్ పార్లమెంటు' నిర్వహించాలని సూచించారు. దేశ రాజధానిలో ఆగస్టులో ప్రతిపాదిత కార్యక్రమానికి ముందు ప్రతి జిల్లాలో మాక్ పార్లమెంట్‌ను - మిగతా 11 లో

మంత్రివర్గ విస్తరణ?

విశాలాంధ్ర అమరావతి :
త్వరలో రాష్ట్ర కేబినెట్ విస్తరణ జరగనున్నట్టు తెలుస్తోంది. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని సమాచారం. అధికార పార్టీలో మంత్రులం కాలేకపోయామన్న నిరాశలో కొంతమంది నాయకులు ఉన్నారు. అలాంటి

రాజ్యసభకు యనమల

- నలుగురిపై వేటు... ఐదుగురికి చోటు
- చంద్రబాబు కసరత్తు

వారికి ఇది శుభవార్త. కొత్త సంవత్సరంలో చంద్రబాబు మరోసారి మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. గత ఏప్రిల్ 2న చంద్రబాబు మంత్రివర్గాన్ని విస్తరించి కొత్త, పాత కలయికలతో కూర్పు చేశారు. అయితే ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న కొందరు మంత్రుల పనితీరు పట్ల సీఎం అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది అక్టోబరులోనే జమిలి ఎన్నికలు జరగవచ్చని రాజకీయ పార్టీల్లో చర్చ సాగుతోంది. అందువల్ల ప్రస్తుతం ఉన్న టీమ్‌తో ఎన్నికలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవన్న



అభిప్రాయంలో సీఎం ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా ఈ ఏడాది రాష్ట్రం నుంచి రాజ్యసభలో మూడుస్థానాలు ఖాళీకానున్నాయి. ప్రస్తుత రాజ్యసభ సభ్యులు చిరంజీవి, సీఎం రమేష్, మరొకరి పదవీకాలం ఏప్రిల్ రెండుతో ముగియనుంది. ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లో శాసనసభలో బలాబలాలను బట్టి రెండు టీడీపీ, ఒకటి వైసీపీకి దక్కనున్నాయి. రెండు టీడీపీ స్థానాల్లో ఒకదానికి యనమల రామకృష్ణుడును ఎంపిక చేసి ఆయనను రాజ్యసభకు పంపించాలన్న ఆలోచన పార్టీ - మిగతా 2 లో

పైసా వసూల్..

- ఇళ్ల క్రమబద్ధీకరణ పేరుతో అక్రమార్జన
- అక్షయ పాత్రగా మారిన 388 జీఓ
- దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలే..!
- రూ.10 వేలు ఇస్తేనే క్లియరెన్స్ సర్టిఫికెట్
- ముక్కు పిండి వసూలు చేస్తున్న వీఆర్‌ఓలు
- అవినీతి నిరోధక శాఖ నీ అడ్రస్ ఎక్కడ?

11 లో



న్యూయార్క్‌లో బెలూచిస్థాన్ విముక్తి ఉద్యమం

న్యూయార్క్ : బెలూచిస్థాన్ (పాకిస్థాన్) విముక్తి కోసం ఇక్కడ ఏర్పడిన ప్రపంచ బెలూచిసంస్థ (డబ్ల్యూబీఓ) ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తున్నారు. నినాదాలు రాసిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వం మానవహక్కులను ఉల్లంఘిస్తున్నదని పాకిస్థాన్ నుంచి తమకు విముక్తి కావాలని ర్యాలీలో పాల్గొన్న ఉద్యమకారులు నినాదాలు చేశారు. ప్రసిద్ధి చెందిన టైమ్స్ స్క్వేర్‌లో వీరు ఉద్యమం నిర్వహించారు. ఆక్రమిత బెలూచిస్థాన్‌లో పాకిస్థాన్ అధికారులు బెలూచిస్థాన్ ప్రజలను కిడ్నాప్ చేస్తున్నారని, వారి స్వీయనిర్ణయ హక్కును హరిస్తున్నారని ప్రదర్శకులు నిసదించారు. ఈ ర్యాలీలో వందకుపైగా టాక్సీలలో వచ్చిన ఉద్యమకారులు పాల్గొన్నారు. న్యూయార్క్ నగరం నడిబొడ్డున గల ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. బెలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలని, పాకిస్థాన్ సంకెళ్ల నుంచి విముక్తి కావాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. బెలూచిస్థాన్ ప్రజల హక్కులను ఇస్లామాబాద్ ఉల్లంఘిస్తోందని వారు తెలిపారు. బెలూచి ప్రజల దుస్థితిని ప్రపంచానికి తెలిపేందుకే ఈ ర్యాలీ నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. బెలూచి ప్రజల మానవహక్కుల ఉల్లంఘన గురించి పాకిస్థాన్ ప్రభుత్వాన్ని అమెరికా, ఐక్యరాజ్యసమితి ప్రశ్నించాలని నిర్వాహకులు డిమాండు చేశారు. లండన్, జెనీవా నగరాలలో బెలూచిస్థాన్ విముక్తి కోసం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన తరువాత న్యూయార్క్‌లో చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ పత్రికా ప్రతినిధులను మానవహక్కుల పరిశీలకులను బెలూచి ప్రజలకు సహాయమందించే ఏజెన్సీలను బెలూచిస్థాన్‌లోకి పాకిస్థాన్ అనుమతించడంలేదని నిర్వాహకులు తెలిపారు. డిసెంబరు 20వ తేదీన ప్రారంభమైన ఈ ప్రచారోద్యమం నెలరోజులపాటు కొనసాగుతుంది.

దౌత్యవేత్తలు పార్టీకి బద్ధులై ఉండాలి

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన



బీజింగ్ : విదేశాలలో పనిచేస్తున్న లేదా పనిచేసి స్వదేశానికి తిరిగి వచ్చిన దౌత్యవేత్తలు కమ్యూనిస్టు పార్టీకి బద్ధులై ఉండాలని దేశానికి తమ సేవలను అందించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కూడా జిన్‌పింగ్ విదేశాలలో పనిచేసి తిరిగి వచ్చిన వందలాది మంది దౌత్యవేత్తలనుద్దేశించి మాట్లాడారు. ఇక్కడ గ్రేట్‌హాల్ ఆఫ్ ది పీపుల్‌లో విదేశాంగ శాఖ దౌత్యవేత్తల వార్షిక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో జిన్‌పింగ్ మాట్లాడుతూ, పార్టీకి, దేశానికి నిబద్ధత కలిగి ఉండడం అత్యంత కీలకమైనదని, దౌత్యవేత్తలకు ఇదే స్ఫూర్తినివ్వాలని ఆయన అన్నారు. దౌత్యవేత్తలు నాలుగు అంశాలను తప్పనిసరిగా అనుసరించాలి. రాజకీయ పరిపక్వత, అన్ని అంశాలపై మెరుగైన అవగాహన, పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వాన్ని అనుసరించడం, కేంద్ర కమిటీ విధానాన్ని పాటించడం అత్యంత కీలకమైనదని చెప్పారు. పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వాన్ని దౌత్యవేత్తలు తప్పనిసరిగా అనుసరించాలి. పార్టీ దౌత్యవిధానాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. దేశ ప్రయోజనాలను, గౌరవాన్ని పరిరక్షించాలి. దేశ ప్రజల కోసం పనిచేయాలి. గత ఐదేళ్లుగా దౌత్యవేత్తలుగా పనిచేసిన వారి పనివిధానాన్ని గుర్తించామని జిన్‌పింగ్ అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ తరపున దౌత్యవేత్తలకు అభినందనలు తెలిపారు. 2012లో జరిగిన పార్టీ 18వ మహాసభ నాటి నుంచి ఎదురైన ఇబ్బందులను దౌత్యవేత్తలు అధిగమించి దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను, అభివృద్ధి ప్రయోజనాలను పరిరక్షించి ప్రపంచ పాలనా విధానాలలో సానుకూలంగా పనిచేశారని, అలాగే బెల్ట్ అండ్ రోడ్డు ఇన్షియేటీవ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో కృషి చేశారని అన్నారు. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం నిర్మాణం నూతన శకంలోకి ప్రవేశించిందని ఆయన చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభ స్ఫూర్తిని దౌత్యవేత్తలంతా అర్ధంచేసుకోవాలని జిన్‌పింగ్ కోరారు. చైనా ప్రజలంతా సోషలిజం బాటలో నడిచి తమ లక్ష్యాలను పరిపూర్తిచేసుకున్నట్లైతే తప్పనిసరిగా దేశం మరింత పురోగమనం చెందుతుందని ఆయన తెలిపారు.

జర్మనీలో మహిళా భద్రతాజోన్లు

బెర్లిన్ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బెర్లిన్ తదితర ప్రాంతాలలో మహిళా భద్రతా జోన్లను ఏర్పాటుచేశారు. వేడుకలు జరిగే ప్రాంతాలకు అత్యంత సమీపంలో వైద్యవృత్తి నిపుణుల బృందాలను నియమించారు. లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు సహాయం కోరినప్పుడు వైద్యవృత్తి నిపుణులు వారి వద్దకు వెళ్లి సహాయం చేస్తారు. రెండేళ్ల క్రితం బెర్లిన్‌లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సామూహిక లైంగిక దాడులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని అధికారులు మహిళల భద్రత జోన్లను ఏర్పాటు చేశారు. అయితే, సామూహిక వేధింపులు, లైంగిక దాడులను అరికట్టడానికి ఈ చర్యలు సరిపోకపోవచ్చునని భావిస్తున్నారు.

ప్రజాసమూహాలు చేరినచోట వైద్య నిపుణులు, పోలీసు అధికారులు ఉండడం కొత్తేమి కాదని ప్రజలు భావిస్తున్నారు. జర్మన్ రెడ్‌క్రాస్ బృందానికి చెందిన ఐదుగురు సభ్యుల టీం తక్షణం సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటుంది. 2015 వేడుకల సందర్భగా అనేక నగరాలలో లైంగిక వేధింపులకు 1200 మందికిపైగా మహిళలు గురైన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు.

ఎవరెస్టు అధిరోహణపై ఆంక్షలు



ఖాట్మండు : ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడంపై నేపాల్ పర్యాటక మంత్రిత్వ శాఖ కొన్ని ఆంక్షలు విధించింది. ఒంటరిగా శిఖరంపైకి వెళ్లరాదని, రెండు కాళ్లు లేనివాళ్లు, అంధులు ఎవరెస్టు శిఖర అధిరోహణకు పూనుకోవద్దని నూతన నియమ, నిబంధనలను పర్యాటక శాఖ ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత ఎతైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించే సమయంలో మృతుల సంఖ్య ఇటీవల పెరిగినట్టు అంచనాలున్నాయి. మృతుల సంఖ్యను తగ్గించేందుకు ఈ ఆంక్షలు విధించినట్టుగా గార్డియన్ పత్రిక తెలిపింది. నూతన నియమనిబంధనలు విధించేందుకు దాదాపు నెలరోజులకు పైగా చర్చల అనంతరం పర్యాటక శాఖ సీనియర్ అధికారులు తమ ఆమోదం తెలిపారు. ఒంటరిగా శిఖర అధిరోహణకు వెళ్లాలంటే తప్పనిసరిగా గైడ్‌ని తీసుకువెళ్లాలి. ఎవరెస్టు శిఖరంపై పైకి వెళ్లే సమయంలో సహాయకులు తప్పనిసరి అవసరం. అలాగే, అనుమతి సర్టిఫికెట్లు కూడా తప్పనిసరిగా తీసుకోవాలి. ఎవరెస్టు శిఖర అధిరోహకులకు గరిష్ట వాయోపరిమితి 76 ఏళ్లు. అయితే, ఈ నిబంధనను పాటించడంలేదు. ఫలితంగా 85 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి 2017 మే నెలలో శిఖరాధిరోహణకు వచ్చి మృతిచెందారు. ఆక్సిజన్ తక్కువగా అందడమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే, 16 ఏళ్లలోపు వయస్కులు శిఖరాధిరోహణకు అనర్హులు. శిఖరాధిరోహకుల సంఖ్య మితిమీరి పెరుగుతోందని అనుభవం కలిగిన అధిరోహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వ్యయంతోనే తాము అధిరోహకులను పైకి తీసుకువెళతామని చెప్పే నూతన కంపెనీలు వచ్చాయి. అధిరోహకుల డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలు తరిగిపోతున్నాయి. 29,029 అడుగుల ఎత్తు కలిగిన ఎవరెస్టు శిఖర అధిరోహణకు అర్హత సర్టిఫికెట్లు జారీచేసే నిబంధనలను నేపాల్ ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. అయితే, ఈ నిబంధన తరుచుగా అతిక్రమించడం జరుగుతోంది. పర్యాటక శాఖ ఇచ్చిన వివరాల ప్రకారం అంగవైకల్యం కలిగిన 29 మంది ఎవరెస్టును అధిరోహించేందుకు ప్రయత్నించారు. వీరిలో 15 మంది శిఖరాన్ని అధిరోహించగలిగారు. 2006లో జరిగిన సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. అయితే, నూతన నియమ, నిబంధనలపైన అనుభవం కలిగిన అధిరోహకులు విమర&శలు గుప్పిస్తున్నారు.

ఇరాన్‌లో కొనసాగుతున్న నిరసన ర్యాలీలు

ఇస్తాంబుల్ : గత మూడు రోజులుగా ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసన ర్యాలీలు జరుగుతున్నాయని వార్తసంస్థలు, సోషల్ మీడియా తెలిపాయి. ఆర్థిక కష్టాల వల్ల తమ జీవనం కొనసాగించడం అత్యంత బాధాకరంగా ఉందని ప్రదర్శకులు చెపుతున్నారు. దేశాధ్యక్షులు హసన్ రౌహాణి ప్రభుత్వానికి ఈ నిరసనలు పెద్ద సవాల్‌గా నిలిచాయి. ధరల పెరుగుదల, అత్యధిక నిరుద్యోగం దేశవ్యాప్తంగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ప్రదర్శకులు నిసదించారు. పోలీసు ఆంక్షలను ఉల్లంఘిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆగ్రహం ప్రకటిస్తున్నారు. అక్రమంగా ప్రజలు గుమిగూడరాదని అధికారులు హెచ్చరికలు చేస్తున్నప్పటికి నూతన ప్రాంతాలకు నిరసనలు విస్తరిస్తున్నాయి. ప్రదర్శకులు ప్రభుత్వ భవనాలపై దాడులు చేయడం, పోలీసులతో ఘర్షణపడడంలాంటి దృశ్యాలను టెలివిజన్ ఛానల్స్ ప్రసారం చేస్తున్నాయి. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ప్రదర్శకులు చనిపోయినట్లుగా బీబీసీ పర్షియన్ ప్రాంత విభాగం ప్రసారం చేసింది. కాల్పుల దృశ్యం సోషల్ మీడియాలో కూడా ప్రచారమైంది. టెహరాన్‌లో దేశ అత్యున్నత నాయకుడిగా పరిగణిస్తున్న అయతులా అలీ ఖమేలి చిత్రాలను చించివేసి మంటల్లో వేసినట్టుగా వీడియో దృశ్యాలను ఛానల్స్ ప్రసారం చేశాయి. 2009లో వివాదాస్పదమైన ఎన్నికల ఫలితాలపై భారీ ప్రదర్శనలు జరిగాయి. ఆ తరువాత పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరగడం ఇదే. అయితే, ఈ సారి దిగువస్థాయి ప్రజలు కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు వార్తలందుతున్నాయి. ప్రజలు తమంతటతాముగానే నిరసనలలో పాల్గొంటున్నారని వార్తా ఏజెన్సీలు తెలుపుతున్నాయి. అయితే, దీనిని అసరాచేసుకుని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ ప్రజలు ప్రభుత్వం మారాలని కోరుకుంటున్నట్టుగా ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.

కొత్త సంవత్సర వేడుకలపై ఆంక్షలు



ధాకా : నూతన సంవత్సర వేడుకలపైన ధాకా ప్రజలు అనుసరించాల్సిన విధివిధానాలను నగర మెట్రోపాలిటిన్ పోలీసు కమిషనర్ ఖాన్ ప్రకటించారు. వేడుకలను ప్రజలు తమ ఇళ్లలోనే నిర్వహించుకోవాలని, ఇళ్లపైకెక్కి జరుపుకోవద్దని ఆంక్షలు విధించారు. విస్తృతమైన భద్రతా చర్యలను ఆయన ప్రకటించారు. ఆయన విధించిన ఆంక్షలను ధాకా మీడియా సెంటర్, ధాకా ట్రిబ్యూన్ పత్రికలు వెల్లడించాయి. విధించిన ఆంక్షలను పోలీసు కమిషనర్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ప్రజలు గుమిగూడడం, తీవ్రమైన ధ్వని కలిగించే సంగీత వాయిద్యాలను వినియోగించడం, నృత్యాలు, సంగీత కార్యక్రమాలు తదితర కార్యకలాపాలన్నింటిని బహిరంగ ప్రదేశాలలో నిషేధించినట్టుగా ఆయన చెప్పారు. ఇళ్లలో మాత్రమే వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు.

మంత్రివర్గ విస్తరణ ?

(మొదటిపేజీ తరువాయి)

అధిష్టానంలో నడుస్తోంది. అందుకు తగ్గట్టుగా మంత్రి యనమల తనకు రాజ్యసభకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రిని ఇప్పటికే కోరినట్లు తెలిసింది. తాను రాజ్యసభకు వెళ్లాలనుకుంటున్నానని ఆయన ఇటీవల మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. దాదాపు యనమలను రాజ్యసభకు పంపుతారని సీనియర్లు చెప్పుకొంటున్నారు. రాజ్యసభకు యనమల ఎన్నికైతే మంత్రి, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయాల్సి వస్తుంది. దీనికితోడు కొంతమంది మంత్రులు నియోజకవర్గాలకే పరిమితమవుతున్నారు. వీరివల్ల అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి పెద్ద ఉపయోగం లేదన్న అభిప్రాయంతోనే వారిని తొలగించి సమర్థులు, పాలనపై పట్టు, శాసనసభలో వాగ్దాటి ఉన్న వారిని కొత్తగా మంత్రులను చేయాలన్న తలంపుతో సీఎం ఉన్నారని తెలుస్తోంది. టీడీపీలో మంచి వాగ్ధాటి ఉన్నవారు శాసనమండలిలోనూ ఉన్నారు. దీనికి తోడు మంత్రివర్గంలో మైనార్టీ, గిరిజన ప్రతినిధులు లేరు. ఎన్నికల నాటికి ప్రతిపక్షాల విమర్శలకు తావివ్వకుండా ఆ రెండు వర్గాల ప్రతినిధులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలన్న అభిప్రాయం పార్టీ సీనియర్లలో వినిపిస్తోంది. పైగా పనితీరు సరిగా లేనివారిని వదిలించుకుంటానని చంద్రబాబు పార్టీ సమావేశాల్లో నిర్మొహమాటంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రి వార్నింగ్‌లు ఇస్తున్న జాబితాలో కొందరు మంత్రులు ఉన్నట్టు పార్టీ నేతలు చెప్పుకొంటున్నారు. యనమలతో ఓ మంత్రి పదవి ఖాళీ అవుతుంది. ఇక పనితీరు సరిగా లేదని భావిస్తున్న మంత్రులలో ప్రకాశం, కృష్ణా, పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాకు చెందిన నలుగురు మంత్రులపై వేటు వేసి కొత్తగా ఐదుగురు మంత్రులను కేబినెట్‌లోకి తీసుకుంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మొత్తం మీద ఈ ఏడాది జరగనున్న రాజ్యసభ ఎన్నికలలోపే మంత్రివర్గ విస్తరణ జరగటం ఖాయమని పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

బరితెగింపు

(మొదటిపేజీ తరువాయి)

రహితంగా కాల్పులు జరిపారు. కొద్ది నిమిషాల్లో తేరుకున్న బలగాలు ప్రతిదాడికి దిగాయి. శిబిరంలోని ఒక భవంతిలో నక్కిన ముగ్గురు ఉగ్రవాదులకు బలగాలకు మధ్య కొన్ని గంటల పాటు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ దాడిలో నలుగురు జవాన్లు వీర మరణం పొందినట్లు సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి రాజేష్ యాదవ్ తెలిపారు. బలగాల ప్రతిదాడిలో ముగ్గురు ఉగ్రవాదులను అంతం చేయగలిగినట్లు చెప్పారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో ఒకరు ఇక్కడకు సమీపంలోని నౌగావ్‌కు చెందిన సైఫుద్దీన్‌గా గుర్తించామన్నారు. దీనిపై డీజీపీ ఎస్‌పీ వాయిద్ స్పందిస్తూ ఉగ్రదాడికి అవకాశాలున్నట్లు నిఘా సమాచారం ఉందన్నారు. దాడికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. కాగా ఇదే ఆవరణలో జమ్ముకాశ్మీర్ పోలీసు బృందం ఒకటి బస చేస్తోంది.

మోడీ విదేశాంగ విధాన వైఫల్యం : కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ అనుసరిస్తున్న విదేశాంగ విధాన వైఫల్యానికి పుల్వామా ఉగ్రదాడి ఒక ఉదాహరణ మాత్రమేనని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుస్మిత దేవ్ మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి దాడులు తరచూ జరుగుతున్న తీరును చూస్తుంటే భారత్ అంటే వారికి(ఉగ్రవాదులు) భయం లేనట్లు కనిపిస్తోందన్నారు. పాకిస్తాన్‌కు గుణపాఠం చెబుతానంటూ రొమ్ము విరుచుకుని చెప్పడమే తప్ప మోడీ ఉగ్రవాద దాడులను నిరోధించలేకపోయారని విమర్శించారు. క్రిస్మస్ తరువాత పాకిస్తాన్‌తో మాట కలిపారు. అంతలోనే ఉగ్రదాడి జరిగింది. పైగా దాడికి సంబంధించి ముందస్తు నిఘా సమాచారం ఉందని అధికారులు ప్రకటిస్తున్నారు. సమాచారం ఉన్నప్పటికీ దాడి జరిగిందంటే అది (మోడీ) విధాన వైఫల్యమే కదా? అని దేవ్ ప్రశ్నించారు. మోడీ అనుసరించే విదేశాంగ విధానంలో నిలకడ లోపించిందని దుయ్యబట్టారు.

రజనీ.. ద లీడర్

(మొదటిపేజీ తరువాయి)

గత నెలలో రాజకీయ ప్రవేశ ఉద్దేశాన్ని ప్రకటించిన మరో ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఈ సందర్భంగా రజనీకాంత్‌ను అభినందించారు. కాగా 2021లో వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 234 స్థానాలకూ తన పార్టీ పోటీ చేస్తుందని రజనీకాంత్ తెలిపారు. అలాగే 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ చేసే విషయమై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. తన పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోపు ఎన్నికల హామీలను పరిపూర్తి చేయనట్లయితే రాజీనామా చేస్తామని ఆయన చెప్పారు. అధికారం కోసం తాను రాజకీయాల్లోకి రావడం లేదన్నారు. 'ముఖ్యమంత్రి పదవి నాకు చాలా కాలం క్రితమే వచ్చింది. కానీ దూరంగా ఉన్నాను. నేను నలభైల్లో ఉన్నపుడు ముఖ్యమంత్రి పదవి పొందాలన్న ఉద్దేశం నాకు లేదు' అని రజనీకాంత్ తెలిపారు.

రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశం చేసినట్లయితే తదుపరి ముఖ్యమంత్రి ఆయనేనంటూ గత కొన్ని రోజులకుపైగా చెన్నైలో పోస్టర్లు దర్శనమిచ్చాయి. లక్షలాది మంది అభిమానులకు ఆరాధ్యంగా ఉన్న ఈ నటుడు మాట్లాడుతూ తన కొత్త పార్టీకి కార్యకర్తలు అవసరం లేదని, కానీ 'పర్యవేక్షకులు' అవసరమన్నారు. 'ఈ పర్యవేక్షకులకు నేను నాయకత్వం వహిస్తాను. ప్రతి గ్రామంలోని ప్రజలందరినీ కలుపుకుంటాం. ఇదే నా మొదటి పని. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సరైన సమయంలో మా విధానాలు, హామీలు వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

ఇదిలాఉండగా, తమతో చేరాలని బహిరంగంగా ఆఫర్ ప్రకటించిన బీజేపీ కూడా ఆదివారం రజనీకాంత్‌కు అభినందనలు తెలిపింది. 'బీజేపీ ఏకైక లక్ష్యమైన అవినీతి రహిత సుపరిపాలన నినాదంతో నటుడు రజనీకాంత్ రాజకీయ ప్రవేశాన్ని స్వాగతిస్తున్నాం' అంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు టి.సౌందర్యరాజన్ ట్వీట్ చేశారు. అయితే అంతకుముందు, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ తమ పార్టీలోకి రజనీకాంత్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. గత నెలలో చెన్నై పర్యటన సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా రజనీని కలుసుకున్నారు.

జయలలిత మరణంతో అధికార ఏఐఏడీఎంకెలో అధికారం కోసం పోరు మొదలైంది. ముఖ్యమంత్రి ఇ.పళనిస్వామి, ఆయన సహచరుడు ఒ.పన్నీరు సెల్వంల మధ్య విభేదాలు పొడసూపి రెండు వర్గాలుగా చీలారు. ఫలితంగా ఆర్.కె.నగర్ ఉప ఎన్నికలో ఏఐఏడీఎంకె ఓటమి పాలైంది. కాగా మాజీ ముఖ్యమంత్రి వారసురాలుగా చెప్పుకున్న జయలలిత సన్నిహితురాలు వి.కె.శశికళ మేనల్లుడు, తిరుగుబాటు నాయకుడు టీటీవీ దినకరన్‌ను పక్కనబెట్టి విలీనమైన ఏఐఏడీఎంకె జయలలిత ప్రాతినిధ్యం వహించిన ఆర్కే నగర్ స్థానాన్ని కోల్పోయింది. ఇక గత నెలలో రాజకీయ ఉద్దేశాలను వెల్లడించిన కమల్‌హాసన్ కొన్ని వారాలుగా అధికార పార్టీని సవాల్ చేస్తూ వచ్చారు. ప్రభుత్వం అవినీతిమయమైందని, పాలన అధ్వానంగా ఉందంటూ ఆరోపించారు. కాగా ఆదివారం ఉదయం కమల్ ట్వీట్ చేస్తూ, 'రజనీ సామాజిక బాధ్యతను, రాజకీయ రంగ ప్రవేశాన్ని అభినందిస్తున్నా, స్వాగతం.. స్వాగతం' అని పేర్కొన్నారు.

అయితే బహిరంగ విమర్శలకు దిగకుండా తన ప్రణాళికల విషయంలో నిగూఢంగా వ్యవహరించే రజనీకాంత్, 'దేవుడు తలిస్తే, రేపే రాజకీయ రంగ ప్రవేశం చేస్తాను' అని అంటూ మే నెలలో చేసిన ప్రకటన సంచలనానికి దారితీసింది. 'తలైవర్' లేదా 'అల్టిమేట్ బాస్'గా అభిమానులు పిలుచుకునే రజనీకాంత్ ఈ వారం మొదట్లో తన ప్రణాళికల గురించి గట్టి సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లోకి ప్రవేశించాలంటే గెలుపు వ్యూహం అవసరమని చెప్పారు. ఇదిలాఉండగా, 1996లో డీఎంకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను రజనీకాంత్ కోరారు. తన ఆకర్షణీయమైన ప్రత్యర్థి జయలలిత కాదని ప్రముఖంగా ప్రకటించారు. 'జయలలిత మళ్లీ అధికారంలోకి వచ్చినట్లయితే తమిళనాడును దేవుడు కూడా రక్షించలేడు' అని అన్నారు. ఈ నేపథ్యంలో 1996లో రాష్ట్ర ఎన్నికల్లో డీఎంకె విజయం సాధించింది. కానీ ఆ తర్వాత సూపర్ స్టార్ మాట్లాడుతూ 'యాధృచ్ఛికంగా జరిగిన తప్పు' అని పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యానికి ఏపీ వేదిక

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 5 సంవత్సరాలలో రూ.700 కోట్లలతో దాదాపు 12.50 లక్షల ఎకరాలలో ప్రకృతి సేద్య విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులను చంద్రన్న విలేజి మాల్స్‌లో విక్రయించే ఏర్పాట్లు చేస్తామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ మాట్లాడుతూ విదర్భలో రసాయనిక ఎరువులు వాడకం వలన రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి ప్రకృతి సేద్యం విధానంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకృతి సేద్యంపై ఆసక్తి కనపరచడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వలన ప్రకృతి సేద్యం వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఒక గోవు మల, మూత్రాలతో 30 ఎకరాలు సాగు చేయవచ్చునని, దీని ద్వారా అధిక దిగుబడులు పొదవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పత్తిలో గులాబి రంగు పురుగును అరికట్టవచ్చునన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని మండల కేంద్రాలు ప్రకృతి వ్యవసాయ విత్తన ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎంకు సూచించారు.

ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ రైతులకు బ్యాంక్ రుణాలు, నీరు, గిట్టుబాటు ధరలు అందించేందుకు ప్రభుత్వం అండగా ఉండాలన్నారు.

జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జానీమూన్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకుడు గుంటలు తవ్వించి రైతులు పండించే పంటలకు నీరు అందించుకోగాలిగామని అన్నారు. ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి రైతు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపి మంచి ఆదాయాన్ని కలిగి ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ కోన శశిధర్ మాట్లాడుతూ నేటి వాతావరణ పరిస్థితులలో ప్రకృతి సేద్య విధానాన్ని అవలంభించడం ద్వారా రైతుకు మంచి లాభాలు వస్తాయని అన్నారు. వ్యవసాయ, సహకార శాఖల ప్రభుత్వ సలహాదారు విజయ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 8 వరకు ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రైతులు, రైతు శిక్షకులు సుమారు 8 వేల మంది హాజరైనట్లు తెలిపారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వివిధ జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు, వారు పండించిన విధానం, సాధించిన దిగుబడులు, పెట్టిన పెట్టుబడి, వచ్చిన ఆదాయాన్ని రైతులు వివరించారు.

చిత్తూరు జిల్లా నుండి వచ్చిన మహిళా రైతు లక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా టమాటా పంట పండించి మంచి ఆదాయాన్ని పొందానని చెప్పారు. నెల్లూరు జిల్లా నుండి వచ్చిన మల్లిఖార్జున రావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులతో తాను పండించిన వరి పంట భారీ వర్షాలకు నెలకు ఒరిగిపోయిందని, ప్రకృతి సేద్యం విధానం ద్వారా పండించిన వరి పంటకు ఏమాత్రం ఇబ్బంది కలగలేదని, పంట చేతికి అంది మంచి లాభాలు తెచ్చిపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మారిషస్ హై కమిషనర్ జగదీశ్వర్ గోవర్ధన్, మేఘాలయ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, శాసన సభ సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు, రాష్ట్ర మంత్రులు ప్రతిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, శాసన మండలి విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆహార కమిషన్ అధ్యక్షుడు జె.ఆర్.పుష్పరాజ్, శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, రావెల కిషోర్ బాబు, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరి జవహర్ లాల్, సంయుక్త కలెక్టర్-2 ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజయభారతి, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

తేలిపోవడం వల్లే రాష్ట్రాన్ని పట్టించుకోవడంలేదన్నారు. పోలవరం విషయంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయంగా విభేదాలు ఉండడం వల్లే పరిష్కారానికి నోచుకోవడంలేదని ఆయన పునరుద్ఘాటించారు. దీనిపై స్వయంగా జోక్యం చేసుకోవాలని ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోడీని కలసి కోరినట్లు నారాయణ వివరించారు. దాసరిభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాఫర్ డ్యామ్ పనులు నిలిపివేయడమే కాకుండా ఇంకా 65వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. తూర్పుగోదావరిజిల్లాలో భూమిని సర్వే చేయాలన్నారు. రూ. 33 కోట్లను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలుగా చెల్లించాల్సి ఉన్నందున 2019నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడం సాధ్యం కాదన్న విషయాన్ని మోడీ దృష్టికి తెచ్చామన్నారు. ముఖ్యంగా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కేంద్ర-రాష్ట్రాల మధ్య రాజకీయాలవల్ల వచ్చే చిక్కుముడులు వీడే వరకూ ఈ ప్రాజెక్టు ముందుకు కదిలే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. తాము చెప్పినవన్నీ మోడీ సావధానంగా విని సానుకూలంగా స్పందించారన్నారు. ప్రత్యేక తెలంగాణతోపాటు పోలవరం ప్రాజెక్టుపై అప్పుడు, ఇప్పుడు సీపీఐ ఒకే మాటపై నిలబడి ఉందన్నారు. ఈ రాష్ట్రానికి చెందిన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోలేకపోవడం విచారకరమన్నారు. రాజధాని నిర్మాణం సహా ఉత్తరాంధ్ర, రాయలసీమలోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు, లోటు బడ్జెట్ భర్తీ చేయలేదన్నారు. రాష్ట్ర విభజనానంతరం ఏపీ అభివృద్ధి చెందకుండా అడ్డుపడడంలో బీజేపీ మొదటి ముద్దాయిగా నిలుస్తుందన్నారు. ఒకప్పుడు కేంద్రంలో చక్రం తిప్పిన చంద్రబాబు, వెంకయ్యలు ఇప్పుడు ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. ప్రస్తుతం చక్రం మాత్రమే ఉందని, దానిలో వేలు లేదని ఆయన చమత్కరించారు. ఇప్పటికైనా చంద్రబాబు, వెంకయ్యలు రాష్ట్రానికి న్యాయం చేస్తారో లేదో స్పష్టం చేయాలని డిమాండు చేశారు. దక్షిణాదిలో తమ ఆటలు సాగవని భావించినందునే బీజేపీ స్వార్ధ రాజకీయాలను నడుపుతోందన్నారు. తమిళనాడులో ఇటీవల జరిగిన ఉప ఎన్నికే ఇందుకు అద్దం పడుతోందన్నారు. ఏపీని అతలాకుతలం చేయాలని బీజేపీ కంకణం కట్టుకుందని, దీనికి ప్రధాని మోడీనే స్వయంగా దిశానిర్దేశం చేస్తున్నారని విమర్శించారు. ఎఫ్ఆర్‌డీఐ చట్టం అమలులోకి వస్తే సామాన్యులకు కష్టాలు తప్పవన్నారు. బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో దాచుకున్నవారికి ఆయా మొత్తాలపై అధికారం ఉండదన్నారు. బ్యాంకుల నుంచి వేలాది కోట్లను రుణాలుగా తీసుకొని ఎగ్గొట్టే కార్పొరేట్లను, బ్యాంకులను కాపాడేందుకు వివిధ మొత్తాల్లో డిపాజిట్ చేసినవారిని ముంచేందుకే ఈ బిల్లును తీసుకొస్తున్నారని నారాయణ విమర్శించారు. బ్యాంకులు దివాళా తీసినట్లయితే డిపాజిట్లను తిరిగివ్వరనే విషయం ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఈ చట్టం ద్వారా కేంద్రం పట్టపగలే ప్రజలను దోచుకునే విధానంగా ఉన్నదని ఆయన అభివర్ణించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకొని రాజకీయ విధానాలను నిర్దిష్టంగా ప్రకటించి ప్రజల్లోకి రావాలని నారాయణ హితవు పలికారు.

పోరాటాల సంవత్సరంగా 2018: ముప్పాళ్ల :

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలవల్ల 2017 సంవత్సరం నిరాశ, నిస్పృలతో సాగిందని, రాబోయే 2018 సంవత్సరం పోరాటాలు, ప్రజాచైతన్య సంవత్సరంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు బహుళ ప్రయోజనాలు కలిగించే పోలవరం ప్రాజెక్టు విషయమై కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండు చేశారు.

మోడీ అధికారంలోకి వచ్చి ముదున్నరేళ్లు కావస్తోందని, ఇంతకాలం ఆయన మోసపూరిత మాటలతో కాలం వెళ్లదీశారే తప్ప రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏపీ చేయాలేదన్నారు. ఇంకా ఈ సమావేశంలో సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వండి: వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాబోయే రోజుల్లో వ్యవసాయానికి ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. వ్యవసాయరంగంలో ప్రస్తుతం ఆటుపోట్లున్నాయని, పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక మధ్య దళారీల పాత్ర ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల ఉత్పత్తిదారుడు, వినియోగదారుడు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గన్నవరం నియోజకవర్గం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో ఆదివారం ఆయన విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో మౌలిక రంగాలు అభివృద్ధి చెందాలని ప్రజానీకం కోరుకుంటున్నారన్నారు. ప్రపంచం ఆర్థిక మందగమనంలో ఉన్నా కూడా భారతదేశ ఆర్థిక వ్యవస్థ దానిని తట్టుకొని నిలబడిందన్నారు. మానవీయ కోణంలో సంస్కరణలను ప్రజలు ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశంతోపాటు సమాజం పట్ల, భాష పట్ల గౌరవం పెంచుకోవాలని ఆయన సూచించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, అంకితభావం అలవరచుకోవాలని, దీనికి తానే ఉదాహరణగా నిలుస్తానని చెప్పారు. 2018వ సంవత్సర సంకల్పంగా యువత కష్టపడడం అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు. పత్రికలు కూడా సానుకూల దృక్పథంతో వ్యవహరించి సత్యానికి దగ్గరగా పనిచేస్తూ సమన్వయం పాటిస్తే మంచి జరుగుతుందన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

బండారుపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర చైర్మన్ మేరుగు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పెందుర్తిలో దళిత మహిళను వివస్త్రం చేసిన సంఘటనలో కారకులైన టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, అతడి కుమారుడిపై చర్యల కోసం జాతీయ ఎస్సీకమిషన్, మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర చైర్మన్ మేరుగు నాగార్జున పేర్కొన్నారు.విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండారు సత్యనారాయణ. ఆయన కుమారుడిపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోకుంటే..చరిత్రలో దళిత ద్రోహిగా మిగిలిపోతారని విమర్శించారు.పెందుర్తి ప్రాంతంలో సత్యనారాయణ, ఆయన కుటుంబీకులు అనేక భూ కబ్జాలకు పాల్పడ్డారని,ఈయన జీవితమే అవినీతి మయమని దుయ్యబట్టారు.తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎంపీ విజయసాయిరెడ్డిపై బండారు చేస్తున్న ఆరోపణలన్నీ అర్థరహితమైనవని ఖండించారు.

ప్రధాని పదవిపై వ్యామోహం లేదు : వెంకయ్యనాయుడు

విశాలాంధ్ర,ఉంగుటూరు: ప్రధాని పదవిపై తనకు వ్యామోహం లేదని, ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. మారుమూల గ్రామంలో పుట్టి దేశంలో రెండవ అత్యున్నతస్థానానికి చేరుకోవటం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఆదివారం ఉదయం ఉంగుటూరు మండలపరిధిలోని ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్ ట్రస్టులో వెంకయ్యనాయుడు సీనియర్ జర్నలిస్టులకు అల్పాహార విందు ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తాము ఎంచుకున్న రంగాలలో అంకితభావంతో పనిచేస్తే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చు అనడానికి ఆయనే పెద్ద ఉదాహరణ అన్నారు.1970లో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని అనంతరం రాజకీయాలోకి వచ్చి ప్రజాఉద్యమాలలో పాల్గొన్నట్లు వివరించారు. జీవితంలో పత్రికల పాత్ర మరువలేనిదని అన్నారు. పత్రికలలో వచ్చే సమాచారం ఖచ్చితమైతే అది ఆయుధంకన్నా శక్తివంతమైనది అన్నారు. దేశంలో ప్రజలు,పత్రికలు సానుకూల దృక్పదంతో ఉండాలని ఆకాంక్షించారు. సానుకూల ధృక్పదం అంటే ప్రభుత్వాలకు బాకా ఊదటం కాదని, తప్పులను ఎత్తిచూపుతూ మంచిపనులను ప్రోత్సహిస్తూ ఉండటం అన్నారు. చట్టసభలలో అర్ధవంతమైన చర్చలు జరగాలని అభిప్రాయం వ్యక్తం చేసారు. ప్రస్తుతం వ్యక్తిగత ఆరోపణలు,విమర్శలు, గందరగోళంతో చట్టసభలలో సమయం వృధా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. కొత్త సంవత్సరాన్ని ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మాలకొండయ్య పదవీ స్వీకారం



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ)గా ఎం మాలకొండయ్య ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పదవీ విరమణ చేసిన డీజీపీ నండూరి సాంబశివరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1985 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మాలకొండయ్య ప్రస్తుతం ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. సవరించిన పోలీసు చట్టం ప్రకారం ప్రభుత్వం మాలకొండయ్యను డీజీపీగా ఎంపిక చేసింది. దీంతో ఆయన ఆదివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బాధ్యతలు స్వీకరించారు. మాలకొండయ్యను పలువురు పోలీసు ఉన్నతాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన శాంతి-భద్రతల డీజీపీ, అదనపు డీజీపీలు, ఐజీలు, డీఐజీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. మాలకొండయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. పెరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు సమష్టిగా కృషి చేస్తానన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. అమరావతి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. మాజీ డీజీపీ ఎన్ సాంబశివరావు అమలు చేసిన పథకాలను కొనసాగించటంతోపాటు కాలనుగుణంగా మరిన్ని కొత్త పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పోలీసుశాఖను తీర్చిదిద్దటంతోపాటు నేరాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. నేరాలు జరిగిన తర్వాత బాధపడేకంటే, జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై నేరాలను అదుపు చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలియజేశారు. కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నీతీ, నిజాయితీగా పని చేస్తూ ప్రజలకు పోలీసులను దగ్గర చేసేందుకు కృషి చేస్తానని మాలకొండయ్య వివరించారు.

పుస్తకప్రియుడు పోలీస్‌బాస్

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాష్ట్రంలోని పోలీస్ వ్యవస్థకు పెద్దబాస్.. చుట్టూ ఏకే47లు, అడుగడుగునా బూటు శబ్దాలతో సెల్యూట్‌లు, నమస్కారాలు, రాష్ట్రంలో ఏ మూలకు వెళ్ళినా ప్రోటోకాల్‌తో గౌరవమర్యాదలు, నిత్యం ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, పోలీస్ అధికారులతో సమీక్షలు, సమావేశాలు, ఇతర రాష్ట్రాల్లో పర్యటనలు, కేంద్ర ప్రభుత్వ సమావేశాలకు హాజరు, బదిలీల్లో ఒత్తిడులు, క్రిందిస్థాయి పోలీస్ సిబ్బంది బాధలు ఇది డీజీపీ పదవిలో ఉన్నవారి నిత్యకృత్యం. పోలీస్ అధికారులు రఫ్ అండ్ టఫ్‌గా మాట్లాడతారని సమాజంలో అపోహ ఉంది. కొందరు పోలీస్ బాస్‌లు అలానే వ్యవహరిస్తుంటారు కూడా. అయితే అలాంటి వారికి భిన్నంగా ఉండే వ్యక్తి ప్రస్తుతం మన రాష్ట్రానికి కొత్త పోలీస్‌బాస్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన అందరు పోలీసుల్లాగా కఠినంగా మాట్లాడరు. చిన్నవారితో సైతం గౌరవంగా , సున్నితంగా వ్యవహరిస్తారు. అయినా విధి నిర్వహణలో మెతకవైఖరి అవలంభించరు. తన శాఖలో తప్పు చేసిన వారిపై వేటు వేసేందుకు వెనుకాడరు. రాజకీయ ఒత్తిళ్ళను ఖాతరు చేయరు. ఆయనే కొత్త పోలీస్‌బాస్ మన్నం మాలకొండయ్య. అయితే ఇదంతా ఆయనలోని ఓ పార్శ్వం మాత్రమే. చాలా మందికి తెలియని రెండవ పార్శ్వం పుస్తక ప్రియుడన్న విషయం. నిత్యం విధి నిర్వహణలో క్షణం తీరికలేకుండా గడిపే ఆయన ఏ మాత్రం కాస్త ఖాళీ దొరికినా పుస్తకంలో తల దూర్చేస్తారు. ఎక్కడికి వెళ్ళినా హస్త భూషణంలా ఏదొక పుస్తకం ఆయనకు తోడుంటుంది. ఒకటా, రెండా కొన్ని వేల పుస్తకాలు ఒకటని కాకుండా అన్ని విషయాలకు చెందిన పుస్తకాలను చదివిన చదువరి ఆయన. ఏ అంశంపైనైనా ఆయన అనర్గళంగా మాట్లాడగలిగే సంపూర్ణ అవగాహన ఆయన సొంతం. గుండుసూది నుంచి అంతరిక్షం వరకు, ప్రపంచ దేశాలు అక్కడి సంస్కృతులు, జీవనస్థితులు, పాలనతీరు గురించి తెలుసుకుంటారు. అలాగే ప్రముఖ సాహితీవేత్తల గ్రంధాలు కూడా చదువుతారు. గురువులంటే అత్యంత గౌరవం. ఉన్నత విద్యావంతులను అమితంగా గౌరవిస్తారు. ఇదంతా తనకు పుస్తక పఠనం వల్లే సాధ్యమైందని చెప్తుంటారు. పోలీస్ వ్యవస్థలో ఆయన ఓ ఉన్నతాధికారిగానే సుపరిచితుడు. ఆయన్నెరిగిన కొద్దిమందికే ఆయన నడిచే ఎన్‌సైక్లోపీడియా అని. ఇంటర్నెట్ మనుషుల జీవితాల్లోకి చొచ్చుకొని వచ్చిన తర్వాత పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గిపోయింది. ఎవరినైనా పుస్తకాలు చదవరా అంటే మాకు సమయం ఎక్కడ ఉందని ఎదురు ప్రశ్నిస్తుంటారు. ఇలాంటి వారికి మన పోలీస్‌బాస్ ఆదర్శప్రాయుడు. వృత్తిలో ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ పుస్తక పఠనం మానలేదు. ఆయనకు ప్రాపంచిక విషయాలపై ఎంత అవగాహన ఉన్నా ఆయన వేదికలెక్కి అదేపనిగా మాట్లాడేందుకు ఇష్టపడరు. చదివిన పుస్తకాలు గ్రంధాలయాలకు వితరణ చేస్తుంటారు. ఏదైనా గ్రంధాలయంలో పుస్తకాల కొరత ఉందని తెలిస్తే ఆ గ్రంధాలయానికి తన దగ్గరున్న పుస్తకాలను అందిస్తుంటారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం సముపార్జన సాధ్యమని విశ్వసిస్తారు బుక్ లవర్... మాలకొండయ్య.



మహిళలకు
అండగా ఉంటాం : జగన్

విశాలాంధ్ర- కురబలకోట : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చిత్తూరు జిల్లా, పడమటి ప్రాంతాల రైతాంగం జీవనాడి అయిన హంద్రీనీవాను పూర్తిచేసి తాగు సాగునీటి కష్టాలు శాశ్వతంగా పరిష్కరిస్తామని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం తంబళ్ళపల్లి నియోజకవర్గంలో ప్రజా సంకల్పపాదయాత్ర కొనసాగింది. అడుగడుగునా ప్రజలు ప్రతిపక్ష నాయకుడికి ఆత్మీయస్వాగతం పలుకుతూ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తంబళ్ళపల్లి మండలం. మూలపల్లె నుంచి ప్రారంభమైన పాదయాత్ర కురబలకోట మండలం, ముదివేడు వరకు కొనసాగింది. ఈ పాదయాత్రలో భాగంగా ప్రతిపక్షనేత కన్నెమడుగు, దాదం వారిపల్లి, ముదివేడు గ్రామాలలో స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించడంతో పాటు పార్టీ జెండాలను ఎగురవేశారు. 4వరోజు కురబలకోట మండలం, గడ్డెత్తువారిపల్లిలో ప్రజా సంకల్పయాత్ర ముగించుకొని మదనపల్లె మండలం, సిటీయం గ్రామ పంచాయతీలోకి పాదయాత్ర ప్రవేశించనుంది. ఈ కార్యక్రమంలో నాయకులు పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, దేశాయ్ తిప్పారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, మరియు వైసీపీ నాయకులు. కార్యకర్తలు, అభిమానులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీజీపీ పదవికే అలంకారం తెచ్చాను

- 18 నెలల పదవి సంతృప్తినిచ్చింది
- పదవీ విరమణ సభలో సాంబశివరావు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : డీజీపీ పదవి తనకు అలంకారం కాదని. తానే ఆ పదవికి అలంకారంగా ఉన్నట్లు పదవీ విరమణ చేసిన డీజీపీ నండూరి సాంబశివరావు అన్నారు. 18 నెలలపాటు ఆ పదవిలో సంతృప్తికరంగా పని చేసినట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది సమష్టి సహకారంతో పోలీసు శాఖలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖకు దేశంలోనే ఒక ప్రత్యేకత ఉందని. ఎంతటి క్లిష్టమైన కేసునైనా పరిష్కరిస్తారనే పేరు ఉందని తెలిపారు. సాంబశివరావు పదవీ విరమణ సభ మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో ఆదివారం జరిగింది. తొలుత సాంబశివరావు పెరేడ్‌ను పరిశీలించి ఏపీఎస్పీ బెటాలియన్‌ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత పోలీసుశాఖకు కనీస సౌకర్యాలు లేవని, ఆ సమయంలో సీఎం చంద్రబాబు సహకారంతో ఆరో బెటాలియన్‌లో అత్యాధునిక సౌకర్యాలతో పోలీసు హెడ్‌క్వార్టర్‌ను నిర్మించినట్లు తెలిపారు. మోడల్ పోలీస్ స్టేషన్ల నిర్మాణం, సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలోనూ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. పోలీసుశాఖలోనే అత్యున్నత డీజీపీ పోస్టును పొందానంటే అందుకు ఉపాధ్యాయులే కారణమని తెలిపారు. ఐపీఎస్ శిక్షణ పూర్తయి తొలిసారిగా 1987 ఫిబ్రవరిలో బెల్లంపల్లి ఏఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించినపుడు తీవ్రవాద సమస్య ఎక్కువగా ఉండేదని సాంబశివరావు చెప్పారు. తీవ్రవాదులపై పోరాడి అనేక మంది పోలీసులు ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సీఎం చంద్రబాబు సహకారంతో 120 బస్ స్టేషన్‌లను ఆధునికీకరించినట్లు సాంబశివరావు చెప్పారు. నూతన డీజీపీ ఎం మాలకొండయ్య మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన డీజీపీ సాంబశివరావు అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు. ఏఎస్పీగా ఇద్దరం ఒకే ఎస్ఐ వద్ద శిక్షణ పొందామని. అలాంటి సీనియర్ సూచనలు, సలహాలను ఎప్పటికీ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్స్ ఐజీ ఆర్‌కే మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీసుశాఖ ఉన్నతాధికారులతో సాంబశివరావు, మాలకొండయ్య ఫోటోలు దిగారు. సాంబశివరావుకు పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. కొత్త డీజీపీ మాలకొండయ్యకు బాధ్యతలు అప్పగించిన అనంతరం ఆయన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సాగనంపారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్, సీఐడీ ఏడీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఇంటెలిజెన్స్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు, గ్రేహౌండ్స్ ఏడీజీపీ ఎన్‌వీ సురేంద్రబాబు, ఐజీలు అమిత్ గార్గ్, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఏ-1 మూల్యాంకనంలో జాప్యం..

- సర్కారు పాఠశాలల్లో పూర్తికాని టెన్త్ సిలబస్
- మ్యాథ్స్, ఇంగ్లీషుపై విద్యార్థుల భయాందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఎస్‌ఏ-1(సమ్మిటేటివ్ ఎస్సెస్‌మెంట్) పరీక్ష మూల్యాంకనంలో జాప్యం నెలకొంది.డిసెంబరు 15నుంచి 22వ తేదీ వరకూ 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలు కొనసాగాయి. ఇందులో 6, 7,10 తరగతులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకే మూల్యాంకనం బాధ్యతల్ని అప్పగించారు.8, 9 తరగతులకు డీఈవోల పర్యవేక్షణలో నిర్వహిస్తారు. దీంతో పరీక్షలు పూర్తయిన వెంటనే ఓఎంఆర్ ఆన్సర్ షీట్లను ప్రత్యేక బండిళ్లతో ఎంఈవోల ద్వారా డీఈవోలకు ప్రధానోపాధ్యాయులు పంపారు.ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌తో ఫలితాల్ని వెల్లడిస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది.ఫలితాల సమాచారాన్ని డీఈవోల ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపాలి.ఇంతవరకూ ఎస్‌ఏ-1 ఫలితాల వివరాల్ని వెల్లడించలేదు. డిసెంబరు గడచినా సిలబస్ పూర్తవ్వలేదు. ఎస్‌ఏ-1 పరీక్షలను ఉన్న పళంగా నిర్వహించడంతోనే ఉపాధ్యాయుల బోధనకు అసౌకర్యం కలిగింది. విద్యార్థుల్ని పరీక్షలకు సిద్ధం చేయడంతోనే సగం సమయం వృథా అయింది.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తామనే ప్రభుత్వ ఆశయం అమలుకు నోచుకోలేదు. టెన్త్‌లో మ్యాథ్స్, ఇంగ్లీషు సబ్జెక్టులపై విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో ఎక్కువ మందికి ఈ సబ్జెక్టులపై అవగాహన కొరవడింది. గత ఏడాది టెన్త్ పరీక్షా ఫలితాలే ఇందుకు నిదర్శనం. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి మ్యాథ్స్, ఇంగ్లీషుపై పట్టులేనందున టెన్త్‌లో అభద్రతా భావానికి గురవుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం..వయస్సుకు తగిన విధంగా పైతరగతిలోకి పంపాల్సిన నిబంధన ఉంది.వారి చదువులకు ఎక్కడా ఆటంకం కలగలేదు. సబ్జెక్టుల్లో విద్యార్థులు పూర్తిగా అవగాహన పొందలేక పోతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు మ్యాథ్స్, ఇంగ్లీషు సబ్జెక్టులలో సీ, డీ గ్రేడ్లు వస్తున్నాయి.టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం పెంపుదల కోసం అన్ని జిల్లాల్లోనూ జిల్లా పరిషత్ చైర్మన్లు, డీఈవోల ఆధ్వర్యాన ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశాల్ని నిర్వహిస్తున్నారు.మార్చి 15 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి.ఏడాది పూర్తవుతున్నప్పటికీ సిలబస్ కొలిక్కిరాలేదు. ప్రత్యేక తరగతులతో ఈ సబ్జెక్టులపై విద్యార్థుల్లో భయాందోళన తొలగించాల్సిన అవసరముంది. జన్మభూమి కార్యక్రమాల్లో ఉపాధ్యాయుల్ని భాగస్వాముల్ని చేయడంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జనవరి 2 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించబోయే జన్మభూమి సభలకు ఉపాధ్యాయులు రావాలనటాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు. అదనపు బాధ్యతల్ని నుంచి వారిని తొలగించాలని కోరుతున్నారు.

చంద్రబాబు భూదాహంపై పోరాడుతాం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



విశాలాంధ్ర -అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూదాహంపై పోరాటం కొనసాగిస్తామని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బలవంతపు భూసేకరణ నిలిపివేయాలంటూ భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాజధాని గ్రామ మైన ఉండవల్లిలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఉండవల్లి,పెనుమాక గ్రామాల రైతులతో పాటు పలు కారణాలతో నిర్వాసితులువుతున్న బాధితులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి నియంత మాదిరిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. వేలాది ఎకరాలు రైతుల నుంచి తీసుకొని బడా సంస్థలకి వేల కోట్లకు అమ్ముకుంటూ భూములు ఇచ్చిన రైతుల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతు కూలీలు, కౌలురై తులు నేడు పూట గడవక భవన నిర్మాణ కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోలవరం పట్టిసీమల పేరుతో ప్రజలని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజధాని నిర్మాణం పేరుతో ప్రగల్భాలు పలకటం తప్ప చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ప్రపంచ స్థాయి రాజధాని అంటూ ప్రజలని మోసం చేస్తున్న వైనం కేంద్రం గమనిస్తున్నదని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం పూర్తి చేయాల్సిందే తప్ప చంద్రబాబు వల్ల కాదని ఈ విషయం కేంద్రప్రభుత్వం గుర్తించిందని అన్నారు.ఇప్పటికే పోలవరం విషయంలో కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య గ్యాప్ వచ్చిందని చెప్పారు. అదే మాదిరిగా రాజధాని నిర్మాణం కూడా రాబోయే రోజుల్లో కేంద్రం చేతుల్లోకి వెళ్ళిపోతుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. పోరాట కమిటీ కన్వీనర్లు వి.వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, రాజధాని ప్రాంత కన్వీనర్ బాబురావు తదితరులు మాట్లాడుతూ చంద్రబాబు సర్కార్ భూసేకరణ బిల్లుకి చేసిన చట్ట సవరణ బిల్లు ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా నిరసనలు తెలియచేయాల్సి ఉందన్నారు. ఏ ఒక్క రైతు భూములు బలవంతంగా ఇచ్చేందుకు సిద్ధంగా లేరని అన్నారు. చల్లో అసెంబ్లీ చేపట్టి రాజధాని గ్రామాల రైతులతో అసెంబ్లీని ముట్టడిస్తామని అన్నారు.రాజధాని రైతుల్ని ఎలా అడ్డుకుం టారో చూస్తామని అన్నారు.

చంద్రబాబు శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని అమరావతి అభివృద్ధివైపు యావత్తు ప్రపంచం ఎదురు చూస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలకు 2018-నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, ఆదివారం ఆయన ఒక లేఖ రాశారు. మన రాష్ట్రం ప్రపంచంలోని అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని, కలిసి పనిచేసేందుకు అనేక దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వివరించారు.1996 నుంచి 2004 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మనం బలమైన పునాదులు వేసుకున్నామని గుర్తుచేశారు.దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగామని,ఆ తర్వాత వచ్చిన పదేళ్ల కాలం దగా పడ్డ దశాబ్దంగా మారి చరిత్రకు మచ్చగా మారిందని పేర్కొన్నారు. 60 ఏళ్లుగా శ్రమించి నిర్మించుకున్న సంస్థలను, సంపాదించుకున్న సంపదను కోల్పోయామని వాపోయారు. ప్రాథమిక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, పెద్దఎత్తున వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రీయ ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని ఉద్యానవన కేంద్రంగా మార్చే ప్రణాళికల్ని అమలు చేస్తున్నామన్నారు. నీటిపారుదల రంగంలో పట్టిసీమతో ఒక కొత్త శకాన్ని ప్రారంభించామన్నారు.రాష్ట్రంలో నగరీకరణ ముమ్మరంగా కొనసాగుతోందని విశాఖ, అమరావతి, తిరుపతి నగరాలను మూడు మెగా సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. 'జన్మభూమి-మా ఊరు'కు ప్రజలంతా సహకరించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రజలకు రామకృష్ణ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 2017లో ఆశించిన మేరకు రాష్ట్ర అభివృద్ధిగానీ, ప్రజలకు మేలుగానీ జరగలేదని, ఏపీకి ప్రకటించిన ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీల అమలు చేయకుండా కేంద్రం మోసం చేసిందన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ కూడా అమలుకు నోచుకోలేదని తెలిపారు. 2018లోనైనా రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలనీ, రాష్ట్రం అన్ని రంగాలలో పురోభివృద్ధిలో పయనించాలని సీపీఐ ఆకాంక్షిస్తోందన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభించిన పవన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలి సభ్యత్వాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం పార్టీలోని ముఖ్యులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. త్వరలోనే రెండు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పదేళ్లకుపైగా తనను అనుసరిస్తున్న వారితో మూడు రోజులుగా విడతల వారీగా పవన్‌కల్యాణ్ ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను వారికి వివరించారు. రానున్న రోజుల్లో జనసేన నిర్వహించనున్న శిక్షణ శిబిరాల గురించి వారితో చర్చించారు. పార్టీకి స్పీకర్స్, కంటెంట్ రైటర్స్, అనలిస్టులు, సమన్వయకర్తలుగా పనిచేయ దానికి ముందుకు వచ్చిన వారిలో తొలుత మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించారు. కొత్త సంవత్సరంలో తొలి రోజులలో ఈ వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. పూర్తి వివరాలను త్వరలోనే పార్టీ ప్రతినిధులు ప్రకటిస్తారని పవన్‌కల్యాణ్ తెలిపారు.

8న విద్యుత్ ఉద్యోగుల మహాసభ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాసభ జనవరి 8న విజయవాడలో జరుగుతుందని సంఘం గౌరవాధ్యక్షుడు, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం, 2018 డైరీ, ఆవిష్కరణ సభ జరుగుతుందన్నారు. ఆదివారం బీసీ భవన్‌లో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రయ్య. ప్రధాన కార్యదర్శి గణేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. విద్యుత్ ఉద్యోగుల మహాసభకు నలుగురు మంత్రులు, విద్యుత్ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొంటారన్నారు. ప్రమోషన్లను, రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, క్రిమిలేయర్ ఎత్తివేయాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో ఉన్నత పోస్టులైన చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టుల్లో బీసీలను నియమించాలన్నారు. ఉన్నత విద్యార్హత ఉన్నప్పటికీ ఉన్నత పదవుల్లో వారికి అవకాశం ఇవ్వడం లేదన్నారు. కొంత మంది తమ స్వార్థం కోసం బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సంఘానికి తాను గౌరవాధ్యక్షునిగా ఉన్నానని, కాపులతో కుమ్మక్కై తనను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం శోచనీయమన్నారు. వీరభద్రయ్య మాట్లాడుతూ 8న విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై చర్చించి, నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. కాపులతో కుమ్మక్కై యూనియన్ విచ్ఛిన్నానికి కుట్రలు చేసిన వారిని తామే బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. సంఘం జాతీయ కో ఆర్డినేటర్ డా.ఆర్.రుషి అరుణ్ మాట్లాడుతూ భావజాల వ్యాప్తికోసం కృషి చేయాలని కోరారు. 2019లో బీసీ వర్గీయుడే ముఖ్యమంత్రి అవుతాడన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రాంబాబు, సుబ్బారావు, లక్ష్మీనర్సయ్య, చలపతి, రామకృష్ణ, నారాయణరావు, ఆచారి, సుబ్రహ్మణ్యం, రవికుమార్, నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమిద్దాం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తూనే మరోవైపు ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారావు, జి రంగన్న తెలిపారు. దాసరిభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం విద్యను బడుగు, బలహీనవర్గాలకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతోందని తెలిపారు. విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను మూసివేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల అభివృద్ధికి నిధులను కేటాయించకుండా ప్రైవేటు యూనివర్సిటీలను ఆహ్వానిస్తున్నారని విమర్శించారు. యూనివర్సి టీలపై మతోన్మాదదాడులను అరికట్టేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలను తక్షణమే విడుదల చేయాల న్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకై 2018 సంవత్సరాన్ని ఉద్యమాల సంవత్సరంగా భావించి పెద్ద ఎత్తున విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తామని వారు తెలిపారు.

తీర్మానాలు ఇవే..

ఏఐఎస్ఎఫ్ 47వ మహాసభలో చేసిన తీర్మానాలను నాయకులు వెల్లడించారు.

- విద్యను ప్రాథమిక హక్కుగా భావించి ప్రభుత్వం పూర్తిగా ఒకే బడి - ఒకే చదువు విధంగా ఉచితంగా అందించాలి
- కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలను పూర్తిగా రద్దు చేయాలి
- దోపిడీ, మూఢనమ్మకాలను ప్రోత్సహించే విద్యా విధానం రద్దు చేసి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే శాస్త్రీయ విద్యావిధానం ఏర్పాటు చేయాలి.
- విదేశీ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలను రద్దు చేయాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలి. పరిశోధనకు నిధులను కేటాయించాలి.
- సకాలంలో ఉపకారవేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలి.
- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల మూసివేతను విరమించుకోవాలి.
- ప్రభుత్వ విద్యాలయంలో అన్ని వసతులతో కూడిన సొంత భవనాలను నిర్మించాలి.
- వైద్యరంగం పూర్తిగా ప్రభుత్వరంగంలో ఉండాలి. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులను రద్దు చేయాలి.
- ఉన్నత సాంకేతిక విద్యాలయలకు పెద్దమొత్తంలో నిధులను మంజూరు చేయాలి.
- విభజనచట్టంలో అన్ని అంశాలను అమలు చేయాలి.

సాహితి

దేశదేశాల కవితా రహస్యం:

లాటిన్ అమెరికన్ కవిత్వం : పాబ్లొ నెరూడ

అప్పుడే ఆ వయసులోనే కవిత్వం
నన్ను వెతుక్కుంటూ వచ్చింది
ఎక్కడి నుండి వచ్చిందన్నది నాకు తెలియదు
వసంతం నుండా నదీ ప్రవాహం నుండా
నాకు తెలియనే తెలియదు ఎప్పుడూ? ఎలా?
అవి పదాలు కావు, శబ్దాలు కావు, నిశ్శబ్దాలూ కావు
ఏదో ఒక వీధిలో, నిశీధి శాఖలో
ఒంటరి తిరుగు ప్రయాణంలో
అనూహ్యంగా ఇతరుల నుండా
ఎగిసిపడే జ్వాలా కీలల నుండా తెలియదు
నేనక్కడ ముఖం లేకుండాఉన్న క్షణంలో అది నన్ను తాకింది-
ఏం చెప్పాలో నాకు తెలియలేదు
నా నోటికి ఏ పేరూ రాలేదు
కంటికి ఏ రూపమూ కనబడలేదు.
కాని, ఏదో ఆత్మలో కొట్టుకుంది
జ్వర జ్వరంగా అనిపించింది
మరిచిపోయిన నా రెక్కలతో
జ్వాలలకు గాలి విసిరినట్టయ్యింది
అప్పుడే నా మొట్టమొదటి సున్నితమైన
సుకుమారమైన చరణం రాశాను
కనిపించీ, కనిపించినట్లు, విషయమేమీ లేకుండా..
శుభ్రమైన అర్థరహితమైన
ఏమీ తెలియనివాడి స్వచ్ఛమైన వివేకం అది
అంతే- అప్పుడే అకస్మాత్తుగా స్వర్గద్వారాలు
తెరుచుకోవడం చూశాను
గ్రహాల నాడి కొట్టుకోవడం
నీడలకు చిల్లులు పడి విచ్చుకుపోవడం
బాణాలు అగ్నిపూలు అల్లుకుపోవడం చూశాను
వీచే రాత్రి..విశ్వం-అందులో నేను
అంతుపట్టని రహస్యపు ప్రతిబింబాన్ని!
ఒక మహా శూన్యాన్ని మింగిన వాణ్ణి
చుక్కలతో గిరగిర తిరిగిన వాణ్ణి
వదులైన హృదయంతో గాలుల మీద
పగిలిన వాణ్ణి అప్పుడే ఆ వయసులోనే
కవిత్వం నన్ను వెతుక్కుంటూ వచ్చింది





ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతుడయిన లాటిన్ అమెరికన్ కవి పాబ్లో నెరూడ (1904- 1973) చిలీలోని పార్రల్‌లో పుట్టాడు. చదువుకోవడానికి సాంటియాగోకు వెళ్ళి, అక్కడ తన మొదటి కవితా సంపుటి 1920లో ప్రకటించాడు. రెండేళ్ళ తరువాత రెండో సంపుటి, మూడేళ్ళ తరువాత మూడో సంపుటి వెలువరించి, కవిగా ఎదిగి సాహిత్య లోకంలో విరాజిల్లాడు. 1924లో వెలువరించిన Veinte poemasDe A moruna concion deseperada మరింత ప్రజాదరణం పొందింది. అప్పటికి ఆయన వయసు ఇరవై మాత్రమే! విశ్వాసాన్ని, స్త్రీని అన్వేషిస్తూ రాసిన ఆ కవిత్వం ఆయనను ఆ రోజుల్లో జాతీయస్థాయిలో నిలబెట్టింది. రైల్వే బిల్డర్లు దట్టమైన చిలీ అడవుల్లో పడే అవస్థలు బాల్య దశలో చూసిన నెరూడ, వాళ్ళు తమ భవిష్యత్తును తమకు తాముగా ఎలా నిర్మించుకున్నారో కూడా గమనించాడు. కష్టం విలువను, చెమట విలువను అర్థం చేసుకున్నాడు. గతంలోనూ తన సమకాలీన సమయంలోనూ ప్రకృతి నుండి స్త్రీలు, పురుషులు విడివడి ప్రపంచం మీద తమదైన ముద్రను వేయడానికి ఎలా సంఘర్షించారో ఆయన చాలా జాగ్రత్తగా అధ్యయనం చేశాడు. అప్పటి నుండి ఇక రచనే ఊపిరిగా బతికాడు. 1927- 45 మధ్య కాలంలో రంగూన్, జావా, బార్సిలోనాలలో చిలీ దేశపు కన్సల్‌గా పనిచేశాడు.

స్పానిష్ అంతర్యుద్ధంలో లోర్కా మరణం, కన్సల్‌గా తన ఉద్యోగం ఊడిపోవడం వంటి వాటితో ప్రభావితుడై, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నెరూడ కమ్యూనిస్ట్ పార్టీలో చేరాడు. తన దృక్పథంలో వచ్చిన మార్పులన్నీ కవిత్వంలో ప్రతిఫలింపజేశాడు. My thin country అప్పుడే ప్రకటించాడు. తన కవిత్వం ఏదో కొద్దిమంది ఉన్నత వర్గాల వారికోసం కాదని, మానవ ఇతిహాసంలోంచి మానవ సమైక్యతను సాధిస్తూ అశేష జనవాహిని కోసం ముందుకు సాగాల్సిన జీవధార అని గుర్తెరిగాడు. కవిగా, చరిత్రకారుడిగా నిలబడ్డాడు. 1950లో Canto General 1967లో Labarcarola వెలువరించాడు. రెండు దశాబ్దాల పాటు 1950-70లలో కవితా రచనలో మునిగి తేలాడు. 1971లో కవిత్వానికి నోబెల్ పురస్కారం సాధించాడు. చివరి దశలో 1970-73 మధ్యకాలంలో నెరూడ పారిస్‌లో చిలీ రాయబారిగా ఉన్నాడు. స్పష్టంగా, సరళంగా రాయడం, కవిత స్థాయి దిగజారకుండా నిలుపుకుంటూ రావడం.. సాధారణ విషయాల్లోంచే ఉదాత్తమైన అంశాల్ని ఉటంకించడం చిలీ మహాకవి పాబ్లో నెరూడ గొప్పతనం!

డాక్టర్ దేవరాజు మహారాజు
సెల్: 9908633949

ఇకనైనా మేల్కోవాలి

కొండ్రెడ్డి వేంకటేశ్వరరెడ్డి, ✆ : 9948774243

కాల ప్రవాహంలో ఆర్థికాపేక్ష రాక్షస కెరటమై లేస్తూ అక్రమార్జన శిరసెత్తి దేశాన్ని ముంచిపారేస్తుంది. దేశంలో అన్ని రంగాల్లో అవినీతి అట్టుడికిపోతుంది. కుల, మత, రాజకీయ, సామాజిక సేవా వర్గాలన్నీ దొరలు వేషాలు గట్టి దోపిడి దొంగలై తిరుగుతున్నాయి. విద్య, వైద్యం పక్కా వ్యాపార వస్తువులైపోయాయి. నేడు కార్పోరేటు విద్యా విధానం విద్యార్థులను మనసులేని మరబొమ్మలగా తయారుచేస్తుంది. ఉన్నత విద్యలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారే కాని, ఉన్నతమైన నైతిక విలువలతో బయటకు రావడంలేదు. మానవతా విలువలు ఆర్థికపరమైన లావాదేవీలుగా మారిపోతున్నాయి. ముఖ్యంగా ప్రజాస్వామ్యపు విలువలు



తలమానికంగా భావించవలసిన మన ప్రజాస్వామ్య దేశంలో, అవినీతి, రాజకీయం, శకుని పాచికలాటలాడుతూ అందలమెక్కుతుంది. ఓటుకు వెలగట్టి, నోట్లు ముట్టజెపుతూ, బడా పెట్టుబడిదార్లు, పారిశ్రామికవేత్తల కనుసన్నల్లో ధనస్వామ్యమే, ప్రజాస్వామ్యాన్ని శాసిస్తుంది. నిష్పక్షపాతంగా సాహిత్యం వీటిని ఎత్తి చూపగలుగుతుందా?

అన్ని రంగాల్లో అవినీతి, అసమర్థపాలనతో కుళ్ళిపోతున్న ఈ వ్యవస్థ స్థితిగతులను విప్పి చెప్పాల్సిన ఆవశ్యకత సాహిత్యం మీదుందనే బాధ్యతను సాహితీవేత్తలు గమనించాల్సి ఉంది. ఒకపక్క సమాజం అంతులేని అవినీతితో, కులపోరాటాలతో తగలబడిపోతుంటే, పాలకపక్షాలకు చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. పాలకపక్షాలు, ప్రతిపక్షాలు జనాల్ని వెర్రిపప్పల్ని చేస్తూ ఒకరి మీద మరొకరు తీవ్రపదజాలంతో వారివారి నిజస్వరూపాల్ని ఎత్తి చూపుకుంటున్నారు. అవినీతిని, దోపిడీని, కూడబెట్టిన ఆస్తుల్ని హరికథలు చెప్పినట్లు పూసగుచ్చినట్లు చెప్పుకుంటున్నారు. అయినా జనం క్షమిస్తూనే ఉన్నారు.

ఈ దుర్భలత్వాన్ని సాహిత్యం పట్టుకోగలుగుతుందా? అభివృద్ధిపథంలో పయనిస్తూ, ప్రజాహిత సమస్యల్ని చేపట్టి పరిష్కరిస్తూ దేశాన్ని ముందుకు నడపవలసిన వాళ్ళు చట్టసభలలో కాలాన్ని హరించే చర్చలు చేపడుతూ, వాకౌట్లు చేస్తూ ప్రవర్తించడం శాసనసభ్యుల ఎథిక్స్‌కే ఎబెట్టుని ఎరగకపోవడమే శోచనీయం. ఈ రోజు మెజార్టీ రాజకీయపార్టీలు నీతి, నియమ, నిబంధనలకు తిలోదకాలిచ్చి ఆర్థిక వ్యాధిగ్రస్థులై అధికారం కోసం అలమటిస్తున్నారు. ఒక రాజకీయపార్టీలో గెలుపుజెండా ఎగరేసి, అధికారంలో ఉన్న మరో రాజకీయపార్టీలోకి వలస పోతున్నారు. ఏ రాజకీయపార్టీకైనా జెండాగుడ్డల రంగు తేడేకాని, పార్టీకి మేనిఫెస్టోగాని, ఎథిక్స్‌గాని నియమావళిగాని ఉన్నట్లు కనిపించదు. ఒకచో ఉన్నప్పటికీ యిందులో చేరి గెలుపొందుచున్న సభ్యులకు బహుశ ఆ స్పృహ లేదనే చెప్పుకోవాల్సి ఉంది. ఒక పార్టీ మేనిఫెస్టో చెప్పుకొని, ఓట్లు వేయించుకొని, ఎన్నో వాగ్దానాలు చేసి, వారికి పార్టీపరంగా ఎంతో మేలుచేస్తామని హామీలు గుప్పించి సొంతలాభం కోసం అన్నింటిని మరచి, అధికారపార్టీలో చేరటం ఎంత సిగ్గుచేటో ఓసారి నాయక శిరోమణులు గ్రహించాల్సి ఉంది.

అంటే నేటి రాజకీయాలకు ఒక పాలసీ లేదన్న మాట. ఒక నిష్ఠి నియమాలు లేవన్నమాట. కనుక అన్ని పార్టీలకు అంతరాత్మ 'డబ్బు'. డబ్బున్న వాడికే సీటిచ్చి, గెలుపుగుర్రం క్రింద రాజకీయపందెంలో నిలబెట్టడం ఆనవాయితీ అయిపోయింది. దీన్ని జనం కూడా తెలిసో, తెలియకో ఆమోదిస్తున్నారు. జనాన్ని రాజకీయపార్టీలు విడగొడుతున్నాయి. వారివారి మధ్య కుల మతాల అంతరాల్ని రాజేస్తున్నాయి. వీధి పోరాటాల్ని సృష్టిస్తున్నాయి. ఐక్యంగా వావి వరుసలతో పిలుచుకునే పల్లెలు నేడు కక్షలు కార్పణ్యాలతో ఒకడింటిమీది కాకి మరొకడి యింటిమీద వాలే పరిస్థితులు లేవు. ముఠాలు, గ్రూపులు, వర్గాలుగా పల్లెల్లో జనం విడిపోయి ఏ సదుపాయాలు లేకున్నా అంతర్గత కలహాల ఊటలు మింగి ఊరట చెందుతున్నారు.

అధికారంలో ఉన్న రాజకీయ నాయకుడిని ఊరికి కావల్సిన ఉమ్మడి పనిని కూడా ఐక్యంగా అడిగిచేయించుకోలేని దుస్థితి వాటిల్లింది పల్లెలకు. ఒక వర్గం ఒకపని కావాలంటే, రెండో వర్గం అది ఎంత మంచిపనైనా వద్దనడం పరిపాటైపోయింది. ఒక విధంగా ఆలోచించినట్లయితే ఇది పాలకపక్షం రాజకీయాలకు ఎంతో మేలు. ఎందుచేతనంటే ఊరి తగాదాలు ఊసరవెల్లి రాజకీయానికి ఎంతో మేలు. వాళ్ళు ఏ పని చేయాల్సిన పని ఉండదు. మాటలతో కడుపు నింపుతూ వారివారి వర్గాల్ని నిలబెట్టుకోగలుగుతారు. వీటినన్నింటిని సాహిత్యరూపాలు పట్టుకొని వెల్లడించాల్సి ఉంది.

పల్లెల్లోగాని, పట్టణాల్లోగాని మెయిన్ లీడర్స్ వెంట తిరిగే చోటా నాయకులకు చౌకదుకాణమో, చిన్నచిన్న లోకల్ కాంట్రాక్ట్ పనులో ఇప్పిస్తూ జనాన్ని పట్టుకొచ్చే పనిని అప్పచెప్పారు. వీళ్ళు జనానికి నాయకులకు మధ్య 'డాఫర్స్' గా పనిచేస్తుంటారు. పట్టణాలకు పల్లెలు పట్టుకొమ్మలు అని, దేశానికి వెన్నెముకలని, ఆహ్లాదకరమైన సుఖశాంతులతో కూడిన జీవితం పల్లెల్లో ఉంటుందని, ఊకదంపుడు ఉపన్యాసాలు మన రాజకీయనాయకులిస్తుంటారు. ఇది ఎంతవరకు నిజమో ప్రయోగాత్మకంగా ఆలోచించాల్సిన అవసరం అన్నీ సాహిత్యవర్గం మీద ఉంది. సిద్ధాంతరహితమైన దారి, తెన్ను, లేని రాజకీయపార్టీలను నమ్ముకొని, ఉన్నవాడికి ఊడిగం చేస్తూ, తాగునీరు, సాగునీరు కరవై కరువు కాటకాల కోరల్లో చిక్కి వలసబాట పడుతున్న రైతు, కూలీలు, ఊరు పల్లె ఐక్యంగా ఉంటూ ఎంతో సామరస్యంగా అన్నదమ్ములవలె మెలుగుతూ వ్యవసాయం పనులకు చేదోడు వాదోడుగా ఉంటూన్న పరిస్థితులు ఈనాడు నీచ రాజకీయరంగ ప్రవేశంతో విడిపోయినవి. దళిత, బడుగు, బలహీన మైనారిటీవర్గాలు అంటూ, ఆధిపత్య కులాలు అంటూ విభేదాలు సృష్టించి, కులపోరాటాలకు తెరలేపుతున్న సోకాల్డ్ మేధావులైన రాజకీయ రంకు నెరిగిన కులపెద్దలు వీటిని పెంచి పోషిస్తున్న రాజకీయనాయకులు. ఈనాడు పల్లెలు పగలతో రగిలిపోతున్నాయి. పచ్చగడ్డి వేస్తే మండిపోతుంది. ఆరని ఆకలిమంటలు



ఒకప్రక్క, తీరని ఈర్ష్యాద్వేషాలు మరోప్రక్క అశాంతి నిలయాలై పల్లెలు వాపోతున్నాయి.

ఈనాడు పాలకపక్షం, 'ఫ్యూచర్ విజన్' అంటూ రాజధాని నిర్మాణం ఓ మహోన్నతమైన అభివృద్ధి సాధించబోతున్నట్లు, ఆకర్షణీయమైన సుందర దృశ్యాలను కాగితాల మీద చూపెట్టి చప్పట్లు కొట్టించుకుంటుంది. వారి వెనుక దాగిఉన్న అవినీతిని, ఆర్థికకాంక్షల్ని, బూటకపు కార్యచరణ కసరత్తుల్ని ఎత్తిచూపుతూ, వాటికి కొన్ని అతితెలివి జోడింపుల్ని అంటగడుతూ, పబ్బం గడుపుకుంటుంది ప్రతిపక్షం. ఏదిఏమైనా పాలకపక్షం ప్రతిపక్షం మాటల్లో రాష్ట్రాభివృద్ధిని అవసరానికి వారి వాదానికి అనుకూలంగా వాడుకుంటుందేగానీ, నిజమైన నిబద్ధతతో కూడిన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం, అభ్యుదయం కోసం చూడడంలేదు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎత్తుకు పైఎత్తులు వేస్తూ, నిజమైన అభివృద్ధిని చెత్తలో కలుపుతున్నాయనేది సత్యం. ప్రింట్ మీడియాను, ఎలక్ట్రానిక్ మీడియాను ఎవరి పార్టీకి అనుకూలంగా వారు నిర్మించుకోగలిగారు. నాయకుల వాయిస్‌కు ఊపిరిగా వారివారి పత్రికలు, టీవీఛానల్స్ పనిచేస్తూ నిజాల్ని జనానికి అంతుబట్టకుండా చేస్తున్నాయి. మీడియా హోరులో జనం మూగపోతున్నారు. ఈరోజు మనమంతా కాలుష్యం కోరల్లో చిక్కి నలిగిపోతున్నాం. పీల్చేగాలి, తాగేనీరు, తినేతిండి, మాట్లాడే మాటలు, చేతలు అన్నీ కాలుష్యమే. అంతటా నిజాయితీ కొరవడింది. దీనికి కారణం నవనాగరికత ముసుగులో మానవీయతను తోసిపుచ్చే వ్యాపార సంస్కృతిని పెంచి పోషిస్తున్న ప్రపంచీకరణ ఫలితం. మనవి కాని మన వాతావరణానికి సరిపడని సంస్కృతి సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, కట్టు బొట్టు, పబ్బులు, క్లబ్బులు, మాదకద్రవ్యాల వినియోగం, మన యువత మీద బలీయమైన ప్రభావం చూపిస్తున్నాయి. మనిషిని అక్రమ సంపాదనకు ఊహలనందిస్తూ నీతి నిజాయితీలకు తిలోదకాలిచ్చే విధంగా చేస్తున్న పరిస్థితులు సృష్టించబడుతున్నాయి. ఈ పరిస్థితి మారాలి. ఇకనైనా మేల్కోవాలి. సాహిత్యపఠనంతోనే మనిషి శాస్త్రీయంగా, హేతుబద్ధంగా, సిద్ధాంతపరమైన ఆలోచనా విధానాల్ని పెంపొందించుకోగలరు. చౌకబారు కుల, మత, రాజకీయాల కుళ్ళు నుండి మనిషి బయటకు రాగలడు. జనంలో ఐక్యతకు గండికొట్టే అరాజకీయాలను ఖండించాల్సి ఉంది. యువత ముఖ్యంగా సినీ గ్లామర్ నుంచి, చౌకబారు రాజకీయాల నుంచి దూరం కావాలి. "సొంత లాభం కొంత మానుకు/ పొరుగువాడికి తోడుపడవోయ్/ దేశమంటే మట్టికాదోయ్/ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి. అప్పుడే నిజమైన దేశ అభివృద్ధి కలుగుతుంది. జనం సుఖశాంతులతో ✪

దేహం



మహాద్భుతమయింది ఈ దేహం
దేహ రహస్యాన్ని ముట్టుకోలేం
అదొక వారసత్వపు మహాసముద్రం
మనిషి పరిమళాన్ని వెదజల్లుతూ
తిరుగుతుంది
అనేక సంఘర్షణలలో సంచరిస్తుంది
ప్రవహించే ప్రేమనదులలో మునిగి
దుఃఖమహాసముద్రంలో తేలుతుంది
ఇదొక తొమ్మిది గుమ్మాలున్న మేడిపండు
నువ్వు నీలాగే మరలా కదలాలంటే...
దేహబిందువుని విత్తుకుని
అనేకానేక దేహాలపుట్టుకకి
నాంది పలుకుతావు
దేహం కాలంచేతిలో గాయపడ్డ పావురం
దేహ వచనాలు కవిత్వంలో పొదగవు
వచనదేహాన్ని పాటగా ఆవిష్కరించలేవు
దేహానికి గొప్ప చరిత్ర ఉంది
ఇది కులాల మతాల దుప్పటిని కప్పుకుని
భయంలేకుండా హాయిగా సంచరిస్తుంది
దేహానికి ఆధిపత్యపు ఆశ
అన్నింటినీ తలుపులు
తట్టి ఆహ్వానం పలుకుతుంది
మాయనీ మోహాన్నీ కావడికుండలు చేస్కుని
రోజూ మోస్తూ తిరుగుతూనే ఉంటుంది
నిశ్శబ్ద దుఃఖంలో మునిగి
చిగురించడం చేతగాక
కన్నీటి మేఘపు వర్షంలో తడుస్తూ
వేదనల వాకిలిముందు
అసహాయంగా నిల్చుని
దుఃఖాన్ని అంకితమిచ్చిన ప్రియుడికి మల్లే
కలల వీలునామాని
సిగ్గుతో ప్రపంచానికి ప్రకటిస్తుంది
దేహబాధలు దేహానివే
దీనికీ ఒక భాష ఉంది
దేహభాష కలల కాన్వాసుమీద
రక్తంతో రాయబడింది
బహుశా ఇదే మానవభాష కావచ్చు
దేహం లేకుండా ఉండటం ఎట్లా?
దేహం విరిగి ఒరిగిపోతుంటే బాధే కదా
దేహాన్ని వెలివేసి ఎవరయినా బతికారా?
ఖచ్చితంగా దేహాన్ని ప్రేమించాల్సిందే
నెత్తుటి అశ్రుగీతికలతో అభిషేకించాల్సిందే
దేహాన్నీ... దాని నీడనీ చరిత్రని చేసి
నెత్తికెత్తుకుని తిరగాల్సిందే
తన్మయత్వంతో దాన్ని మరొక దేహంతో
ప్రేమగా కరచాలనం గావించాల్సిందే
నేను దేహం నుంచి విముక్తుణ్ణి కాలేను
నాకు తెల్సు
దేహమున్నంతవరకే ఈ నాటకమని.

ఖాదర్ షరీఫ్
సెల్: 9441938140

కవిత్వానికి ప్రకృతి గొప్ప ప్రతీక...!

కవి మాట్లాడతాడు. తనలో తాను కాదు. తన ముందున్నవారితో, తనకు దూరంగావున్న వారితో, వందలు, వేలు, లక్షలు, కోటానుకోట్ల మందితో.. అప్పుడు మాటతో మాత్రం కాదు. కవిత్వ భాషతో మాట్లాడతాడు. అలాంటప్పుడు కవిత్వం మారణాయుధమూ కాగలదు. మృత సంజీవినీ కాగలదు. కవి-ఆలోచనను అక్షరం చేసి ముద్రించినా, శబ్దం చేసి వినిపించినా, దృశ్యం చేసి చూపించినా అది కవిత్వమే.

మనుషుల్లోని వేదన, మంచితనం గురించి తపన, మానవత్వం గురించి ఆవేదన అప్పుడప్పుడూ కవికి నిద్రలేకుండా చేస్తాయి. ఈ మార్పులకీ, ఆవేదనలకీ, తపనలకీ ఏదో తెలీని బంధం ఉంటుంది. దీనిని వ్యక్తం చేసే క్రమంలో కవితాభావ చిత్రాలు మాట్లాడతాయి. ఆట్లాడతాయి. కొన్నిసార్లు కొట్లాడతాయి. అలాగే కవి కలలూ అతడిని నిద్రపోనివ్వవు.

కవిత్వాన్ని భిన్నధోరణులు ఊపేస్తుంటాయి. ఈ వాదాలనుంచి వచ్చిన కవిత్వం అనేక ప్రశ్నల్ని సాహిత్య సమాజం ముందుకు తీసుకొచ్చింది. ఇప్పటికీ ఆ ప్రశ్నలలో కొన్నింటికి కొందరు సమాధానాలు చెప్పుకొని, ఒప్పేసుకున్నప్పటికీ, ఇంకా ఛాందస భావజాలాల మూసల్లో మునిగి ఉన్న వాళ్లు మాత్రం బిర్రబిగుసుకు కూర్చుని, వాదిస్తూ కసుమరుగయినట్టు తాత్కాలికంగా కనిపిస్తూ, హఠాత్తుగా తెరమరుగులో నుంచి అప్పుడప్పుడూ వినిపిస్తుంటారు. అందమైన భావాన్ని అమరి మితానందంగా చెప్పడం, సుకుమారంగా, లలితంగా సమ్మోహనంగా అనాదిగా కవిత్వంలో వస్తువుగా భాసిస్తుందని వారు గ్రహించినా, ఎందుకో వారిలో మార్పు అంత సహజంగా రావడం లేదు.

తెలుగు కవిత్వంలో వస్తు విస్తృతి ఉన్నంతగా రూప వస్తృతి లేదేమో. పాశ్చాత్య ప్రపంచంలో శిల్పపరంగా కవులు చేస్తున్న ప్రయోగాలను మన కవులు కీర్తించడం తప్ప, ఆచరణాత్మకంగా అటువంటి ప్రయోగాలను తాము చేయడానికి పూనుకోవడం లేదు. దీని ఫలితంగా శిల్ప సంబంధమైన మోనాటనీ ఇంకా తెలుగు కవిత్వంలో కొనసాగుతోందనుకోవాలేమో...

గతంలో కవిత్వం అనగానే - ప్రకృతి ఆకృతి మారిపోయినట్లుండేది. అత్తరు వెన్నెలలు, ఉన్మత్త ఊహా కెరటాలు, సంధ్యా వింజామరలు - ఝంఝూమారుతాలు వంటి వైరుధ్యాలతో సౌందర్యమై పలకరిస్తుంది. ఒక్కో కవి



వ్యక్తిత్వం ఒక్కో భావచిత్రంతో వారి కవిత్వం ముడివడి ఉండేది.

మనకు వస్తువుల విషయంలో కొదవలేదు. అలాగని కనిపించిన ప్రతి సమస్యనూ కవితగా రాసే ప్రయత్నమూ చేయకూడదు. లోపమంతా కవితను ప్రజెంట్ చేయడంలోనే... విషాదం ఏమంటే మన ముందుతరం కవుల కవితా శక్తితో పోలిస్తే నేటితరం కవితలు కొన్ని తేలిపోతున్నాయి. వస్తు పరిణతికోసం లోకాన్ని ఎక్కువగా చదవాలి. శిల్పపరిణతి కోసం గొప్ప కవుల కవితా సంపద సునిశితంగా పరిశీలించాలి.

కవి ఒక వ్యక్తి కాదు. అనేక వ్యాకుల సంకలనం. అందుకోసమే అన్ని పాత్రల్ని మనస్తత్వాలను చిత్రీకరించగలుగుతాడు. ఆ కవిత్వం ఆలోచింపచేస్తుందది.. భావానికి, రూపానికి చక్కని సమన్వయం వలన కవితా ప్రయోజనం చేకూరుతుంది.

జీవితానుభవానికీ, కవిత్వానుభవానికి మధ్య విభజన రేఖ గీయడం అంత సులభం కాదు. జీవితం కవిత్వంగా మారిన మేరకు మాత్రమే కవి జీవితానికి విలువ ఇస్తాడు. అక్షర రూపం ఇవ్వడానికి ఉపకరించనిదేదీ, జీవితానికి సంబంధించినది కాదని కవి గ్రహిస్తాడు.

కవులు ఒక విధంగా ఆలోచిస్తే రెండు రకాలుగా కనిపిస్తుంటారు. ఆలోచనల్ని ఆవిష్కరించుకొని మనసులోనే మెరుగులు దిద్దుకుని కాగితం మీదికి తెచ్చేవారు మొదటిరకం. ఇక రెండోరకం - కవిత్వం ఓ వ్యాపకం. కేవలం రాయడం ద్వారా క్రమంగా ఆలోచనను పదునుపెట్టుకుంటూనే ఉంటారు. కొంతమంది కవిత్వం చదివి జీర్ణించుకోవడానికి సాధారణ పాఠకులతోపాటు కవులూ, విమర్శకులకు కూడా కొంత శోధన, ఓపిక అవసరం. ఇది ఆరోగ్యకరమైన పరిణామం కాదు. కొత్తదనాన్ని ఆహ్వానించాలి. కానీ ప్రయోగాలు ఎంతవరకు ఫలప్రదమైనాయో, వాటి ఫలితాలు ఎలా ఉంటున్నాయో పాఠకులనీ, కవులనీ ప్రయోగాలు దగ్గరకు తీసుకువస్తున్నాయా... దూరం పెంచుతున్నాయా అన్నది గమనించాలి. పాఠకులు కవిత్వం ద్వారా పొందేరసనని ప్రయోగం మింగకూడదు.

కవి అయిన ప్రతివాడు తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందో అనని వఆలోచించాలి. ఎందుకంటే ఒక కవి చేసిన సాహిత్య కృషి, నిర్దిష్టమైన ఉత్తమ రచన, ఏదేని ఒక ఉద్యమ కవిత్వంలో గానీ, భావజాల కవిత్వంలోగానీ, ఒక ప్రాంత కవిత్వంలోగానీ, ఒక సామాజిక సమస్యపై వెలువడిన కవిత్వంలోగానీ, ఒక నిర్దేశితకాలంలో వెలువడిన కవిత్వంలోగాని ప్రమాణాత్మకం ప్రతిఫలిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజా జీవితం ఎంత సంక్లిష్టంగా యాంత్రికంగా మారిందో అందరికీ అవగతమే. మానవ సంబంధాలన్నీ మార్కెట్ సంబంధాలు అవుతున్నాయి. కష్టసుఖాల్ని పంచుకునే ఆత్మీయులే కరువయినప్పుడు కవిత్వమే అన్నీ అయి ఓదారుస్తుంది.

కొందరి కవిత్వం జీవితం తాలూకూ కమనీయతను గుర్తింపచేస్తుంది. మనోవీణయపై జీవన సౌందర్య రాగాన్ని శ్రుతిచేస్తుంది. అంతరాంతరాల్లో ప్రవహిస్తూ జీవనానంద తీరాల దరికి చేరుస్తుంది.

ప్రకృతిని ప్రేమించిన కవికి ప్రకృతే జీవనరంగం. ప్రకృతి గొప్ప ప్రతీక అవుతుంది. కవి వేలు పట్టుకొని నడిచే ఒక అలంకారమవుతుంది. ప్రకృతే ఒక మాధ్యమం అవుతుంది. భూమ్యాకాశాల మధ్య తారాడే వెలుగు చీకట్లు కవి ఉత్పత్తి శక్తులవుతాయి.

జీవితం నుంచి కవిత్వాన్ని విడదీసి అంచనా వేయలేం. ఎందుకంటే కవిత్వం జన్మస్థానం, గమ్యస్థానం రెండూ జీవితమే. రాయకుండా ఉండలేనితనంతోనో, సమాజంపట్ల బాధ్యతతోనో ఇంతకాలంగా రచనలు చేస్తున్న కవులు. ఆయా రచనల్ని పాఠకులకి సులభంగా సుస్పష్టంగా అందించే బాధ్యతని గుర్తెరగాలి. ఏదిపడితే అది, ఎలాపడితే అలా రాసే కవులు తయారైతే, ఏది పడితే అది, ఎలాపడితే అలా ఎంపిక చేసి, ముద్రించేందుకు ముందుకు వస్తే పాఠక మహాశయులు అల్లాడిపోతారేమో ఒక్కసారి ఆలోచించండి.

ఎస్.ఆర్. భల్లం
9885442642

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
01 జనవరి 2018

2018

S & D

HAPPY NEW YEAR



న్యూ కలెక్షన్!

కొత్త సంవత్సరం వచ్చేసింది. ఎన్నేళ్ళు గడిచినా తరగని అందం చీర సొంతం. ఎన్ని ఫ్యాషన్లు వచ్చినా చీర స్థానం చీరదే. పార్టీ ఏదైనా చీరకట్టే నిండుదనాన్ని తెస్తుంది. అందుకే ఈ న్యూఇయర్ వేళ కొంగొత్త మోడల్ శారీస్‌కే ప్రాధాన్యతనివ్వండి. చుక్కలు, గడులు, యాపిల్స్, చిలకలు, పువ్వుల డిజైన్లతో మెరుస్తున్న రకరకాల చీరలు ఈ కొత్త ఏడాది మీ వార్డ్‌రోబ్‌లో చేర్చేయండి. కొత్త ఏడాదిని కొత్త కళతో ప్రారంభించండి. అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు.



కొత్త ఏడాది.... కొన్ని విశేషాలు!

కొత్త సంవత్సరం వచ్చేసింది. ప్రపంచమంతా కొత్త సంవత్సర వేడుకల్లో మునిగిపోయింది. ఇది ఏటా జరిగేదే. వాళ్ళూవీళ్ళూ అనే తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా చేసేకునే సంబరం ఇది. చెప్పుకోవడానికి ఇది ఆంగ్ల సంవత్సరాదే కానీ తరతమ భేదం లేకుండా అన్ని దేశాల్లో చిన్నా, పెద్దా కలిసి చేసుకునే పండగ ఇది. మన భారతీయులూ ఇందుకు అతీతులు ఏమీ కాదు. అందరితోపాటు మనమూ న్యూఇయర్‌ను చేసుకుంటాం. కానీ ఎన్నో, మతాలు, కులాలు, వర్గాల కలయిక అయిన మనదేశంలో ఒక్కో రాష్ట్రం, ఒక్కో ప్రాంతం, ఒక్కో మతం వారు ఒక్కోసారి కొత్త సంవత్సరాదిని జరుపుకుంటారు. మరి ఆ విశేషాలేమిటో ఈ కొత్త సంవత్సరం ప్రారంభం రోజున ఒక్కసారి గుర్తు చేసుకుందామా!

మనదేశం వైవిధ్యానికి ప్రతీక. భిన్నత్వంలో ఏకత్వం మన విశిష్టత. ఎన్నో జాతులు, మతాలు, కులాల వారు ఐకమత్యంతో ఉండే దేశం ఇది. అట్లాగే ఎవరి సంప్రదాయాన్ని బట్టి, ఎవరి మతాచారాలను బట్టి వారు పండుగలూ జరుపుకుంటూ ఉంటారు. అందులో ఎవరికి వారికి ప్రత్యేకంగా ఒక కొత్త సంవత్సరాది ఉంది.

ఈ పద్ధతి మన దేశంలోనే కాదు ప్రపంచ దేశాల్లోనూ ఉంది. మన పొరుగుదేశం చైనావారు కొత్త సంవత్సర వేడుకలను శీతాకాలం ముగింపు రోజున చేసుకుంటారు. చైనీయులు ఎక్కడ ఉన్నా ఈ వేడుకలను క్రమం తప్పకుండా జరుపుకుంటారు. పాత సంవత్సరం చివరిరోజున ఇళ్ళను శుభ్రపరుస్తారు. కొత్త వస్తువులతో ఇంటిని అలంకరిస్తారు. అందులో ఎరుపు రంగుకు ప్రాధాన్యతను ఇస్తారు. ఎరుపురంగు మంచి అదృష్టాన్ని కలిగిస్తుందని వారు నమ్ముతారు. సంపదలు వృద్ధి పొందాలని, దీర్ఘాయువు కలగాలని, అదృష్టం కలిసిరావాలని కోరుకుంటారు.

ఆంగ్ల సంవత్సరం అనగానే ఇది క్రిస్టియన్ల పండగ అనుకుంటారు చాలామంది. కానీ ఇది వాస్తవం కాదు. వాళ్ళల్లోనూ కొన్ని వర్గాల వారు దీనిని విశ్వసించారు. ఎక్కువశాతం మంది క్రైస్తవులు జనవరి 1నే నూతన సంవత్సరంగా భావిస్తారు కానీ సంప్రదాయ క్రైస్తవులు మాత్రం సెప్టెంబరు ఒకటో తేదీన కొత్త సంవత్సరంగా జరుపుకుంటారు. ఈ సెప్టెంబరు 1 జరుపుకునేవారు ఈ రోజును దేవుని పుత్రుడు పుడతాడని దేవదూత చెప్పిన రోజుగా విశ్వసిస్తారు. అందుకే సెప్టెంబరు ఒకటినే కొత్త సంవత్సరంగా భావించి ఆ రోజు పండగ చేసుకుంటారు. జొరాస్టియన్స్ ఆగస్టు 23న కొత్త సంవత్సరంగా జరుపుకుంటారు.

మన తెలుగు వారికి ఉగాది రోజున కొత్త సంవత్సరం ప్రారంభమవుతుందనే విషయం తెలిసిందే. చైత్రమాసారంభం చైత్రశుద్ధ పాడ్యమి నాడు కొత్త సంవత్సరంగా భావించి ఆరోజు యుగాది లేక ఉగాదిని జరుపుతారు.

కొత్త సంవత్సర ప్రారంభాన్ని ఒక్కో మతంవారు ఒక్కోరోజున చేసుకుంటారు. బౌద్ధులు వైశాఖ మాస పునమ్మినాడు బుద్ధ జయంతి రోజునే కొత్త సంవత్సర ఆరంభంగా జరుపుకుంటారు. అదే రోజున బుద్ధ పున్నమిని చేసుకుంటారు. ఇందులోనూ మహాయానాన్ని అనుసరించే బౌద్ధులు జనవరిలో వచ్చే పున్నమి రోజున కొత్త సంవత్సర ప్రారంభంగా చేసుకుంటారు. ఈ బౌద్ధులు మూడు రోజులు వేడుకలు నిర్వహిస్తారు.

సిక్కులు ఏప్రిల్ 13 లేదా 14న కొత్త ఏడాది ప్రారంభదినంగా భావిస్తారు. జైనులు దీపావళినాడు కొత్త సంవత్సర వేడుకలు జరుపుకుంటారు. ముస్లిములు చాంద్రమానాన్ని పాటిస్తారు. వారు మొహర్రం మొదటి రోజును కొత్త సంవత్సర వేడుకలను చేసుకుంటారు. ఆరోజు కొత్త బట్టలు ధరించి మసీదుకు వెళ్ళి ప్రార్థనలు చేస్తారు.

తమిళులు ఏప్రిల్ 14న అంటే చిత్తరైమాస తొలిరోజును కొత్త సంవత్సరంగా భావిస్తారు. పుతందవరుడ పిరప్పు అంటూ కొత్త ఏడాది వేడుకలు చేసుకుంటారు. మహారాష్ట్రులు చైత్రమాసంలోని మొదటిరోజును కొత్త సంవత్సరంగా జరుపుకుంటారు. కేరళ వాసులు గ్రిగేరియన్ కేలండర్ ప్రకారం వచ్చే మెడమ్ అనే నెల మొదటి రోజును సంవత్సర ప్రారంభ దినంగా జరుపుతారు. వారు ఆరోజున కొబ్బరికాయలు, పచ్చని పూలను నిద్రలేవగానే చూడాలని కోరుకుంటారు. ఆలయదర్శనం చేసుకుని ఈ వత్సరం అంతా బాగుండాలని కోరుకుంటారు. కౌలుదార్లకు పంటలు ఇంటికి చేరుస్తారు. ఆరోజున వారిని గౌరవించడం సంప్రదాయంగా వస్తోంది.



జమ్మూకాశ్మీర్‌లో కాశ్మీర్ వారు నవ్ర్ పేరుతో కొత్త ఏడాది వేడుకలు చేసుకుంటారు. జమ్మూలో కొత్త వత్సరం వేడుకలను నవరాత్రి అని జరుపుతారు. సింధు ప్రాంతంవారు చేటీచాంద్ అని కొత్త సంవత్సర వేడుకలను జరుపుతారు. గుజరాతీయులు, మహారాష్ట్రీయులు, మార్వాడీలు దీపావళి ముందురోజు బెస్తువారస్ అని కొత్తసంవత్సరంగా భావించి కొత్త ఖాతాలను తెరిచి వారి వ్యాపారాన్ని ప్రారంభిస్తారు. జొరాష్ట్రియన్లు నౌరుజ్ పేరుతో మార్చి 21ని కొత్త సంవత్సరంగా భావిస్తారు.

ఎవరు ఎప్పుడు కొత్త సంవత్సరాదిని జరుపుకున్నా జనవరి 1న అందరితోపాటు ఆంగ్ల సంవత్సరాదినీ ఆహ్వానించి గ్రీటింగ్స్ చెప్పుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈరోజున స్వీట్స్ పంచుకోవడం, శుభాకాంక్షలు చెప్పుకోవడం మామూలే. గ్రెగేరియన్ క్యాలెండర్ ప్రకారం జనవరి 1న కొత్త సంవత్సరంగా జరుపుకోవడం తెలిసిన విషయమే.

కొత్త సంవత్సరం అంటే కాల విభజనే. ఈ కాల విభజనతోనే మనకు రోజులు, పక్షాలు, మాసాలు, సంవత్సరాలు, యుగాలు ఇలా ఏర్పాటు అయినాయి. ఈ విభజన అనాదిగా జరుగుతున్నదే. ఈ కాల విభజనను కొంతమంది చాంద్రామానాన్ని అంటే చంద్రుని గమనాన్ని బట్టి విభజిస్తారు. మరికొందరు సౌరమానాన్ని బట్టి అంటే సూర్యగమనాన్ని బట్టి విభజిస్తారు. అందుకే సౌరమానాన్ని అనుసరించేవారికి కొన్ని పండుగలు వస్తే చాంద్రమానం ప్రకారం కొన్ని పండుగలు చేసుకుంటూ ఉంటారు.

ఈ ఏడాది ప్రారంభం రోజునే ఒక గొప్ప విశేషమూ చోటుచేసుకోనుంది. అదేమంటే 2018 జనవరి ఒకటో తేదీన అతి పెద్ద చంద్రుడిని అతి దగ్గరగా టెలిస్కోపును ఉపయోగించి చూడవచ్చునని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గురుత్వాకర్షణ వల్ల చంద్రుడు భూమికి దగ్గరగా వస్తున్నాడని దాని వల్లనే అతి పెద్ద చంద్రుడిని మనం చూడవచ్చునని చెబుతున్నారు.

- జంగం శ్రీనివాసులు



జరిగిన కథ

ఈ వేళ యీ మిల్లు చూసింతరువాత ఖద్దరుమీద పోతూంది నా మనస్సు. ఖద్దరు అంటే అదేదో గాంధీగారి వెర్రి అనుకునేదాన్ని. అది అవలంబించడం అంటే నాగరికతా పరిణామంలో వెనక అడుగు వెయ్యడం అనుకునేదాన్ని. మన కట్టుగుడ్డకోసం యీ పెట్టుబడి దార్లమీద ఆధారపడకపోతే, కోటాను కోట్లయిన పాటకజనంమీద ఎందుకు ఆధారపడకూడదు? అయితే గాంధీగారు ఖద్దరుకీ రాజకీయాలకీ ముడిపెట్టారు. నే నిదివరకెప్పుడూ రాజకీయాలకి దూరంగా వుండేదాన్ని, గవర్నమెంటు వుద్యోగంలో వుండడంచేత. ఇప్పుడు మాత్రం నే నెందుకు దిగడం అనిపిస్తూంది. దిగుతే శాస్త్రికేం చిక్కువస్తుందో - ఇప్పుడిప్పుడే కాస్త తల ఎత్తుకుని నలుగురిలోనూ తిరుగుతున్నాం.

(నిన్నటి సంచిక తరువాయి)

....కెవ్వున కేక, అమ్మో అని ఏడుపు. ఒక్క లిప్తలో మరలన్నీ ఆగిపోయాయి! ఒక చక్రం దగ్గిర పనివాళ్ళందరూ మూగేరు. నేనూ పరుగెత్తేను. కండెల దగ్గిర పనిచేసూన్న వొక స్త్రీ చెయ్యి చక్రం పట్టాలో తగులుకుపోయి మోచేతి వరకూ చితికిపోయింది. ఆమె మూర్ఛపోయింది. రక్త ప్రవాహం. మేస్త్రీలు ఇద్దరు ముగ్గురొచ్చి ఆ అమ్మాయిని ఆస్పత్రికి పంపించేశారు. పనులు మానేసి అక్కడ మూగినందుకు చీవాట్లు పెట్టి, ఎవరి మరల దగ్గిరికి వాళ్ళని పంపించేశారు.

"శాస్త్రీ! ఆ అమ్మాయి గతి ఏంకానోయ్?" అన్నాను.

"నష్టపరిహారం క్రింద నాలుగు వందలు ముడతాయి. ఫరవాలేదు. అంతోటి డబ్బు ఆ పిల్ల జన్మంలో ఎప్పుడేనా చూచి వుంటుందా?" అన్నాడు శాస్త్రి.


గొట్టాలు పొగలు కక్కేయి. మరలు రంకెలు వేశాయి. ఆ మారణ యంత్రం మళ్ళీ శివాలు ప్రారంభించింది. నాగరికత పేరట ఎన్ని ప్రాణాలు బలి కావలసివుందో?

"అవును, శాంతం! ఈ ఉత్సాహంలో మర్చిపోయా సుమా! మిల్లులో ఇంక రెండో షిఫ్టు మొదలెడతారు కూడాను. ఆ తొడతొక్కిడి ప్రారంభించకుండానే మనం ముందు ఇక్కడనుంచి బయటపడదాం!" అన్నాడు శాస్త్రి.

38 అతడు

నే నీ గంగాధరపురం కేసు గెలవడం కాదుకాని ఫుల్ బెంచి తల్లక్రిందులై పోయింది! ఎస్టేట్సుల్యాండు ఆక్టు మళ్ళీ మరమ్మత్తు చేయవలసిందన్నమాటే! ఈ దెబ్బతో రైతాంగాపు హక్కు ముక్క చెక్కలైనట్టే. రైతులవేపు కేసు పట్టాలని నాకుండేను. కాని జమీందారు ఇచ్చిన ఫీజు వాళ్ళెక్కడివ్వగలరు? అయినా వృత్తిధర్మం మన్నెక్కడి కీడ్చుకుపోతే అక్కడికి పోవాలిగాని మన ఇష్టం పనికొస్తుందా? మహా భారతయుద్ధంలో అర్జునుడు బంధువులను చంపనంటే - కృష్ణుడేమన్నాడు? క్షత్రియధర్మం పాటించమన్నాడు నా-నీ అని ముందు వెనుకలు ఆలోచించకుండాను. అలాగే ప్లీడరీలో కూడా. మన ధర్మం, మనం నెరవేర్చాలి. అందులోనూ - ధర్మం, అర్థం మేళవించినప్పుడు అసలు అనుమానించకూడదు.

శాంతానికి సరదా కలిగిద్దాం అని - పాండుచేరి వెళ్ళివద్దామా అన్నా. "సంయ్" అంటే "సంయ్" అంది. మేం ఇద్దరం రైలు ప్రయాణం చేసి ఎన్నాళ్ళయిందో కదా! శాంతానికి మంచి హుషారు కలిగిద్దాం అని, తనతో చెప్పకుండానే యేర్పాట్లన్నీ ముందే చేసేశాను. అక్కడ హోటేలుకి టెలిగ్రాం ఇచ్చేశాను. రైలు టిక్కట్లు ముందు కొనేశాను. రైలు ప్రయాణం కలలో జరిగిపోయినట్టు



జరిగిపోయింది. మనస్సులు యిద్దరివిన్నీ పూర్తిగా ఏకం అయిపోయాయి. నిజంగా డబ్బు లేకపోతే ప్రేమకూడా వుండదు. కడుపు కాల్తూంటే - ప్రేమ దగ్ధం అయిపోతుంది. శాంతం నిజంగా మంచి "స్పోర్టు". ఈ మాటకి సరియైన పదం మన తెలుగులో లేదు. ఎంచేత చెప్మా? మన ఆంధ్రుల్లో ఆ గుణం లేకపోవడం చేతనా? అబ్బే - ఆ గుణం ఇంగ్లీషువాళ్ళు గుత్తకు కొన్నారా ఏమిటి?

"ధీరత్వం" - "గంభీరత" - "శీలం" "స్థైర్యం" - "గంభీరం" - ఈ మాటలేవీ సరిపడవు....



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

పాండుచేరి చూస్తే నాకు ఫ్రెంచి విప్లవం, వెర్సలై భవనం, విక్టర్ హ్యూగో, రూసో, వోల్‌టేర్, ఎమిలీ జోలా - జ్ఞాపకం వస్తాయి. యూరపు కంతకీ నాయకులుగా ఉండేవారే. వీళ్ళని తోసిరాజుచేసి ఇంగ్లీషు వాళ్ళెలా ముందుకొచ్చారో. నా కాశ్చర్యం వేస్తుంది. అట్టే ఆలోచిస్తే ఆంధ్రులకీ ఇంగ్లీషు వాళ్ళకీ చాలా పోలికలున్నాయి. ఆ తమభాష తప్ప మరోభాష ససేమిరా నేర్చుకొనకపోవడం, భోజనప్రియత్వం. ఇంగ్లీషువాడు ఎక్కడికెళ్ళినవాసరే - బీఫుస్టీకు, యార్కు షైరు పుడ్డింగు మానడు కదా! మనకా గోంగూరపచ్చడి, ఆవకాయ వుంటేనేకాని గడవదు గదా! ఆంధ్రులకి ముందు మంచి రోజులున్నాయనే నాకు పూర్తినమ్మకం. మన పెసరపప్పుగాళ్ళు సైమను కమిషనుని బహిష్కరించకుండా వుంటే, యీ పాటికి ఆంధ్రరాష్ట్రం వచ్చివుండునుకదా! నాలాంటివాడికీ పాటికి ఆంధ్రరాష్ట్రంలో ఏ ఎడ్వకేటు జనరలో - లేకపోతే అధమం లీగల్ రిమెంబ్రెన్సరేనా అయివుండును కదా!......

కారికాల్ చెట్టియార్లు మొన్న కొత్తగా కట్టిన బట్టలమిల్లు చూపించాను శాంతానికి. ఆ యంత్రాలు, ఆ గడబిడ, ఆకల్లోలం చూచి గాభరా పడిపోయింది. నిజంగా బట్టలయంత్రాన్ని కనిపెట్టిన ఆ ఆర్కురైటు ఎంత తెలివైనవాడో కదా! ఎంత అవలీలగా తయారు చేసి పారేస్తోందో కదా? తాన్లమీద తాన్లు తాన్లమీద తాన్లు! శాంతం ఈ చిన్న మిల్లు చూసే నివ్వెరపోయిందికదా? అసలు ఇంగ్లండులో ఓ ఓల్డుహేము బ్రాడ్‌ఫర్డు, ఆ మిల్లులు చూస్తే ఇంకా యెంత ఆశ్చర్యపడిపోనో! కూటికీ, గుడ్డకీ, ఉద్యోగాలకీ ఇంత అల్లాడిపోతున్నాం. నిజంగా మన దేశం అంతా యంత్ర పరిశ్రమలు మయం చేసేస్తే, ఎంత మహోపకారం జరుగుతుందో కదా! నిజంగా ఆ జమ్‌షడ్జీ తాతా ఎంత గొప్పవాడండి! దేశం అంతటా విద్యుచ్ఛక్తి యంత్రాలు, బ్లాస్టుఫర్నేసులు, బెస్సిమర్ కన్వర్టర్లు, బట్టల మిల్లులు, కర్మాగారాలు, మోటారు కార్ఖానాలు, రసాయన ఫ్యాక్టరీలు, నా[illegible]శయాలు, [illegible]బ్బరు ఫ్యాక్టరీలు, ఆ[illegible]ుధపు ఫ్యా[illegible]రీలు [illegible]ంటేనే చ[illegible]న్నావే!

మనం నిజంగా దీక్షగా పూనుకున్నాం అంటే ఈ పాటికి సగం పరిశ్రమలతో నిండియుండేది దేశం. ఆ బెంగాల్ విభజన రోజుల్లో మొదలు పెట్టిన స్వదేశ ఉద్యమం చివరంట సాగించి వుంటే - తిలక్కు పైసాఫండ్, సుబ్రహ్మణ్యయ్యరు నేషనలుఫండ్, చిదంబరంపిళ్ళె స్వదేశీ స్టీమ్ నేవిగేషను కంపెనీ, బందరు జాతీయ కళాశాలోద్యమం - ఈపాటికి జపానే మనదగ్గిర పాఠం నేర్చుకునేది. మన మర్వాడీ షాపుకార్లు, పార్సీ కోటీశ్వర్లు, చెట్టియార్ లక్షాధికార్లు, గుజరాతీ సేట్‌జీలు, ఉత్తరాది వ్యాపారులు, మన మహారాజులు, జమీందార్లు పూనుకుంటే డబ్బుకా లోటు! అలాంటిది ముందుకు సాగిపోతున్న ఇంజన్ని అమాంతంగా వెనక్కి తిప్పేశాడు - ఈ గాంధీ. అంతటితో ఆగేడా? ఈ ఇంజన్ని లాగిపారేసి పోతుల్ని పూన్చాడు. ఇదే నాగరికత అంటాడు. అతని కెవ్వడూ ఎదురు చెప్పలేదాయే ఖర్మం! కట్టుగుడ్డ లేకుండా, చింకిపాతలతో మానం కాపాడుకోలేకుండా చస్తుంటే - రాట్నం తిప్పుకుని జీవించుకోమంటాడు! రోజుల్లా ఇంట్లో చాకిరీచేస్తూ చావడానికేనా వేళలేనివాళ్ళకి చస్తూంటే సంధిమంత్రం లాగు యీ రాట్నంమంత్రం ఒకటా! ఇంతకీ బేడ డబ్బులు గిట్టవుకద - అవతల మిల్లుల్లోనూ, కార్ఖానాలలో పావలా, ఆరణాలు కూలి పారేస్తున్నారాయె. మరిదేం అర్థశాస్త్రమో నాకు తెలీదు. మన యోగశాస్త్రానికి సరిపడినట్టూ ప్రత్యేకంగా శరీరశాస్త్రం వుందట - అలాగానే ఖద్దరుకి సరిపోయేటట్టూ వేరే అర్థశాస్త్రం వుందంటాడు. అయితే, ఇతనికీ తగినట్లే చేశారు, ఆ బొంబాయి అహమ్మదాబాదు సేట్లు - గిరాకీ రోజుల్లో ఖద్దరనే పేరుతో మిల్లుగుడ్డ తయారుచేసి అమ్మేశారు! ప్రజలూ కొనేశారు! ఇంతకీ - గిరాకీకొద్దీ సరఫరా, సరఫరా కొద్దీ గిరాకీ - ఈ సూత్రాన్ని బ్రహ్మదేవుడేనా తప్పించగలడా? హిందూదేశం అంటే ప్రపంచం అంతటిలోనూ నగుబాట్లు అగచాట్లు అయిపోతూంటే, దాంతో వూరుకున్నాడా - అహింస అంటాడు. సత్యం అంటాడు. రాజకీయంలో ఇలా ఒకదాంతో ఒకటి ముడిపెడితే అసలికే సున్నా. బిసెంటే బాగా జవాబు చెప్పిందతనికి ఎంత థియాసఫిస్టైనా, పాశ్చాత్యరక్తమేగా?

మిల్లులో ఉన్నంత సేపూ శాంతం ఏమిటో పిచ్చి పిచ్చిగా మాట్లాడింది.ఆ హడావిడికి ఖంగా రెత్తింది అనుకుంటాను.

- ఇంకా వుంది.

బ్యాంకింగ్ వ్యవస్థ.. పద్ధతులు

◆ బ్యాంకింగ్ రంగం ప్రధానంగా ఖాతాదారునికి సేవలు అందించే సంస్థగా ఉద్దేశింపబడింది. ప్రారంభ దశలో వాణిజ్య బ్యాంకుల ప్రధాన ఉద్దేశం డిపాజిట్లు ఆమోదించడం, ఇతర వ్యక్తులు, సంస్థలకు రుణాలు అందజేయడం, పరపతి పత్రాలను జారీచేయడం, వ్యాపార సంస్థలకు గ్యారంటీలు ఇవ్వడం, విలువైన ఆభరణాలకు, పత్రాలకు లాకర్ సౌకర్యం కల్పించడం వంటి అనుబంధ సేవలు అందించడం లక్ష్యంగా నిర్దేశించారు.

◆ 1970, 1980 దశకాల్లో జరిగిన బ్యాంకుల జాతీయీకరణ, 1990 తరువాత వచ్చిన విత్త సంస్కరణలో భాగంగా బ్యాంకింగ్ లక్ష్యాలలో అనేక మార్పులు, నూతన ప్రక్రియలు చోటుచేసుకున్నాయి.

◆ బ్యాంకింగ్ సంస్థలు నెలకొల్పడంలో ఉన్న నియమ నిబంధనలను సడలించడంతో అనేక విదేశీ సంస్థలు తమ బ్రాంచీలను నెలకొల్పడానికి, అదేవిధంగా స్వదేశీ బ్యాంకులు విదేశాలలో బ్రాంచీలు ఏర్పాటు చేయడానికి అవకాశం ఏర్పడింది.

◆ మన దేశంలో జిల్లాస్థాయిలో పరిపాలనంతా కంప్యూటరీకరించిన మొట్టమొదటి బ్యాంకింగ్ జిల్లా కేరళ రాష్ట్రంలోని పాలక్కడ్ జిల్లా.

◆ బ్యాంకింగ్ వ్యవస్థలో అనేక రూపాలు సంతరించుకోవడంతో ఈ కింది పేర్కొన్న పద్ధతులు అమలులో ఉన్నాయి.

◆ బ్రాంచ్ బ్యాంకింగ్	- యూనిట్ బ్యాంకింగ్
◆ కరస్పాండెంట్ బ్యాంకింగ్	- గ్రూపు బ్యాంకింగ్
◆ స్కాట్ బ్యాంకింగ్	- మిశ్రమ బ్యాంకింగ్
◆ పెట్టుబడి బ్యాంకింగ్	- వ్యవసాయ బ్యాంకింగ్
◆ వ్యాపార బ్యాంకింగ్	- ఇంటివద్ద బ్యాంకింగ్
◆ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్	- వ్యవస్థాపూర్వక బ్యాంకింగ్
◆ అంతర్జాతీయ బ్యాంకింగ్	- మర్చంట్ బ్యాంకింగ్
◆ మొబైల్ బ్యాంకింగ్	- హ్రస్వ బ్యాంకింగ్
◆ ఆన్‌లైన్ బ్యాంకింగ్	- వ్యక్తిగత బ్యాంకింగ్
◆ ప్రైవేటు బ్యాంకింగ్	- రిటైల్ బ్యాంకింగ్
◆ గ్రామీణ బ్యాంకింగ్	

బ్యాంకింగ్ వ్యవస్థ - నిర్మాణ స్వరూపం

బ్యాంకింగ్ వ్యవస్థ విత్త మార్కెట్‌లో అంతర్భాగం. భారతదేశ వ్యవస్థాపక బ్యాంకింగ్ వ్యవస్థ (ఆర్గనైజ్‌డ్ బ్యాంకింగ్ సెక్టార్) నిర్మాణం ఈ కింది విధంగా ఉంది.

1. భారతీయ రిజర్వు బ్యాంక్
2. వాణిజ్య బ్యాంకులు
3. సహకార బ్యాంకులు

భారతదేశంలో రిజర్వు బ్యాంక్ (కేంద్ర బ్యాంక్) అన్ని బ్యాంకులపై అథారిటీగా ఉంటుంది. దీని విధివిధానాలు రూపొందించడానికి గాను భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం 1934లో ప్రవేశపెట్టింది.

◆ భారతదేశంలోని అన్ని బ్యాంకులు ఈ రిజర్వు బ్యాంక్ అజమాయిషీలో



పనిచేయాలని 1949లో బ్యాంకింగ్ నియంత్రణ చట్టం ద్వారా నిర్దేశించడమైనది. ప్రారంభంలో కొన్ని బ్యాంకులు మాత్రమే ఉండటంతో రిజర్వు బ్యాంక్ తన రెండో షెడ్యూల్‌లో చేర్చుకున్న బ్యాంకులను 'షెడ్యూల్డ్ బ్యాంకులు'గా పిలుస్తారు. బ్యాంకుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల షెడ్యూల్డ్ బ్యాంకు కాకపోయినప్పటికీ లైసెన్స్ మంజూరు చేయడం జరిగింది. వీటిని నాన్‌షెడ్యూల్డ్ బ్యాంకులుగా పిలుస్తారు.

◆ షెడ్యూల్డ్ బ్యాంకుకు విదేశీమారక ద్రవ్యాన్ని నిర్వహించే అధికారంతోపాటు విస్తృత సేవలు అందజేయడానికి అనుమతి ఉంది.

◆ నాన్ షెడ్యూల్డ్ బ్యాంకులు అందించే సేవలు కొంత ప్రాంతానికి. కొన్ని సేవలకు మాత్రమే పరిమితమవుతాయి.

◆ బ్యాంకులకు ఉండే మూలధనం, బ్యాంకులు చేపట్టే కార్యక్రమాలను బట్టి రిజర్వుబ్యాంక్ షెడ్యూల్డ్ బ్యాంకులుగా పరిగణిస్తుంది.

◆ వాణిజ్యపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తూ లాభాపేక్షతో ఏర్పడ్డ సంస్థ వాణిజ్య బ్యాంకు కాగా, పరస్పర సహకారంతో సభ్యులకు లాభం చేకూరే విధంగా కార్యక్రమాలను నిర్వహించే బ్యాంకును సహకార బ్యాంకుగా పిలుస్తారు.

కేంద్ర బ్యాంకు (సెంట్రల్ బ్యాంక్)

ఒక దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి సరైన మార్గదర్శనం చేసే ఒక అత్యున్నత సంస్థ ఉన్నపుడే అది సాధ్యమవుతుంది. ఈ అత్యున్నత బ్యాంకింగ్ సంస్థనే కేంద్రబ్యాంక్‌గా పిలుస్తారు. స్వయం ప్రతిపత్తి ఉన్న ఈ కేంద్ర సంస్థ ద్రవ్యమార్కెట్‌కు నాయకత్వం వహిస్తుంది. వాణిజ్య బ్యాంకుల పర్యవేక్షణ, నియంత్రణ, క్రమబద్ధీకరణ బాధ్యతను వహిస్తుంది.

◆ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 1929వ సంవత్సరంలో బ్రస్సెల్స్‌లో సమావేశమైన అంతర్జాతీయ ద్రవ్య సమావేశంలోని తీర్మానం ప్రకారం ప్రతి దేశం ఒక కేంద్రబ్యాంకును నెలకొల్పవలసిందిగా తీర్మానం చేయడం జరిగింది.

◆1656లో స్వీడన్ దేశంలోని 'రిక్స్ బ్యాంక్' అతి ప్రాచీనమైన కేంద్ర బ్యాంకుగా చెప్పవచ్చు.

◆ 1800 సంవత్సరంలో 'ది బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్'ను స్థాపించారు.

◆ 1914 సంవత్సరంలో అమెరికాలో ఫెడరల్ రిజర్వు బ్యాంక్ పేరుతో ఒక కేంద్ర బ్యాంకును స్థాపించారు.

◆ భారతదేశంలో రిజర్వ్ బ్యాంక్ స్థాపనకు 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్'ను ఆదర్శంగా తీసుకున్నారు.

ప్రభుత్వ విధానాన్ని అమలుపరుస్తూ, దానికి కోశ వ్యవహారాలలో మధ్యవర్తిగా ఉండి, బ్యాంకింగ్, ద్రవ్య మార్కెట్ సంస్థలను నియంత్రించే సంస్థనే 'కేంద్రబ్యాంక్' అంటారు.



భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ)

భారతదేశంలో ఉన్న కేంద్రబ్యాంక్ 'రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధి చెందింది. 1926లో హిల్టన్ యంగ్ కమిషన్ సిఫారసుల మేరకు జె.ఎం.కీన్స్ ప్రణాళిక ఆధారంగా దీనిని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934 ప్రకారం 1935, ఏప్రిల్ 1న రూ.5 కోట్ల మూలధనంతో ఒక్కొక్క వాటా 100 రూపాయల చొప్పున 5 లక్షల వాటాదారులతో వాటాదార్ల బ్యాంక్ ఏర్పడింది.

◆ జనవరి 1, 1949న ఈ బ్యాంక్‌ను జాతీయం చేశారు. రిజర్వ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ముంబాయిలో ఉంది.

◆ ముంబాయి, చెన్నై, కోల్‌కతా, న్యూఢిల్లీల్లో నాలుగు ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి.

కేంద్ర బోర్డు

భారతీయ రిజర్వుబ్యాంక్ విధివిధానాలను రూపొందించడానికి, పర్యవేక్షించడానికి 20 మంది డైరెక్టర్లు సభ్యులుగా, ఒక కేంద్రబోర్డును నియమించారు.

◆ ఇందులో గవర్నర్, నలుగురు డిప్యూటీ గవర్నర్లు, ఆర్థిక శాఖ నుండి ఒక ప్రభుత్వ ప్రతినిధి, వివిధ రంగాలకు చెందిన 10 మంది ప్రతినిధులు, 4 ప్రాంతాల ప్రతినిధులు (ముంబై, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ) డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. 4 ప్రాంతాల స్థానిక బోర్డులలో ఐదుగురు సభ్యులను నాలుగు సంవత్సరాల పదవీకాలానికి నియమిస్తారు. ఈ సంస్థకు ఆరు శిక్షణ కేంద్రాలు, 22 ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి.

◆ ఆర్‌బీఐ మొదటి గవర్నర్ - సర్ ఆస్బార్న్ ఆర్కల్‌స్మిత్.

◆ ఆర్‌బీఐ తొలి భారతీయ గవర్నర్ - సి.డి.దేశ్‌ముఖ్

◆ ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్‌గా 2016 సెప్టెంబర్ 4 నుండి ఉర్జిత్ ఆర్.పటేల్ కొనసాగుతున్నారు. (ఈయన 24వ గవర్నర్)

ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో తీసుకున్న సంస్కరణలు

◆ క్యాష్ రిజర్వ్ రేషియోను దశలవారీగా తగ్గించారు. 2007, మార్చి 31 నాటికి 6.5 శాతంగా ఉంది.

2. స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియోను 25 శాతానికి తగ్గించారు.

3. ప్రైవేటు బ్యాంకులు కొత్తగా ఏర్పాటు కావడాన్ని అనుమతించారు.

4. రుణాల వసూళ్లకు ప్రత్యేక ట్రిబ్యునళ్ల ఏర్పాటయ్యాయి.

5. రుణాలపై ఇచ్చే వడ్డీరేట్లను పునర్వ్యవస్థీకరించారు. కనీస వడ్డీరేటును తగ్గించారు. డిపాజిట్లపై ఇచ్చే వడ్డీరేట్లను కూడా తగ్గించారు.

6. క్యాపిటల్ అడిక్వసీ రేషియో నిబంధనల అమలుకు కాలపరిమితిని విధించారు.

7. ద్రవ్య వ్యవహారాల పర్యవేక్షణకు సంబంధించిన బోర్డును రిజర్వుబ్యాంక్‌లో ఏర్పాటు చేశారు.

8. క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) నిబంధనలను సంతృప్తి పరిచిన వారు, అకౌంటింగ్ ప్రమాణాల ద్వారా తమ ఆర్థిక స్థితిని నిరూపించుకున్న బ్యాంకులను కొత్త శాఖలు ప్రారంభించడానికి, లాభదాయకం కాని పాత శాఖలను మూసివేయడానికి అనుమతించారు. అదేవిధంగా ఇతర బ్యాంకులు కూడా తమ శాఖలను లాభనష్టాలకు అనుగుణంగా హేతుబద్ధంగా మార్చుకోవడానికి అనుమతించారు.

బ్యాంకింగ్ రంగంలో నూతన ఒరవడులు

2015-16 ఆర్థిక సంవత్సరంల షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్స్(ఎస్‌సీబీ) పనితీరు నెమ్మదిగానే ఉంది. సంవత్సరం - సంవత్సరం ఆంకు పరపతిలో వృద్ధి 10 శాతం కంటే తక్కువగానే ఉంది. 2015 నవంబర్‌తో ముగిసిన పక్షానికి పరపతి వృద్ధి 9.3 శాతం.

◆ బ్యాంకు పరపతి వృద్ధి నిదానంగా ఉండటానికి అనేక కారణాలు దోహదం చేశాయి.

ఎ. బ్యాంకులు ద్రవ్యవిధానం మొత్తం లబ్ధిని రుణ గ్రహీతలకు సంపూర్ణంగా అందజేయకపోవడం.

బి. నిరర్థక ఆస్తులు (నాన్ పెర్ఫార్మింగ్ ఎస్సెట్స్- ఎన్‌పీఏ) పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంకుల పరపతిని పెంచడానికి సిద్ధంగా లేకపోవడం.

సి. బాండు మార్కెట్లలో వడ్డీరేట్లు ఆకర్షణీయంగా ఉండి, రుణగ్రహీతలు అటువైపు ఆకర్షింపబడటం. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు అస్తవ్యస్తంగా ఉండి, కార్పొరేట్ సంస్థల ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలను స్తంభింపజేయడం.

◆ 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' కింద ప్రభుత్వం తీసుకున్న చొరవ కారణంగా 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రాథమిక పొదుపు బ్యాంక్ డిపాజిట్ అకౌంట్ల సంఖ్యల గణనీయమైన పెరుగుదల కనిపించింది.

◆ భారతీయులందరికీ, ముఖ్యంగా పేదలు, బలహీనవర్గాల వారికి సార్వత్రిక సామాజిక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు 2015 మే 9న 'బీమా, పెన్షన్' రంగాలలో మూడు పథకాలను ఆవిష్కరించారు. అవి.. 1. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన. 2. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన. 3. అటల్ పెన్షన్ యోజన.

◆ 2015-16 బడ్జెట్‌లో చిట్టచివరి ఫైనాన్సర్లకు రీఫైనాన్స్ చేయడం కోసం మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ (ఎంయుడిఆర్‌ఏ) బ్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా 2015, ఏప్రిల్ 8న 'ప్రధానమంత్రి ముద్రా యోజన'ను ఆవిష్కరించారు.

◆ ముద్రా బ్యాంక్ రెండు ఉత్పత్తులను ఆవిష్కరిస్తోంది. ఒకటి : రూ.10 లక్షల వరకు అవసరమైన ఉత్పత్తులకు రీ-ఫైనాన్స్, రెండు : రీఫైనాన్స్ మార్గం ద్వారా మైక్రోఫైనాన్స్ సంస్థలకు సహకారం.

◆ ఉత్పత్తి ప్రయోజనం కోసం బంగారాన్ని సమీకరించడం, దేశం బంగారం దిగుమతులకు ఆధారపడే భారాన్ని తగ్గించడం కోసం 2015లో రెండు ప్రధాన పథకాలను ప్రారంభించారు. అవి :

ఎ. సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్

బి. గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

డీఆర్‌డీవో-ఆర్‌ఏసీలో 76 ఉద్యోగాలు

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు చెందిన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్ (ఆర్‌ఏసీ).. డీఆర్‌డీవో తోపాటు ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) లోని 76 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. దీనిద్వారా డీఆర్‌డీవోలోని సైంటిస్ట్ 'బి', ఏడీఏలోని సైంటిస్ట్/ ఇంజనీర్ 'బి' పోస్టులను భర్తీ చేయనున్నారు.

పోస్టుల పేరు-ఖాళీలు : సైంటిస్ట్ 'బి'-65, సైంటిస్ట్/ ఇంజనీర్ 'బి'-11.

విభాగాల వారీ ఖాళీలు : డీఆర్‌డీవో పోస్టుల్లో.. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-12; మెకానికల్ ఇంజనీరింగ్-9; కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-9; ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-6; ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్-2; కెమికల్ ఇంజనీరింగ్-2; ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్-2; మ్యాథమెటిక్స్-14; ఫిజిక్స్-4; కెమిస్ట్రీ-2; జియాలజీ-1; ఆటోమొబైల్ ఇంజనీరింగ్-1; సిరామిక్స్ ఇంజనీరింగ్-1; మెటీరియల్ సైన్స్-2; పాలిమర్ సైన్స్-2; అట్మాస్ఫియరిక్ సైన్స్-1; ఫిజికల్ ఓషియనోగ్రఫీ-1; సైకాలజీ-4; ఏడీఏలో.. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-5; మెకానికల్ ఇంజనీరింగ్-5; ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్-1.



అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/ బీటెక్/మాస్టర్ డిగ్రీ. అలాగే కొన్ని పోస్టులకు గేట్ (2015/16/17) ఉత్తీర్ణత స్కోర్ కార్డ్ ఉండాలి. దీంతోపాటు నిబంధనల మేర మార్కుల శాతం తప్పనిసరి.

వయసు : సైంటిస్ట్ 'బి' పోస్టులకు 28 ఏళ్లు, సైంటిస్ట్/ఇంజనీర్ 'బి' పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : గేట్ అర్హత ఉన్న పోస్టులకు అకడమిక్, గేట్ మార్కుల మెరిట్, ఇంటర్వ్యూ; మిగిలిన వాటికి షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం : రూ.100; ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ/ మహిళలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల వరకు.

వెబ్‌సైట్ : www.drdo.gov.in, www.rac.gov.in

36 ఫీల్డ్ అమ్మ్యునైషన్ డిపోలో 174 పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన 36 ఫీల్డ్ అమ్మ్యునైషన్ డిపోలో 174 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

పోస్టు పేరు-ఖాళీలు : మెటీరియల్ అసిస్టెంట్-3; లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)-3; ఫైర్‌మ్యాన్-14; ట్రేడ్స్‌మ్యాన్ మేట్-150; ఎంటీఎస్-3 (గార్డెనర్-2ంమెసెంజర్-1); డ్రాట్స్‌మ్యాన్-1.

వేతనం : మెటీరియల్ అసిస్టెంట్-రూ.29,200; ఎల్‌డీసీ, ఫైర్‌మ్యాన్-రూ.19,900; ట్రేడ్స్‌మ్యాన్ మేట్, ఎంటీఎస్-రూ.18,000; డ్రాట్స్ మ్యాన్-రూ.25,500.

అర్హతలు : సంబంధిత పోస్టులను బట్టి పదోతరగతి/ ఇంటర్మీడియట్/ డిప్లొమా/ డిగ్రీ. అలాగే ఫైర్‌మ్యాన్ పోస్టులకు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయసు : మెటీరియల్ అసిస్టెంట్‌కు 18-27 ఏళ్ల లోపు, మిగిలిన అన్ని పోస్టులకూ 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

శారీరక ప్రమాణాలు (ఫైర్‌మ్యాన్ పోస్టులకు) : ఎత్తు (షూ లేకుండా)-165 సెం.మీ.; ఛాతీ-81.5 సెం.మీ. (సాధారణం)-85 సెం.మీ. (గాలి పీల్చినపుడు); బరువు-50 కిలోలు.

ఎంపిక : రాతపరీక్ష (అన్ని పోస్టులకూ), టైపింగ్ (ఎల్‌డీసీకి), ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (ఫైర్‌మ్యాన్‌కు), ఫిజికల్ టెస్ట్ (ట్రేడ్స్‌మ్యాన్ మేట్‌కు).

రాతపరీక్ష విధానం : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ నుంచి 25, న్యూమరికల్ ఆప్టిట్యూడ్-25, జనరల్ ఇంగ్లిష్-50, జనరల్ అవేర్‌నెస్ నుంచి 50 చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠ మార్కులు 150. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది.

దేహ దారుఢ్య పరీక్ష (ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ : పీఈటీ): దీన్ని ఫైర్‌మ్యాన్ పోస్టులకు నిర్వహిస్తారు. ఇందులో 1.6 కి.మీ. దూరాన్ని పరిగెత్తగలగాలి. 63 కిలోల బరువున్న మనిషిని 96 సెకన్లలో 183 మీటర్ల దూరం మోసుకెళ్లగలగాలి. 2.7 మీటర్ల కందకాన్ని దూకగలగాలి (లాంగ్‌జంప్). 3 మీటర్ల తాడును నిలువుగా అధిరోహించాలి.

ఫిజికల్ టెస్ట్ : దీన్ని ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టులకు

INDIAN ARMY
36 FIELD AMMUNITION DEPOT
TRADESMAN, FIREMAN,
LDC, MTS,DRAUGHTSMAN
174 POST
2018

నిర్వహిస్తారు. ఇందులో 1.5 కి.మీ. దూరాన్ని 6 నిమిషాల్లో పరిగెత్తగలగాలి. 50 కిలోల ఇసుక బస్తాను 100 సెకన్లలో 200 మీటర్ల దూరానికి మోసుకెళ్లగలగాలి.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : ఎంప్లాయిమెంట్ న్యూస్ (16-22 డిసెంబర్ సంచిక)లో నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల వరకు.

వెబ్‌సైట్ : www.indianarmy.nic.in, www.ncs.gov.in

S & D

కొత్త ఏడాదిలో మొబైల్స్‌పై భారీ ఆఫర్లు

న్యూఢిల్లీ: నూతన సంవత్సరంలో వినియోగదారుల కోసం ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ మొబైల్ ఫోన్లపై భారీ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురానుంది. 2018 జనవరి 3 నుంచి 5 వరకు వివిధ రకాల స్మార్ట్‌ఫోన్లపై భారీ డిస్కౌంట్ ఇవ్వనుంది. కేవలం రూ. 99కే బైబ్యాక్ గ్యారంటీ సదుపాయాన్ని కల్పిస్తూ వినియోగదారుల పాత ఫోన్లకి పూర్తిగా 50 శాతం వరకు చెల్లించనుంది. నోకాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని కల్పిస్తూ పాత ఫోన్లను ఎక్స్ఛేంజ్ చేసుకునేవారికి కంపెనీ షరతుల మేరకు పూర్తిగా రూ. 18వేల వరకు చెల్లించే అవకాశముంది. భారత్‌లో ప్రస్తుతం అత్యధికంగా అమ్ముడు పోతున్న స్మార్ట్‌ఫోన్లలో షియోమీ నోట్ 4 ఒకటి. రూ. 12,999 ఉన్న ఈ స్మార్ట్‌ఫోన్ రూ. 10,999కి లభించనుంది. అదే వరుసలో రూ. 14,999 విలువ చేసే షియోమీ ఏ1 రూ. 12,999కి లభించనుంది. గూగుల్ పిక్సెల్2 పై రూ. 13,001, పిక్సెల్2 ఎక్స్ఎల్‌పై రూ. 8,001 డిస్కౌంట్ లభించనుంది. వారి పాత మొబైల్‌ను ఎక్స్ఛేంజ్ చేసి కొత్త పిక్సెల్ 2ఎక్స్ఎల్ కొనే వినియోగదారులకు అదనంగా మరో రూ. 4 వేలు తగ్గనుంది. ఇదే వరుసలో మోటో జీ5 ప్లస్, మోటో సీ, మోటో సీ ప్లస్, శాంసంగ్ గెలాక్సీ ఎస్7, గెలాక్సీ ఆన్ నెక్ట్స్(16జీబీ) తదితర స్మార్ట్‌ఫోన్లపై ఫ్లిప్‌కార్ట్ భారీ డిస్కౌంట్లు ప్రకటించనుంది.

ఏడాది చివరిన.. ధగధగలాడిన పసిడి

ఢిల్లీ: ఈ ఏడాది చివరి రోజు ట్రేడింగ్‌లో బంగారం ధగధగలాడింది. శుక్రవారం నాడు స్వల్పంగా తగ్గిన పసిడి.. శనివారం అమాంతం పెరిగింది. రూ.175లు పెరిగి నెల రోజుల గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. నేడు పది గ్రాముల పసిడి ధర రూ.30,400కి చేరింది. అంతర్జాతీయంగా సానుకూల ప్రభావం, స్థానిక ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి భారీగా డిమాండ్ రావడంతో బంగారం ధర పెరిగినట్లు బులియన్ ట్రేడింగ్ వర్గాలు వెల్లడించాయి. అటు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. రూ.280 పెరిగి కిలో వెండి రూ.39,980 చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పుంజుకోవడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. ఈ ఏడాది మార్కెట్లో బంగారం 7.42శాతం పెరుగుదలను నమోదు చేసుకుంది. అటు వెండి 1.47శాతం పెరిగింది. ఈ ఏడాది సెప్టెంబరు 8న బంగారం ధర భారీగా పెరిగి రూ.31,350కి చేరగా.. అత్యంత తక్కువ జనవరి 2న రూ.28,300 ఉంది.

మిఖాసాతో స్మార్ట్రాన్ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించిన స్మార్ట్రాన్ ఎలక్ట్రానిక్స్ ఒరిజినల్ ఉత్పత్తుల సంస్థ ఐఓటిబ్రాండ్‌గా ఎదిగిన కంపెనీ తాజాగా మిఖాసాతో ఒప్పందం చేసుకుంది. దీంతో స్మార్ట్ స్విచ్‌లు, తాళాలు, కెమెరాలు, లైట్లు, వివిధ గృహోపకరణాలను డిజైన్‌చేసి ఉత్పత్తి చేసేందుకు వీలవుతుందని స్మార్ట్రాన్ చైర్మన్ మహేష్ లింగారెడ్డి తెలిపారు. ఈ బ్రాండ్లు అన్నింటినీ ట్రాన్‌ఎక్స్‌థింగ్స్‌గా పిలుస్తోందన్నారు. రెండేళ్ల క్రితమే స్థాపించిన మిఖాసా స్మార్ట్ హోం ఆటోమేషన్ ఉత్పత్తుల డిజైన్‌లో మంచిపేరు సాధించిందని, నాస్కామ్ 50 వర్ధమాన కంపెనీల జాబితాలో ఒకటిగా నిలిచిందన్నారు. మిఖాసాతో ఒప్పందం తమప్రయాణంలో మరో ముందడుగన్నారు. మిఖాసా వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ ట్రాన్‌ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై స్మార్ట్రాన్‌తో కలిసి పనిచేయడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రస్తుతం స్మార్ట్రాన్ కంపెనీ ఇందుకోసం రూ.200 కోట్లు వెచ్చించి ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

రాబో ఫండ్ పెట్టుబడులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆలివ్ గ్రూప్‌లో ఆదిత్య బిర్లా ప్రైవేటు ఇక్విటీ ఉన్న వాటాలను రాబో బ్యాంకు స్పాన్సర్ చేస్తున్న ఇండియా అగ్రి బిజినెస్ ఫండ్-2 కొనుగోలు చేసింది. దీంతో గ్రూపులో తాము ప్రధాన ఇన్వెస్టర్లలో ఒకరిగా నిలిచామని రాబో ఈక్విటీ అడ్వైజర్స్ చైర్మన్ రాజేష్ శ్రీవాస్తవ చెప్పారు. ఈ డీల్ తరువాత ఆలివ్ బార్ అండ్ కిచన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వాటాలను కొనేందుకు తమ సంస్థ అర్హత సాధించిందన్నారు. ఆలివ్ వృద్ధి పథంలో తాము కూడా భాగస్వామం అవుతామన్నారు.

బ్యాంకులు ఆస్తుల అమ్మకాలపై దృష్టిపెట్టాలి!

ఢిల్లీ: ఆస్తి- అప్పుల పట్టిక (బ్యాలన్స్ షీట్)ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు తమ వద్ద రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులను విక్రయించే లేదంటే బదిలీ చేసుకునే మార్గాలను అన్వేషించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకులకు సూచించింది. ఇప్పటికే నిరర్థక ఆస్తులు, భారీ ఎగవేతదారులు పెరిగిన నేపథ్యంలో ఈ విధంగా స్పందించింది. పటిష్ఠంగా ఉన్న బ్యాంకులు ఇతర సంస్థల రుణాలను కొనుగోలు చేయాలని గత నెలలో జరిగిన పీఎన్‌బీ మంతన్‌లో చర్చ నడిచిందని సమాచారం. నిరర్థక ఆస్తులు, పారు బాకీలతో ఇబ్బందులు పడుతున్న బ్యాంకులను పటిష్ఠ పరిచేందుకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనం సాయంగా అందిస్తామని 2017 అక్టోబర్‌లో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులు విక్రయించడం ద్వారా బ్యాం కుల తమపై ఉన్న భారాన్ని తొలగించుకొని ముఖ్యమైన విధులు నిర్వర్తించు కునే అవకాశాలు ఉంటాయి. ఉదాహరణకు 'ఏ' అనే బ్యాంకు చిన్న, మధ్య తరహా సంస్థలకు అప్పులు (లోన్‌లు) ఇచ్చిందనుకుందాం. ఆ పోర్ట్‌ఫోలి యోను అదే రంగంలో పటిష్ఠంగా ఉన్న మరో 'బీ' బ్యాంకుకు బదిలీ చేసుకో వడం లేదా అమ్ముకోవడం అన్నమాట. అదే విధంగా చిన్న, మధ్య తరహా సంస్థల వ్యాపారాలకు అధికంగా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ బ్యాం కులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం దేశంలో తయారీ రంగంలో 40 శాతం ఉద్యోగాలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలే కల్పిస్తున్నాయి.

'ఆధారం' కాదు 'అసంపూర్ణం'

బ్యాంకులు, సిమ్‌కార్డులతో ఆధార్ అనుసంధానంపై 'ప్రత్యేక' బాలిక పోరాటం



న్యూఢిల్లీ: బ్యాంకులు, ఫోన్లు, చివరకు ఆహారం కోసం కూడా ఆధార్ తప్పని సరంటూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసి సామాన్యులను నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న చాలా మందికి ఆధార్ కార్డులు అందకపోవడం గమనార్హం. ప్రతీదాన్ని ఆధార్‌తో అనుసంధానం చేయడం డేటా చోరీకి దారితీయడమే కాకుండా గోప్యతకు హానికలి గిస్తుందని పలువురు వాదిస్తున్నారు. అయితే, ఎలాంటి ప్రభుత్వ సేవలు పొందాలన్న ఆధార్ తప్పనిసరన్న సర్కార్ ఆదేశాలను అరుదైన జన్యు పరమైన రుగ్మతతో బాధపడుతున్న ఓ బాలిక తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది 'ఆధారం కాదు అసంపూర్ణం.. మోసభరితం' అని అంటోంది. కనెక్టివ్ టిష్యూకు సంబంధించిన అరుదైన జన్యుపరమైన వ్యాధి 'మార్ఫన్ సింద్రో మ్'తో బాధపడుతున్న ఇద్యా పాల్ (15) రోడ్లపైకొచ్చి తన నిరసనను తెలుపుతోంది. ఢిల్లీలోని ఐటీవో వద్ద ఆందోళన చేపట్టింది. ఆధార్‌తో అనుసంధానం తప్పనిసరన్న ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ప్రభు త్వాన్ని డిమాండు చేస్తోంది. ' ఆధార్ ఉద్దేశం మంచిదేగానీ ప్రభుత్వం దాన్ని ప్రజలపై రుద్దుతుండడం ఆందోళనకరం. నా లాంటి వారికి బయోమెట్రిక్స్ రిజిస్ట్రేషన్ కష్టసాధ్యమైన విషయం' అని ఇద్యా పేర్కొంది. తనకు భారతదేశం అంటే చాలా ఇష్టమని చెప్పింది. ఇద్యాపాల్ తండ్రి అనదీష్ పాల్ మాట్లాడుతూ 'ఆధార్‌తో అనుసంధానం అన్నది స్వచ్ఛందంగా ఉండాలి. దానిని ఆర్థిక లావాదేవీలతో ముడిపెట్టాల్సిన అవసరం లేదు. ఇద్యా దృఢ సంకల్పంతో ఈ ఆందోళనను చేపట్టింది' అని అన్నారు. కాగా, మార్ఫన్ సింద్రోమ్ వ్యాధి గుండె, కళ్లు, రక్తనాళాలు, ఎముకలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధిగ్రస్తులకు బయోమెట్రిక్స్ అంటే వేలిముద్రలు, రెటీనా స్కాన్ వంటివి సాధ్యం కాదు. వారి కండరాలు, కీళ్లు సక్రమంగా పనిచేయవు. చివరకు ఊపిరితిత్తులు, కళ్లపై కూడా వ్యాధి ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో వారు బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ కార్డును పొందడం, దానిని బ్యాంకు, సిమ్‌కార్డు ఇలా ప్రతిదానితో అనుసంధానం చేసుకోవడం కుదరదు. భారత్‌లో ప్రతి 1,00,000 మందిలో 10-30 మందికి ఈ వ్యాధి ఉన్నట్టు తెలుస్తోంది.

మృత్యువును జయించిన అవిభక్త కవలలు



న్యూఢిల్లీ : అసాధ్యాన్ని సుసాధ్యం చేసిచూపారు ఒడిశాకు చెందిన అవిభక్త కవలలు. ఇటీవల జరిగిన శస్త్రచికిత్స విజయవంతం అవడంతో జగా, కాలియా వేర్వేరుగా తొలి న్యూఇయర్ జరుపుకోనున్నారు. వీరిపై 21 గంటల పాటు సాగిన క్లిష్టమైన శస్త్రచికిత్స జరిగి రెండు నెలల ఐదు రోజులైంది. ప్రస్తుతం ఎయిమ్స్ ఆసుపత్రిలో పిల్లలు ఇద్దరూ కోలుకొంటున్నారు. ఈ అవిభక్త కవలలు వేరుబడిన తర్వాత నెలరోజులు చాలా క్లిష్టంగా గడిచాయి. జగా ఆరోగ్యంలో గణనీయమైన మార్పు కనిపించగా కాలియా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆ బాబు పలుమార్లు తీవ్ర అనారోగ్యానికి గురైన సందర్భాలున్నాయి. అయితే వైద్యుల దృఢ సంకల్పం, చెక్కుచెదరని తల్లిదండ్రుల విశ్వాసం ఈ చిన్నారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయి. మూడు వారాల నుంచి కాలియా ఆరోగ్యం మెరుగ్గా ఉందని, అతనికి వెంటిలేటర్ అవసరం లేదని న్యూఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా తెలిపారు. చిన్నచిన్న మోతాదుల్లో అతను ద్రవాహారాన్ని తీసుకుంటున్నట్టు చెప్పారు. తరచూ చిరునవ్వు చిందిస్తుంటాడని, మాటలను అర్థం చేసుకోగలుగుతున్నాడన్నారు.

ఈ పిల్లలు మృత్యువును జయించరని, వారి తల్లిదండ్రులు కూడా అనేక సవాళ్లను ఎదుర్కొన్నారని డాక్టర్ గులేరియా వెల్లడించారు. తమ కుమారులను క్షణమైనా విడిచిపెట్టకుండా జూలై 14 నుంచి ఎయిమ్స్‌లోనే ఉన్నారన్నారు. ' జగా, కాలియా నాకు ప్రాణం.. వారిద్దరిలో ఎవరికి ఏం జరిగినా నేను బతకలేను' అని రెండేళ్ల ఎనిమిది నెలల కవలల తల్లి పుష్పాంజలి కన్హర్ చెప్పారు. తన ఇద్దరు బిడ్డలు త్వరగా కోల్కొంటారనిన్న నమ్మకం తనకున్నదని, ఆ తర్వాత తమ స్వగ్రామమైన మిలిపాడాకు తిరిగివెళతామన్నారు. ఎయిమ్స్‌లో న్యూరోసర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్‌గుప్తా మాట్లాడుతూ జగా గుడ్లు, అరటిపండు వంటివి ఆహారంగా తీసుకోగలుగుతున్నాడని, తల్లిదండ్రు లతో మాట్లాడగలుగుతున్నాడని చెప్పారు. ఆధారం ఉంటే నిలబడడం, నడవడం చేస్తున్నాడన్నారు. సర్జరీ జరిగిన ఆ క్లిష్ట సమయాన్ని గుర్తు చేసుకుంటూ పిల్లలను వేరుచేసినప్పుడు జగాకు గుండెపోటు వచ్చిందని, వైద్యులు దాదాపు అర గంట శ్రమించిన తర్వాత అతని గుండె తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింద న్నారు. పిల్లల మెదడు ఉండాల్సిన బరువు కన్నా కొంత తక్కువగా ఉన్నట్టు తెలిపారు. ఇటీవల వారి తొడల వద్ద నుంచి చర్మాన్ని తీసి వారి గాయాలపై స్కిన్ గ్రాఫ్టింగ్ నిర్వహించినట్టు చెప్పారు. భారత్‌లో తొలిసారిగా జరిగిన క్రానియోప్యాగస్ సర్జరీ ఇదేనని డాక్టర్ గుప్తా తెలిపారు. ఆగస్టు 28న తొలి శస్త్రచికిత్స జరిగిందని, అక్టోబరు 25న ఇనిస్టిట్యూట్స్ న్యూరోసర్జరీ, న్యూరో-అనస్థిషియా, ప్లాస్టిక్ సర్జరీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన దాదాపు 30 మంది స్పెషలిస్టులు చిన్నారులపై చివరి శస్త్రచికిత్స నిర్వహించారన్నారు. ఇలాంటి కేసు దాదాపు 30 లక్షల్లో ఒకటి ఉంటుందని డాక్టర్ గుప్తా తెలిపారు.



సుఖ దుఃఖాల సమాహారం



జనవరి

▶ జనవరి 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఆరోగ్య రక్ష' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకంలో ఆధార్ నెంబరును అనుసంధానం చేసి నెలకు రూ. 100లు, లేదంటే ఒకేసారి రూ. 1200 చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి రూ. 2లక్షల బీమా సదుపాయం లభిస్తుంది. రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకే ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చంద్రబాబు ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేసి వెల్లడించారు. ఈ పథకంలో వివిధ రోగాలబారిన పడిన వారికి 432 ఆసుపత్రుల్లో వైద్యసేవలను అందచేస్తామన్నారు. ఇందుకు అవసరమయ్యే రూ. 160.56 కోట్లను 2017-18 బడ్జెట్‌లో విడుదల చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

▶ రాయలసీమకు సాగు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని సీఎం ప్రారంభించారు.

▶ తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జనవరి 3వ తేదీన 104వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు.

▶ రాష్ట్రం నుంచి ఎవరైతే నోబెల్ బహుమతిని గెలుచుకుంటారో వారికి రూ. 100 కోట్ల నజరానా అందచేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

▶ గన్నవరం విమానాశ్రయంలో రూ. 160 కోట్ల వ్యయంతో నిర్మించిన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి ఎం వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు.

▶ ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరుతూ సామాజిక హక్కుల చైతన్య వేదిక వేదిక కన్వీనర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆధ్వర్యంలో జనవరి 26 నుంచి 40 రోజులపాటు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో చైతన్య యాత్ర నిర్వహించారు.

▶ గన్నవరం మండలం కొండపావులూరు గ్రామంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) నూతన క్యాంపస్ నిర్మాణానికి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేశారు. ఈ క్యాంపస్ నిర్మాణానికి రూ. 200 కోట్లను కేటాయించారు.

▶ కాకినాడలో రూ. 40వేల కోట్ల పెట్టుబడితో పెట్రోకెమికల్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించి హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, గెయిల్ ఇండియాతో కలసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది.

▶ విజయనగరంజిల్లా కొమరాడ మండలం కూనేరు వద్ద 21వ తేదీ రాత్రి జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 39 మంది మరణించగా, 54 మంది గాయపడ్డారు.



ఫిబ్రవరి

▶ ఒకటో తేదీన రాజధాని రైతులకు కేపిటల్ గెయిన్స్ టాక్స్ మినహాయింపు: సుమారు రూ. 4వేల కోట్లకు పైగా వెసులుబాటు.

▶ రాష్ట్రంలో తొలిస్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను గుంటూరులోని నగరంపాలెంలో ఫిబ్రవరి 6వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఇదే తరహాలో మరో 100 స్మార్ట్ పోలీస్‌స్టేషన్లలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని పోలీసుశాఖ నిర్ణయించింది.

▶ ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వద్ద జాతీయ మహిళా పార్లమెంటును ఫిబ్రవరి 10 నుంచి 12 వరకూ మూడ్రోజులపాటు నిర్వహించారు. దీనిని ప్రధాని నరేంద్రమోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించగా, బంగ్లాదేశ్ పార్లమెంటు స్పీకర్ ఎస్ఎస్ చౌదరి, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ముగింపు కార్యక్రమంలో స్పీకర్ సుమిత్రా మహాజన్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

▶ శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఫిబ్రవరి 15వ తేదీన ఇస్రో ఆధ్వర్యంలో 104 ఉపగ్రహాలతో కూడిన పీఎస్ఎల్వీ-సీ37 నింగిలోకి ఎగసింది. నిర్దేశిత కక్ష్యల్లో వాటిని ఉంచి ప్రపంచరికార్డును సృష్టించింది.

▶ కృష్ణాజిల్లా ముళ్లపాడు వద్ద ఫిబ్రవరి 28వ తేదీన ప్రైవేటు బస్సు అదుపుతప్పి కాల్వలోపడడంతో 11మంది మృతి చెందారు. మరో 40 మంది ప్రయాణీకులు గాయాలపాలయ్యారు.

మార్చి

▶ ఏపీ బడ్జెట్ సమావేశాలు మార్చి 6వ తేదీన ప్రారంభమై 31వ తేదీతో ముగిసాయి.

▶ శాసనసభ సమావేశాల్లో భాగంగా 2017-18 సంవత్సరానికిగాను రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు రూ. 1,56,999 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈమొత్తం 2016-17 సంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే 15.70 శాతం అధికం.

▶ రాష్ట్రమంత్రిమండలి రాష్ట్రంలో పోలవరం సహా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిర్దేశించిన ఈఏపీల సహాయానికి ఆమోదం తెలిపింది.

▶ రాష్ట్రంలో విజయవాడ (గన్నవరం), తిరుపతి విమానాశ్రయాల పేర్లను మార్పు చేయాలని మార్చి 2వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశం నిర్ణయించింది. విజయవాడ విమానాశ్రయం పేరును నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) అమరావతి విమానాశ్రయం'గా, తిరుపతి విమానాశ్రయాన్ని 'శ్రీవెంకటేశ్వర విమానాశ్రయం'గా నామకరణం చేశారు.

▶ నంద్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి హఠాన్మరణం.

▶ అమెరికాలోని న్యూజెర్సీలో 24వ తేదీన కృష్ణాజిల్లా పోరంకికి చెందిన తల్లీకొడుకులు దారుణహత్యకు గురయ్యారు.

ఏప్రిల్

▶ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 'అమ్మకు వందనం' పేరిట కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు రూ. 2.50 కోట్లను కేటాయించింది.

▶ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ. ఫిరాయింపు ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, అమరనాథరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుజయ కృష్ణరంగా రావులకు మంత్రివర్గంలో చోటు.

▶ విశాఖపట్నంలో కేంద్రమంత్రి ఎం వెంకయ్యానాయుడు నేషనల్ చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు.

▶ రాజధానిలో రాజ్యాంగనిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుకు సంబంధించి 14వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ వనంలో 126 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

▶ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావ్‌పూలే 191 జయంతిని పురస్కరించుకుని చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు నిర్దేశించిన 'ఆదరణ' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పున:ప్రారంభించారు.

మే

▶ ఒలింపిక్ క్రీడల్లో విజయం సాధించినందుకు పీవీ సింధుకు గ్రూప్-1 ఆఫీసర్‌గా నియమించేందుకు నిర్దేశించిన బిల్లుకు మే 16న ఏపీ శాసనసభ ఆమోదం తెలిపింది. అలాగే విజయవాడ విమానాశ్రయానికి అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తించాలని కోరుతూ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాను మంత్రిమండలి కోరింది.

▶ విజయవాడలో రూ. 500 కోట్ల వ్యయంతో పరిశోధన సదుపాయాలను కల్పించేందుకు మే 12వ తేదీన హెచ్‌సీఎల్‌తో ఐటీశాఖమంత్రి నారా లోకేష్ ఒప్పందం కుదుర్చుకున్నారు.

▶ రాజధాని అమరావతిలో 6.84 కిలోమీటర్ల మేర అమరావతి స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేసేందుకు 15వ తేదీన సింగపూర్, ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహన కుదిరింది.

▶ విశాఖపట్నం రైల్వేస్టేషన్ దేశంలోని శుభ్రమైన రైల్వేస్టేషన్లలో ఒకటిగా రైల్వేమంత్రి సురేష్‌ప్రభు 17వ తేదీన ప్రకటించారు.

జూన్

▶ జూన్ 4న గుంటూరులో ప్రత్యేక హోదా భరోసా పేరుతో కాంగ్రెస్ బహిరంగ సభ: రాహుల్‌గాంధీ హాజరు.

▶ ప్రధాని మోడీ పాలన 3 సంవత్సరాలు ముగిసిన సందర్భంగా 2వ తేదీన మేకింగ్ ఆఫ్ డెవలెప్‌మెంట్ ఇండియా (మోడీ) ఫెస్టివల్‌ను విజయవాడ, కడప, విశాఖపట్నంలలో నిర్వహించారు.

▶ దేశంలోనే తొలి గ్రామీణ ఎల్ఈడీ వీధిదీపాల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 7 జిల్లాలోని గ్రామ పంచాయితీల్లో 10 లక్షల సాధారణ వీధి దీపాల స్థానంలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

▶ విజయవాడ-హౌరా మధ్య హమ్‌సఫర్ సూపర్‌ఫాస్ట్ వీక్లీ రైలును రైల్వేమంత్రి సురేష్‌ప్రభు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు ఎం వెంకయ్యానాయుడు, పి అశోకగజపతి రాజులతో కలసి ఈనెల 15వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. ఇంకా తిరుపతి-జమ్ము హమ్‌సఫర్ రైలుతోపాటు తిరుపతిలో మెకనైజ్డ్ లాండ్రీ, గుత్తి-ధర్మవరం సెక్షన్ డబ్లింగ్ తదితర ప్రాజెక్టు ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు.

▶ మైక్రో,స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎంఎస్ఎంఈ) కార్పోరేషన్‌ను రూ. 100 కోట్లతో జూన్ 27వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. పరిశోధన, అభివృద్ధి, శిక్షణ కోసం అమరావతిలో 15 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ భవనను నిర్మించాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఈ తరహా భవనాలను నిర్మించనున్నట్లు సీఎం ప్రకటించారు.

జూలై

▶ తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) 2,780 కిలోల బంగారాన్ని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దీర్ఘకాలిక డిపాజిట్ పథకంలో డిపాజిట్ చేస్తున్నట్లు ప్రకటించింది.

▶ ఏపీలో ఇండస్ట్రియల్ పార్క్‌లను నెలకొల్పేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ ఆమోదం తెలిపింది. అనంతపురం జిల్లా హిందుపురం, విజయనగరంజిల్లా బొబ్బిలిలో ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

ఆగస్టు

▶ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర సెప్టెంబరు 17 వరకూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సాగింది.

సెప్టెంబరు

▶ ఒకటో తేదీన సీపీఎస్ రద్దును కోరుతూ ఉద్యోగుల మిలీనియం మార్చ్: వేలాదిగా హాజరు

▶ 3న జరిగిన కేంద్రమంత్రివర్గ విస్తరణలో నిర్మలాసీతారామన్‌కు రక్షణశాఖ కేటాయింపు

▶ నీటిని పరిరక్షించుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమం 'జలసిరికి హారతి' కార్యక్రమాన్ని ఈనెల 6వ తేదీన ముఖ్యమంత్రి ప్రకటించారు.

▶ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన: ఏడాదిలో పూర్తి చేస్తామని ప్రకటన.

▶ రాజధానిలో హైపర్‌లూప్ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు హైపర్‌లూప్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీస్ (హెచ్‌టీటీ)తో ఏపీ ఎకనమిక్ డెవలెప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) ఎంఓయూ కుదుర్చుకుంది.

▶ హిజ్రాలకు ఆయా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. వీరికి నెలకు రూ. 1000ల పెన్షన్‌తో పాటు ఇళ్లు, రేషన్‌కార్డులను మంజూరు చేస్తామన్నారు.

▶ రాష్ట్రాన్ని 2017 సంవత్సరాన్ని ఇ-ప్రగతి సంవత్సరంగా 21వ తేదీన సీఎం ప్రకటించారు.

▶ గుంటూరుజిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెంలో ఒకటో శతాబ్దం కాలం నాటికి చెందిన అతి పురాతన బుద్ధిజానికి చెందిన ఆనవాళ్లను పురాతత్వశాఖ గుర్తించింది.

▶ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా 'నో హెల్మెట్-నో పెట్రోల్' నిబంధనను ఈనెల 28వ తేదీనుంచి ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.

అక్టోబరు

▶ ఇస్లాండ్ వాటర్‌వే విధానానికి ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ముఖ్యమంత్రితో కలసి 3వ తేదీన శంకుస్థాపన చేశారు.

▶ విశాఖలో మాస్టర్‌కార్డ్ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థతో ఏపీ ప్రభుత్వం 5వ తేదీన ఎంఓయూ కుదుర్చుకుంది.

▶ కర్నూలులో మెగాసీడ్ పార్క్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

▶ విశాఖలో టీయూ 142ఎం ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం ఏర్పాటుకు 17వ తేదీన ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

▶ ఇంటర్మీడియట్‌లోనూ గ్రేడింగ్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం.

▶ రైతుల రుణమాఫీలో మూడో విడతకు రూ. 3,600 కోట్ల ఇన్‌స్టాల్‌మెంట్‌ను విడుదల చేస్తున్నట్లు 23వ తేదీన వ్యవసాయశాఖమంత్రి ప్రకటించారు.

▶ రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం నాబార్డు రూ. 273 కోట్లను మంజూరు చేసింది.

▶ లండన్ గ్లోబల్ కన్వెన్షన్‌లో 25న జరిగిన కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'గోల్డెన్ పికాక్ అవార్డు'ను ప్రదానం చేశారు.

▶ విజయవాడలోని సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై 27వ తేదీన సిటీ బస్సు భీభత్సం: ముగ్గురి మృతి.

▶ అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలని ప్రతిపక్షమైన వైసీపీ నిర్ణయం.

నవంబరు

▶ రంపచోడవరం ఎమ్మెల్యే రాజేశ్వరి 4వ తేదీన టీడీపీలో చేరిక

▶ ప్రజాసంకల్పం పేరుతో 6వ తేదీ నుంచి వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాదయాత్ర ప్రారంభం

▶ అక్టోబరు మహావిప్లవ శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ జిల్లా, నగర సమితుల సంయుక్త ఆధ్వర్యంలో 7వ తేదీన దాసరిభవన్‌లో జరిగిన కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి హాజరయ్యారు.

▶ కాఫర్‌డ్యామ్ పనులు ఆపాలని కేంద్రజలవనరులశాఖ లేఖ.

▶ శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నవంబరు 10న ప్రారంభమై డిసెంబరు 2వ తేదీ వరకూ జరిగాయి.

▶ కాపులను బీసీల్లో చేరుస్తూ తీర్మానం: విద్య, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం ప్రకటన.

▶ కృష్ణానదిలో పవిత్రసంగమం వద్ద 12వ తేదీన బోటు ప్రమాదంలో 26 మంది దుర్మరణం చెందారు.

▶ విశాఖపట్నంలో అగ్రిమారిథాన్ పేరిట భారీ సదస్సు నిర్వహణ: బిల్‌గేట్స్ హాజరు.

డిసెంబరు

▶ రాజధానిలో అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఆకృతులకు మంత్రి మండలి ఆమోదం

▶ పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీపీఐ రాష్ట్ర నాయకత్వ బృందం. కేంద్రప్రభుత్వం వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండు.

▶ భారత కమ్యునిస్టుపార్టీ (సీపీఐ) 92వ వార్షికోత్సవాలు ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

▶ ఆచార్య నాగార్జునవిశ్వవిద్యాలయం వద్ద 28వ తేదీన జరిగిన ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ 100వ సదస్సును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభించారు.





చెవి ఇన్ఫెక్షన్లు.. నియంత్రణ

వెచ్చని కాఫీ సమయాలకి శీతాకాలం అందంగా కన్పించవచ్చు కానీ అదొక్కటే కాదు. వణికించే చలితోపాటు, శీతాకాలం అనేక ఇన్ఫెక్షన్లు, వ్యాధులను కూడా వెంటబెట్టుకు వస్తుంది. సరైన సమయంలో వాటికి సంరక్షణ తీసుకోకపోతే, అవి తీవ్రమైన ఆరోగ్య సమస్యలుగా మారే అవకాశం ఉంది.

చలికాలంలో చెవి ఇన్ఫెక్షన్లు ఎందుకు పెరుగుతాయో తెలుసుకుందాం. ఇది ముఖ్యంగా చెవుల్లో సున్ని తత్వం ఎక్కువగా ఉండి, చలికి, చలిగాలి తగిలినప్పుడు మరింతగా పెరుగుతుంది. అది చికాకును పెంచి, లోపల పేరుకునే తేమ లేదా బ్యాక్టీరియా తీవ్ర నొప్పి స్థితిని కలుగచేస్తుంది. దీన్ని ఓటిటిస్ మీడియా (మధ్యచెవిలో వాచే వ్యాధి) అంటారు.

చలికాలంలో చెవి ఇన్ఫెక్షన్లను ఎలా నివారించాలి

ఇన్ఫెక్షన్ సోకిన పదార్థం యూస్టాషియన్ ట్యూబ్ కు అడ్డం పడి, కర్ణభేరి వెనకాల పెరగటం ప్రారంభిస్తుంది. ఇది చాలా నొప్పి, ఇన్ఫెక్షన్ పెరిగేలా చేస్తుందని యశ్వంత పూర్‌కి చెందిన కొలంబియా ఏషియా రిఫరల్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ శ్రీనివాస మూర్తి అభిప్రాయ పడ్డారు. సరైన సమయంలో సంరక్షణ తీసుకోకపోతే చెవుడుకి కూడా దారితీయవచ్చు. అందరి కన్నా పిల్లల్లో ఇది తీవ్రప్రభావం చూపిస్తుంది ఎందుకంటే పెద్దవారిలో కన్నా వారి యూస్టాషియన్ ట్యూబ్ చిన్నగా, అడ్డంగా ఉంటుంది. తీవ్ర చెవినొప్పి, వినికిడి సమస్యలు, చెవుల్లోంచి చీము లేదా రక్తం కారడం, చెవుల్లో గింగురుమంటూ శబ్దాలు, జ్వరం, ఆకలి తగ్గిపోవటం వంటివి పెద్ద చెవి సంబంధ ఇన్ఫెక్షన్ల లక్షణాలు. ఇవి ముఖ్యంగా శీతాకాలాల్లో వస్తాయి. చలికాలాల్లో చెవి ఇన్ఫెక్షన్లను నివారించుకోవడానికి కొన్ని పద్ధతులు ఇవీ...

1. చెవులను వెచ్చగా, పొడిగా ఉంచుకోండి

బయటకి వెళ్లినపుడు ముఖ్యంగా మీ చెవులను మూసి ఉంచుకోవాలని గుర్తుంచుకోండి. వణికించే చలిగాలుల మధ్య మీ చెవులలో చేరే తేమ, బ్యాక్టీరియా వల్ల చికాకు, నొప్పి కలగవచ్చు, అందుకని చెవులను ఎప్పుడూ వెచ్చగా, పొడిగా ఉంచుకోండి.

2. పొగ తాగకండి

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. అది కూడా ముఖ్యంగా చలికాలంలో మరింత ఎక్కువ. పొగతాగడం వలన యూస్టాషియన్ ట్యూబులో వాపు వచ్చి వినికిడి సమస్య తలెత్తవచ్చు. సరైన సమయంలో గుర్తించకపోతే, శాశ్వతంగా చెవుడు రావచ్చు కూడా.

3. ఆరోగ్యకరమైన ఆహారం

మంచి ఆరోగ్యకర ఆహారం చాలా ముఖ్యం, అది కూడా చలికాలం వస్తున్నప్పుడు. ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచి, మీ శరీరంపై అనేక ఇన్ఫెక్షన్ల దాడిని నియం త్రిస్తుంది. ఆరోగ్యకర ఆహారం రక్తప్రసరణను స్థిరంగా ఉంచి మిమ్మల్ని ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉంచుతుంది.

4. క్రమంగా వ్యాయామం

ఆరోగ్యకర ఆహారంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం తప్పనిసరి, ప్రత్యేకంగా చలికాలంలో మరింత ముఖ్యం. ఇది మంచి రక్తప్రసరణతో పాటు ఆరోగ్యంగా ఉంచుతుంది. వ్యాయామం అంటే జిమ్‌కి వెళ్ళటం మాత్రమే కాదు, నడక, జాగింగ్, సైక్లింగ్ వంటివి రోజుకి కనీసం 30 నిమిషాల పాటు అయినా చేస్తే మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

5. వ్యక్తిగత శుభ్రత

మీరు ఆరోగ్యంగా ఉండి ఇన్ఫెక్షన్ల నుండి దూరంగా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి. తినేముందు మీ చేతులు కడుక్కో వటం వలన జలుబు, అలర్జీలకి దూరంగా ఉండవచ్చు. జలుబు, అలర్జీల వలన ద్రవాలు చెవిలో పేరుకుపోయి, చెవి ఇన్ఫెక్షన్లకి దారితీస్తుంది. ఇది చెవినొప్పి కలుగచేసి చెవి సరిగా వినపడదు.

6. మంచి నిద్ర

ఆరోగ్యకరమైన ఆహారమేకాక, మంచి నిద్ర కూడా మీ రోగనిరోధక శక్తిని బలంగా మార్చి, ఇన్ఫెక్షన్లను నియంత్రిస్తుంది. చెవి ఇన్ఫెక్షన్లు, చికాకు రాకుండా ఉండాలంటే జలుబు, దగ్గు, అలర్జీలు, ఫ్లూ జ్వరాలను దూరంగా ఉంచుకోవటం చాలా ముఖ్యం.



7. ఒంట్లో బాలేని వారి చుట్టూ ఉండకండి

ఫ్లూ అంటుకునే జ్వరం. అందుకని జలుబు, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడేవారి చుట్టూ ఉండకండి. ఎందుకంటే మీకు ఫ్లూ అంటుకుంటే, చెవి ఇన్ఫెక్షన్‌కి కూడా దారి తీయవచ్చు.

8. వైద్యుని సంప్రదించండి

చెవిలో చికాకు, నొప్పి తగ్గకపోతే, వైద్యుని సంప్రదించి అవసరమైన మందులు తీసుకోవటం మంచిది. అది పట్టించుకోకుండా వదిలేస్తే మరింత తీవ్రమైన చెవి సమస్యలకి దారితీసి, చెముడు రావచ్చు.

చర్మానికి మాయిశ్చరైజ్ తప్పనిసరి



చర్మాన్ని తేమగా ఉంచుకోవటమనేది మీ దినచర్యలో అస్సలు వదిలేయకూడని పని. చర్మనిపుణులు చర్మసంరక్షణలో దీని ప్రాముఖ్యతను పదే పదే నొక్కి చెప్తారు. ఈ పని చర్మానికి కావాలసిన తేమను అందించటమే కాదు, చర్మానికి నీటి ప్రసరణను పెంచి, మళ్ళీ జీవం పోస్తుంది.

ఇంత ప్రాముఖ్యత ఉన్నా, మనలో చాలామంది క్రమం తప్పకుండా తమ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసుకోరు. మీరు కూడా వారిలో ఒకరైతే మీరు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసుకోకపోతే వచ్చే సమస్యలను తెలియచేస్తున్నాం.

చర్మంపై తేమ లేకపోతే జరిగేది ఇదే

చర్మసంరక్షణకు చర్యలను తీసుకోకపోతే జరిగే నష్టానికి సంబంధించిన ప్రభావాలు అనేకం జరుగుతాయి. చర్మం మొత్తంమీద ఆరోగ్యంగా ఉండా లంటే తేమగా ఉండటం తప్పనిసరి. మీరు చర్మాన్ని తేమగా ఉంచుకోకపోతే వచ్చే సమస్యలేంటో తెలుసుకోవటానికి చదవండి.

పొడి చర్మం

మీరు మాయిశ్చరైజర్ వాడకపోతే జరిగే మొదటిది చర్మం పొడిబారటం. ఈ ముఖ్యమైన చర్మసంరక్షణ పనిని వదిలేయటం వలన మీ చర్మం చాలా పొడిగా తయారవుతుంది. ఇక మీరు ఊహించుకోవచ్చు, పొడిచర్మం ఎంత బాధపెడుతుందో. ఏ రుతువు అయినా, మాయిశ్చరైజర్ రాసుకోకపోతే మీకు ఈ చర్మ సమస్య వస్తుంది.

కన్పించే ముడతలు

మాయిశ్చరైజ్ చేసుకోకపోతే వచ్చే మరో సమస్య ఇది. దీన్ని వదిలేయటం వలన మీ చర్మంపై సురక్షిత గోడను తొలగించినట్లవుతుంది. వయస్సుకి ముందే ముడతలుపడి, గీతలు పడుతుంది. చర్మాన్ని క్రమం తప్పకుండా మాయిశ్చరైజ్ చేసుకుని మీ అందాన్ని ముడతలు పడకుండా చేసుకోండి.

నిర్జీవమైన చర్మం

తేమలేకపోవటం వలన చర్మం జీవం లేకుండా తయారవుతుంది. మంచిగా మాయిశ్చరైజ్ అయిన చర్మం సహజంగానే కాంతివంతంగా ఉంటుంది. మరోవైపు తేమలేని చర్మం నిర్జీవంగా, డల్ గా ఉంటుంది. క్రమం తప్పకుండా చర్మాన్ని తేమగా ఉంచుకుని దీని నుంచి బయటపడండి.

మొటిమలు రావటం

తేమ లేకపోవటం వలన పొడి చర్మం మాత్రమే కాక చూడటానికి అసహ్యంగా ఉండే మొటిమలు కూడా రావచ్చు. మంచిగా మాయిశ్చరైజ్ అయిన చర్మంపై గ్రంథులు తెరచుకుని ఉండి మొటిమలు ఏర్పడకుండా ఉంటుంది, అదే మీ చర్మంపై తేమ లేకపోతే తీవ్రంగా మొటిమలు వచ్చి మీ చర్మాన్ని అనారోగ్యకరంగా చూపిస్తాయి.

పొరలుగా ఊడిపోయే చర్మం

తేమ లేని చర్మం పొరలుకట్టి తరచుగా ఊడిపోతుంది. అందరికీ తెలిసిన విషయమే, పొరలుగా ఊడిపోయే చర్మాన్ని సంరక్షించటం అంత సులభం కాదు. అందుకని అలా ఊడిపోయే చర్మాన్ని నియంత్రించటానికి మాయిశ్చరైజర్ రాసుకోవటం మీ దినచర్యలో భాగం చేసుకోండి. పాడవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది పాడవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది తేమలేని చర్మం సులభంగా పాడవటానికి వీలుగా మారుతుంది. ఇలాంటి చర్మం అలర్జీని కలుగచేసే పదార్థాలు, విషపదార్థాలు, ఫ్రీ రాడికల్స్, ఇన్ఫెక్షన్లు కలిగించే బ్యాక్టీరియా ఇలాంటివాటన్నిటికీ ఆవాసంగా మారుతుంది, చర్మం పాడవకుండా నియంత్రించాలంటంటే మీ చర్మాన్ని అన్నివేళలా తేమతో ఉంచుకోవాలని మరోసారి గుర్తుచేయనవసరం లేదుగా!

కొల్లాజెన్ నష్టం

సరిగా తేమ లేని చర్మంపై కొల్లాజెన్, ఎలాస్టిన్ పదార్థాలు కూడా నిలవవు. ఇలా జరగటం వలన మీ చర్మం వయస్సు మీరినట్లు, సాగినట్లు కన్పిస్తుంది. మీ చర్మం కొల్లాజెన్ స్థాయిని నిలకడగా ఉంచటానికి ఈ చర్మసంరక్షణ స్టెప్‌ను ఎప్పుడూ మర్చిపోకండి.

కఠిన చర్మం

ఇది చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసుకోకపోవటం వలన వచ్చే మరో దుష్ప్రభావం. తమ చర్మాన్ని సరిగా మాయిశ్చరైజ్ చేసుకోని మహిళలకు కఠిన చర్మం ఉంటుంది. అదే సమయంలో క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్ రాసుకునే స్త్రీలకి మెత్తని, మృదువైన చర్మం ఉంటుంది. ఎండిపోయిన చర్మం ఎండిపోయిన చర్మం ఎంతో అవసరమైన ముఖ్యమైన చర్మ సంరక్షణ స్టెప్ ను తప్పించేయటం చర్మంలో నీటిప్రసరణ లేకుండా చేస్తుంది.. ఇది మరిన్ని చర్మ సమస్యలకు దారితీసి, మీ చర్మ రూపాన్ని, సౌందర్యాన్ని నాశనం చేస్తుంది. అందుకని క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్ రాసుకుంటూ మీ చర్మాన్ని తేమగా ఉంచుకుంటూ ఈ చర్మసమస్యలను నివారించుకోండి.



'పద్మావతి'కి కట్స్ చెప్పలేదు

'పద్మావతి' సినిమాలోని సన్నివేశాల్ని తొలగించాలని దర్శక, నిర్మాతలతో చెప్పలేదని సీబీఎఫ్‌సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్) సభ్యుడు వాణి త్రిపాఠి టిక్కో తెలిపారు. కేవలం సినిమాలోని కొన్ని సన్నివేశాలను సవరించమని సూచించామని చెప్పారు. టైటిల్‌ను మార్చమని పేర్కొని, యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిపారు.'పద్మావతి' సినిమా విషయంలో సీబీఎఫ్‌సీపై జరుగుతున్న ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పద్మావతి' సినిమాను 'పద్మావత్' టైటిల్‌తో విడుదల చేయబోతున్నారు. ఈ చిత్ర వివాదానికి సంబంధించి దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఇటీవల పార్లమెంటరీ ప్యానెల్‌తో సమావేశమై చర్చించారు. 16వ శతాబ్దానికి చెందిన మాలిక్ ముహమ్మద్ రాసిన 'పద్మావత్' కవిత ఆధారంగా ఈ చిత్రం రూపొందించానని, నిర్మాణానికి రూ. 150 కోట్ల వ్యయం చేశామని ప్యానెల్‌లో భన్సాలీ చెప్పారు. ఈ నేపథ్యంలో కొన్ని సవరణలు చేయమని సెన్సార్ ఆదేశించిందట. 'ఘూమర్..' పాటలో అవసరమైన మార్పులు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతోపాటు సినిమాలోని 26 సన్నివేశాలకు కట్ చెప్పినట్టు ప్రచారం జరిగింది. దీనిపై వాణి త్రిపాఠి స్పష్టత ఇచ్చారు. దీపికా పదుకొణె, రణ్‌వీర్‌సింగ్, షాహిద్ కపూర్ ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించారు. డిసెంబరు 1న ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది. సెన్సార్ పూర్తి కాని కారణంగా విడుదల వాయిదా పడింది. కొత్త విడుదల తేదీని ప్రకటించాల్సి ఉంది.

ఇలాంటి యాటిట్యూడ్ ఎవరిలో చూడలేదు : వర్మ

'అజ్ఞాతవాసి' సినిమాపై వర్మ కామెంట్



పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అజ్ఞాతవాసి'. ఈ చిత్రం టీజర్ అదుతేంగా ఉందని ఇటీవల సోషల్‌మీడియా వేదికగా ప్రశంసించిన ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మళ్లీ సినిమా ప్రచార చిత్రాల్ని ఉద్దేశించి మాట్లాడారు. కొత్తగా విడుదలైన 'అజ్ఞాతవాసి' పోస్టర్లను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఇందులో పవన్ హావభావాల గురించి ప్రస్తావించారు. పవన్ చేతులు కట్టుకుని నిల్చొని ఉన్న పోస్టర్‌ను ఉద్దేశిస్తూ.. 'నేను నా గత జన్మలో కూడా ఇలాంటి యాటిట్యూడ్ ఉన్న అతన్ని చూడలేదు. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ ఎందుకు పనికిరారు పీకే (పవన్‌కల్యాణ్) ముందు.. బ్రూస్‌లీకి మొగుడిలా ఉన్నాడు' అని వర్మ అన్నారు. పవన్ ఎడమ చేయితో కుడి చేయి మణికట్టుని పట్టుకుని కోపంగా చూస్తున్న పోస్టర్‌ను ఉద్దేశిస్తూ.. పవన్ గొప్ప అందగాడు అనే అర్థం వచ్చేలా రాశారు. త్రివిక్రమ్ 'అజ్ఞాతవాసి' సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తిసురేశ్, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలు. అనిరుధ్ స్వరాలు అందించారు. ఖుష్బూ, బొమన్ ఇరానీ, ఆదిపినిశెట్టి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. జనవరి 10న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

విశాలాంధ్ర సినిమా



ఆర్మీ ఆఫీసర్‌గా యువ హీరో

విభిన్న చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో శర్వానంద్. 2017లో రెండు ఘనవిజయాలు అందుకున్న ఈ యంగ్ హీరో కొత్త కొత్త ఏడాదిలోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. మహానుభావుడు సినిమాతో సత్తా చాటిన శర్వ.. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. లై సినిమాతో నిరాశపరిచిన హను, శర్వానంద్ సినిమాతో తిరిగి ఫాంలోకి రావాలని భావిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి టాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో శర్వానంద్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నాడట. అంతేకాదు ద్వితీయ భాగంలో వచ్చే యుద్ధ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయన్న టాక్ వినిపిస్తోంది. శర్వానంద్ సరసన సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.



'అ'లో కాజల్ అగర్వాల్‌ని చూశారా?

నేచురల్ స్టార్ నాని తొలిసారి నిర్మాతగా మారి నిర్మిస్తున్న చిత్రం 'అ'. ఇప్పటికే ఇందులో రెజీనా, రవితేజ, నిత్యామేనన్, అవసరాల శ్రీనివాస్ ఫస్ట్‌లుక్‌లను విడుదల చేశారు. ఇప్పు డు సినిమాలోని కాజల్ ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. గులాబీ పువ్వును పట్టుకుని దిగాలుగా చూస్తున్న కాజల్ ఫొటోను వివిధ ఫ్రేమ్‌లలో చూపించారు. ఇందులో కాజల్ కాళీ పాత్రలో నటిస్తున్నారు. ఇందులో నాని ఓ చేపకు, రవితేజ ఓ మొక్కకు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

షా బుజ్జగింపుతో మెత్తబడ్డ నితిన్ పటేల్



అహ్మదాబాద్ : గుజరాత్ ఉప ముఖ్యంత్రి నితిన్ పటేల్ వివాదం ఆదివారం సద్దుమణిగింది. కేబినెట్లో అప్రాధాన్య శాఖలు కట్టబెట్టే యత్నంపై నితిన్ పటేల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం బీజేపీ అధిష్ఠానాన్ని కుదిపేసింది. అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్న వేళ పటీదార్ వర్గానికి చెందిన నితిన్ పటేల్ అసంతృప్తి తిరుగుబాటుకు దారి తీస్తుందని బీజేపీ అధిషానం సందేహించింది. దీంతో నితిన్‌ను బుజ్జగించే బాధ్యతను భుజానికెత్తుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం ఉదయం నితిన్‌తో ముచ్చటించారు. అపోహలు పెట్టు కోవద్దని కేబినెట్లో ప్రాధాన్యపదవి కట్టబెడతామని షా హామీ ఇచ్చారు. ఇందుకు నితిన్ సానుకూలంగా స్పందించడంతో వివాదం సద్దుమణిగినట్లయింది. గత ప్రభుత్వంలో ఆర్థిక, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖలకు నితిన్ మంత్రిగా పని చేశారు. ఈరెండు శాఖల్లో ఏ శాఖను నితిన్‌కు కేటాయిస్తారనేది వెల్లడికాలేదు. నితిన్‌కు కేటాయించే శాఖల వివరాలను గవర్నరుకు లేఖ ద్వారా తెలియజేస్తానని ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మీడియాకు చెప్పారు.

కుప్పలు తెప్పలుగా నకిలీ 2 వేల నోట్లు



న్యూఢిల్లీ : నకిలీ 2 వేల నోట్లను చలామణీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న ఓ జంటను సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) అదుపులోకి తీసుకుంది. వీరి నుంచి రూ. 6.5 లక్షల విలువైన 2వేల నోట్లను స్వాధీనం చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్డాలో గులాప్‌గంజ్ మార్కెట్ వద్ద దొంగనోట్ల ముఠా సంచరిస్తున్నట్టు సమాచారం అందుకున్న బీఎస్‌ఎఫ్.. ఆదివారం ఉదయం స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. మాల్డాకి చెందిన రేణు మొండాల్, అయినూల్ హక్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా... దొంగనోట్ల వ్యవహారం నిజమేనని అంగీకరించారు. వీరిపై విచారణ కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు.

కండక్టరు నుంచి నేత వరకూ...

- రజనీ రాజకీయ అరంగేట్రం
- ఆధ్యాత్మిక రాజకీయాలతో నూతన ఒరవడి

చెన్నై : అనితరసాధ్య నటనా శైలితో భాషలకతీతంగా అభిమానులను సంపాదించుకున్న రజనీకాంత్ ఎట్టకేలకు రాజకీయ ఆరంగేట్రానికి రెడీ అయ్యారు. రజనీకాంత్‌గా మారిన శివాజీ రావు గైక్వాడ్ ఆధ్యాత్మిక రాజకీయాలను ప్రవేశపెట్టి నూతన ఒరవడిని ప్రారంభించనున్నారు. తమిళ సినిమాలతో అత్యధిక ప్రేక్షకులను మెప్పించిన ఆయన ఎంజీ రామచంద్రన్, జయ లలితల వారసత్వాన్ని కొనసాగించాలనుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా అభిమానులను ఊరించిన 67 ఏళ్ల నటుడు వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాజకీయపార్టీని ఏర్పాటు చేస్తానంటు రాజకీయ ప్రవేశంపై ఉత్కంఠతకు తెరదించారు. తమిళనాట చక్రం తిప్పుతున్న రెండు రాజకీయపార్టీలైన ఏఐఏడీఎంకే అధినేత్రి జయలలిత మృతి, డీఎంకే అధినేత కరుణానిధి వయోభారంతో చక్రాల కుర్చీకే పరిమితమై పోవడంతో ఏర్పడిన రాజకీయశూన్యంలో ఆయన పార్టీ పెట్టబోతున్నారు. 1950 డిసెంబరు 12న రమాబాయి,రామోజీరావు గైక్వాడ్‌కు కర్ణాటకలో జన్మించిన ఆయన సినీ పరిశ్రమలోకి రాకముందు చిన్నాచితకా ఉద్యోగాలు చేసి ఆపై బెంగళూరు రోడ్డురవాణా సంస్థలో 10ఏ మార్గంలో ఆయన బస్‌కండక్టర్‌గా పనిచేశారు. ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఉండగానే అనేకమంది పెద్ద నటులకు అవకాశం ఇచ్చిన కే బాలచందర్ ఆయనకు రజనీకాంత్‌గా పేరుమార్చి తొలి అవకాశం ఇవ్వగా, 1975లో అపూర్వ రాగాంగళ్ అనే కుటుంబ కథా చిత్రంతో వెండితెరకు పరిచయం అయ్యారు. సిగరెట్ కాలుస్తూ కాలితో గేటు తెరిచే స్టైల్, సిగరెట్టు నోట్లో ఉంచుకొనే ఇదు ఎప్పటి ఇరుక్కు (ఇది ఎలా) అంటూ పలకడంతో ప్రేక్షకులు నీరాజనాలు పట్టారు. విలన్‌గా సినిమాల్లో ప్రవేశించిన రజనీకాంత్ ఆపై హీరోగా సమ్మోహన పరిచారు. దీంతో అభిమానులు ఆయన నిలువెత్తు కట్‌ఔట్‌లకు పాలాభిషేకాలు చేశారు. ఆయన సినిమాలన్నీ బాక్సాఫీస్‌ను హిట్ చేశాయి. ఈ నేపథ్యంలో ఆయనకు పద్మవిభూషణ్ అవార్డు వరించింది. 1996లో రజనీకాంత్ డీఎంకేకు మద్దతునిస్తూ జయలలితను విమర్శించడం, ఆఏడాది డీఎంకే అధికారం లోకి



రావడంతో ఆయన మొదటిసారి రాజకీయాలను రుచి చూశారు. అప్పుడే ఆయన రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించారు. 2004లో పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఫ్రంట్‌కు ఓటువేయాలని పిలుపు ఇచ్చినా ఆపార్టీ విజయం సాధించలేదు. దేశంలోని నదుల అనుసంధానం కోసం ఆయన నేషనల్ డెమాక్రటిక్ అలియన్స్ (ఎన్‌డీఏ)కు మద్దతు ప్రకటించారు. భక్తితత్వంలో ఉండే రజనీకాంత్ 2011లో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అభిమానుల ప్రార్థనలే ఆయనను కాపాడాయని చెబుతుంటారు. ప్రేక్షకాభిమానం మెండుగా ఉన్నా ప్రత్యర్థి వర్గాల విమర్శలు మాత్రం తప్పడం లేదు. మరాఠీ మూలాలున్న కర్ణాటకవాసి తమకు అక్కర్లేదని రాజకీయ ప్రత్యర్థులు పేర్కొంటూ, రాష్ట్రంలో తాగు,సాగునీటికి అధారమైన కావేరీ జలాలపై ఆయన నోరువిప్పరని ఆయనను విమర్శిస్తుంటారు. దీంతో 2002లో కావేరీ నీటికోసం ప్రజాఉద్యమాన్ని ప్రారంభిస్తామని, హిమాలయ, పెనిన్సులార్ నదులను అనుసంధానం చేయాలని ప్రకటించడం ద్వారా ఆయన ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టారు. కొద్దినెలల క్రిందట తాను సంపూర్ణ తమిళుడని కూడా ఆయన చెప్పుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ నివశిస్తున్నానని, ఆయన తండ్రి తమిళనాడుకు చెందిన కృష్ణగిరి జిల్లాకు చెందినవారని వివరించారు. తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన లతను ఆయన వివాహం చేసుకోగా, ఇద్దరు కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్యలు చిత్రరంగంతో డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.

సమర్ధపాలన, రాజకీయ చర్యలతో

తగ్గిన రాజకీయ హింస

కేరళ ప్రభుత్వం వెల్లడి



తిరువనంతపురం : రాజకీయ హింసకు సంబంధించిన కేసుల సంఖ్య 2017లో గణనీయంగా తగ్గినట్టు కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ పెదవి విరిచాయి. రాజకీయ హింస కేసులను గణాంకాలతో సహా ముఖ్యమంత్రి పినరయి విజయన్ కార్యాలయం ఆదివారం వెల్లడించింది. 2017లో రాజకీయ హింసకు సంబంధించిన కేసులు 1463 నమోదయ్యాయని, గతేడాదితో పోలిస్తే 211 కేసులు తగ్గియని తెలిపింది. శాంతి కోసం ముఖ్యమంత్రి చొరవ తీసుకోవడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన రాజకీయ చర్యలు, సమర్ధవంతమైన పాలన కారణంగానే కేసులు తగ్గాయని స్పష్టం చేసింది. దీనిపై ప్రతిపక్ష నేత రమేష్ చెన్నితాల స్పందిస్తూ ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన సంఖ్య కన్నా రాజకీయ ఘర్షణలు, హత్యలు ఎక్కువే జరిగాయని అన్నారు. రాజకీయ జోక్యం కారణంగా పోలీసులు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం లేకుండా పోయిందని చెన్నితాల అన్నారు. ప్రభుత్వ గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మనం రాజశేఖరన్ అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రాజకీయ హత్యలు పెరిగాయన్నారు. శాంతికోసం ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నా...సమావేశాలు నిర్వహించినా సీపీఎం కార్యకర్తలు మాత్రం బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఈ ఏడాది డిసెంబరు 30వ తేదీ వరకూ 1463 రాజకీయ హింస కేసులు నమోదయ్యాయని, 2016లో 1674 కేసులు నమోదైనట్టు సీఎంఓ ప్రకటన తెలిపింది. కన్నూరులో రాజకీయ హింస తగ్గిందని వెల్లడించింది. సీపీఎం, బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ మధ్య పదేపదే అక్కడ ఘర్షణలు జరిగేవని, ఈ ఏడాది అవి తగ్గాయని వివరించింది. 2016లో కన్నూరులో 363 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఆ సంఖ్య 271కి తగ్గినట్టు ఆ ప్రకటన తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ సమర్థపాలన, రాజకీయ చర్యలు ఇందుకు ప్రధాన కారణమని స్పష్టంచేసింది.

పక్కకుపోతే ప్రతిఘటిస్తాం

రాష్ట్రంలోనూ జాతీయ విధానాన్ని అనుసరిస్తాం

సీపీఐ కేరళ కార్యదర్శి రాజేంద్రన్



తిరువనంతపురం: వామపక్ష మూల విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తే సీపీఎం నాయకత్వంలోని అధికార ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను కొనసాగిస్తామని సీపీఐ కేరళ కార్యదర్శి కే రాజేంద్రన్ స్పష్టం చేశారు. సమకాలీన సమస్యలు, అంశాలపై నిరంతరం స్పందించే సీపీఐ కేరళ శాఖ తరపున రాజేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వానికో లేదా ఎవరో ఒక వ్యక్తిని ఉద్దేశించి విమర్శలు చేయడం తమ సంస్కృతి కాదన్నారు. విధాన లోపాలను సరిదిద్దుకోవాలనే సదుద్దేశంతోనే అవసరమైన సందర్భాల్లో పార్టీ వాణిని వినిపిస్తామన్నారు. కొన్ని సందర్భాల్లో మూల వామపక్ష విధానాల నుంచి మరలింపు జరిగేందుకు అవకాశాలున్నాయనీ, ఆయా సందర్భాల్లో తమ విధానం ప్రకారం ప్రతిఘటనను కొనసాగిస్తూనే ఉంటామని ఆయన పునరుద్ఘాటించారు. కేరళ ఎల్డీఎఫ్ ప్రభుత్వంలో రెండవ అతి పెద్ద పక్షంగా సీపీఐ ఉన్నది. బూటకపు ఎన్‌కౌంటర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఏపీఏ), ప్రభుత్వ భూముల దురాక్రమణ తదితర అంశాలపై జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న విధాన ప్రక్రియనే కేరళలోనూ అనుసరిస్తామని ఆయన వివరించారు. గత సంవత్సరం నిలంబూర్ అడవుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతికి బూటకపు ఎన్‌కౌంటరే కారణమన్నారు. దీనికి సంబంధించి స్థానికంగా ఉన్న తమ పార్టీ కార్యకర్తలు అందించిన సమాచారం ఆధారంగా తానీ విధంగా చెప్పగలుగుతున్నానన్నారు. 1977 జనవరి 1న మున్నార్లోని సెటిలర్లందరికీ టైటిల్ డీడ్‌లు ఇవ్వాలని, ఆక్రమ ణలను తొలగిం చాలని ప్రభుత్వం నిర్ణయించినందున సీపీఎంతో వచ్చిన అభిప్రాయ బేదాలేమీ లేవన్నారు. స్థానిక పరిస్థితుల కారణంగా కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. ఆటంకాలను తొలగించుకుంటూ ముందుకు సాగాలనేదే తమ నిశ్చితాభిప్రాయమన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లుగా అభియోగాలను ఎదుర్కొంటున్న రవాణ మంత్రి థామస్ చాందీ హాజరైన కేబినెట్ సమావేశాన్ని బహిష్కరిస్తూ తమ పార్టీకి చెందిన నలగురు ఎమ్మెల్యేలు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన వివరించారు. నిందితునిగా అభియోగాలను ఎదుర్కొనే చాందీ పాల్గొనే అక్రమ సమావేశానికి హాజరుకాకూడదనే నిర్ణయం ఉమ్మడి బాధ్యత నుంచి వైదొలగడమనడం సహేతుకం కాదన్నారు.

గవర్నర్ దృష్టికి మళ్లీ సేవాపథకాల జాబితా

న్యూఢిల్లీ : ఢిల్లీ ఆప్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'డోర్‌స్టెప్ డెలివరీ ఆఫ్ సర్వీస్ స్కీమ్' (ఇంటివద్దకే సేవా పథకాలు) ప్రతిపాదన ఆమోదానికి మళ్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌కు పంపింది. దీనిపై ఆయన అభ్యంతరాలు లేవనెత్తిన నేపథ్యంలో సమగ్ర సమాదానాన్ని పంపామని ముఖ్యమంత్రి అరవిండ్ కేజ్రీవాల్ తెలిపారు. ఈ పథకం గవర్నర్-రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదానికి దారితీసింది. అవినీతిని రక్షించడానికే బైజాల్ ఈ పథకాన్ని ఆమోదించడంలేదని ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా విమర్శించారు. పౌరుల భద్రత, అవినీతిలపై అభ్యంతరం లేవనెత్తుతూ గవర్నర్ ఈ పథకాన్ని వెనుకకు పంపారు. ఆయన వ్యక్తం చేసిన అభ్యంతరాలపై సమగ్ర నివేదికతతో లేఖ కూడా పంపామని కేజ్రీవాల్ తెలిపారు. ఈ పథకంతో ఢిల్లీవాసులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, రేషన్‌కార్డులు, కులధృవీకరణ పత్రం వంటి 40 సేవలు ఇంటివద్దనే లభిస్తాయన్నారు. దీనితో మహిళలు, సీనియర్ సిటిజన్లకు భద్రతతోపాటు అదనపు ఖర్చులు ఉండవన్నారు. ఆన్‌లైన్ సర్వీసుల కన్నా ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సిసోడియా వివరించారు. ఆన్‌లైన్ కంటే ఒకసారి ఆయా శాఖలకు వచ్చి డాక్యుమెంట్లు అందచేస్తే ప్రభుత్వం ఇంటివద్దే పత్రాలను అందచేస్తామన్నారు. ఈ పథకాన్ని గవర్నర్ పిజ్జాలతో పోలుస్తూ డాక్యుమెంట్లు పిజ్జాల్లా డౌన్‌లోడ్ చేసుకోవడం కుదరదని ఎద్దేవా చేశారు. పిజ్జాలు డౌన్‌లోడ్ చేసుకోవడం, పరిశీలన కోసం ప్రజలకు సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేసి ఆయా ప్రభుత్వ ఆఫీసులకు పంపడం కుదరదని సిసోడియా, గవర్నర్‌కు దీటుగా సమాధానం చెప్పారు.

వీరే దొంగ బాబాలు



అలహాబాద్ : తమను తాము భగవంతుని అవతారంగా చెప్పుకునే నకిలీ బాబాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అఖిల భారత అఖార పరిషద్ కోరింది. దేశంలో 17 మంది నకిలీ బాబాలు ఉన్నారని పేర్కొంటూ తాజాగా రెండో జాబితాను విడుదల చేసింది. గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్, రాధేమా, నిర్మల్ బాబా, రాంపాల్, ఆశారామ్ బాపు సహా 14 మంది పేర్లతో సెప్టెంబరులో మొదటి లిస్ట్ తయారు చేసింది. మరో ముగ్గురి పేర్లను జతచేసి తాజా జాబితా విడుదల చేసింది. వీరేంద్ర దేవ్ దీక్షిత్(ఢిల్లీ), సచ్చిదానంద సరస్వతి(యూపీ), త్రికాల్ భవంత (అలహాబాద్) పేర్లను జాబితాకు జోడించింది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో వీరేంద్ర దేవ్ నిర్వహిస్తున్న మూడు ఆశ్రమాల నుంచి గతవారం 47 మంది మహిళలు, ఆరుగురు మైనర్ బాలికలను పోలీసులు కాపాడారు. దొంగ బాబాల గురించి సామాన్య ప్రజలు తెలుసుకునేందుకు ఈ జాబితా తయారుచేసినట్టు అఖిల భారత అఖార పరిషద్ అధ్యక్షుడు స్వామి నరేంద్రగిరి తెలిపారు. సాధువులు, సన్యాసులకు చెడ్డపేరు తీసుకువస్తున్న నకిలీ బాబాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'జూన్ నుంచి సైకిల్ యాత్ర చేస్తా... 29 వేల కి.మీ. తిరుగుతా'

న్యూఢిల్లీ : వేదాంగి కులకర్ణి వయసు పందొమ్మిదేళ్లు. అన్ని ఖండాలను 130 రోజుల్లో చుట్టి రావాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. దక్షిణ అమెరికా, అంటార్కిటికా మినహా మిగతా ఖండాలన్నిటినీ సైకిల్‌పై ప్రయాణించబోతోంది. 29వేల కి.మీ. దూరాన్ని సైకిలుపై ప్రయాణించి, ఈ ఘనత సాధించిన తొలి పిన్న వయస్కురాలిగా, వేగంగా ప్రయాణించిన యువతిగా రికార్డు సృష్టించాలనుకుంటోంది. భూ మండలంపైనున్న రకరకాల వాతావరణ పరిస్థితులను అధిగమించి, ఆమె ప్రయాణించవలసి ఉంటుంది. ఆమె తన లక్ష్యాన్ని సాధించడం నల్లేరుపై బండి నడక కాదు. వేదాంగి బోర్న్‌మౌత్ విశ్వవిద్యాలయంలో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ చదివింది. ముంబై నుంచి న్యూఢిల్లీ వరకు 1,400 కి.మీ. దూరం శిక్షణ సవారీ ప్రారంభించే ముందు ఆమె మాట్లాడుతూ తన ప్రయాణంలో చాలా చలి వాతావరణాన్ని ఎదుర్కొనబోతున్నానని, తనకు చాలా ఉత్తేజంగా ఉందని తెలిపింది. పుణేకు చెందిన వేదాంగి 2018 జూన్ లో ఆస్ట్రేలియాలోని పెర్త్ నుంచి తన సైకిలు యాత్రను ప్రారంభించబోతోంది. ఐదు దశల్లో తన యాత్రను పూర్తి చేయాలని ప్రణాళిక రచించుకుంది.

టికెట్‌లేని ప్రయాణికులతోనే నష్టాలు

రైల్వేపై పార్లమెంటరీ కమిటీ నివేదిక





న్యూఢిల్లీ : రైళ్లలో టికెట్ లేని ప్రయాణికుల సంఖ్య పెరగడంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. రైల్వేకు భారీ నష్టాలు రావడానికి ఇదే ప్రధాన కారణమని స్పష్టంచేసింది. పార్లమెంటరీ కమిటీ నివేదికను ప్రభుత్వం గతవారం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. రైల్వే కన్వెన్షన్ కమిటీ సైతం ఈ అభిప్రాయంతో ఏకీభవించింది. రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. అదే సమయంలో వారి నుంచి జరిమానా వసూలు చేయడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇందులో అవినీతి పెరిగిపోయింది. రైల్వేశాఖ నష్టాల బాటలో పయనించడానికి అవినీతీ ఓ కారణమని పార్లమెంటరీ కమిటీ తెలిపింది. 2016-17 కాలంలో భారతీయ రైల్వేలో టికెట్ లేకుండా లేదా సరైన టికెట్ కొనకుండా ప్రయాణించే వ్యక్తుల సంఖ్య భారీగా ఉన్నట్టు గుర్తించామని, ఇది ఆందోళన కలిగిస్తోందని కమిటీ నివేదిక పేర్కొన్నది. టికెట్ లేని ప్రయాణికుల నుంచి జరిమానా వసూలు చేయడం కూడా లేదని చెప్పింది. దేశవ్యాప్తంగా 2016-17లో టికెట్‌లేని రెండు కోట్లమంది ప్రయాణికుల నుంచి కేవలం రూ.935.64 కోట్లు మాత్రమే జరిమానాగా వసూలు చేశారని నివేదిక వివరించింది. నార్తరన్ రైల్వేలో అత్యధికంగా 26.40 లక్షల మంది టికెట్ లేకుండా ప్రయాణించినట్టు తెలిపింది. ఆ తర్వాత స్థానాల్లో సౌత్ సెంట్రల్(25.86 లక్షలు), సెంట్రల్ రైల్వే(24.24 లక్షలు), వెస్టన్ రైల్వే(20.24 లక్షలు), ఈస్టు సెంట్రల్ రైల్వే(18.62 లక్షలు), నార్త్ సెంట్రల్ రైల్వే(16.56 లక్షలు) ఉన్నాయని పేర్కొన్నది. ఈ జోన్‌లతో పాటు ఇతర అన్ని జోన్‌లలో తక్కువ మంది టికెట్ లేని ప్రయాణికులు ఉన్నట్టు గుర్తించామని చెప్పింది. సాధారణంగా నిబంధనల ప్రకారం టికెట్ లేని ప్రయాణికుల నుంచి అసలు టికెట్ ధర, అదనంగా జరిమానా రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. దీనితోపాటు ప్లాట్‌ఫారం టికెట్‌తో పాటు సరైన టికెట్ లేకుండా ప్లాట్‌ఫారంపైకి వచ్చినందుకు జరిమానాగా రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. నష్టాలకు సంబంధించి కచ్చితమైన గణాంకాలను నివేదిక వెల్లడించనప్పటికీ రెండుకోట్ల మంది టికెట్‌లేని ప్రయాణికుల నుంచి రూ.500 కోట్లు వసూలు చేసినట్టు రైల్వే తెలిపింది.

స్మార్ట్‌సిటీలపై మోడీ [illegible] : రాహుల్



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదివారం ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. కేంద్రం అట్టహాసంగా చేపట్టిన స్మార్ట్‌సిటీల పథకం అమలు తీరుపై రాహుల్‌గాంధీ నిశిత విమర్శలు గుప్పించారు. స్మార్ట్‌సిటీలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.9,860 కోట్లలో ఇప్పటి దాకా కేవలం 7శాతం మాత్రమే వెచ్చించినట్టు పేర్కొన్నారు. 'మోడీ భక్తులారా(అనుచరులారా) స్మార్ట్‌సిటీలకు కేటాయించిన మొత్తం రూ.9,860 కోట్లలో 7శాతం మాత్రమే ఖర్చు చేశారు. చైనాతో మనం పోటీ పడుతున్నామని మీ బాస్(యజమాని) ఉత్తుత్తి నినాదాలు ఇస్తున్నారు. దయచేసి ఈ వీడియో వీక్షించండి. భారతదేశానికి అత్యవసరమైన ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఏమి చేయాలో ప్రధానికి సలహా ఇవ్వండి' అని రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. ఆ వీడియోను సైతం రాహుల్ పోస్టు చేశారు. స్మార్ట్‌సిటీల పథకం కింద కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన వివరాల డేటా బహిర్గతమైన తర్వాత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. స్మార్ట్‌సిటీల ప్రాజెక్టు కింద 60 నగరాలకు విడుదల చేసిన రూ.9860 కోట్లలో 7 శాతం లేదా రూ.645 కోట్లు మాత్రమే ఇప్పటి దాకా ఖర్చు చేసినట్టు గృహ, పట్టణాభివృద్ధిమంత్రిత్వశాఖ డేటా వెల్లడించింది.

లింగసమానత్వం పాటించాలి : షర్మిలాఠాగోర్

కోల్‌కతా : లింగసమానత్వాన్ని పెంపొందించే విధంగా తల్లిదండ్రుల తమ పిల్లలను పెంచాలని నిన్నటితరం బాలివుడ్ హీరోయిన్ షర్మిలాఠాగోర్ పిలుపునిచ్చారు. 11వ గ్లోబల్ డాక్టర్స్ శిఖరాగ్ర సభ ముగింపులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు మగపిల్లవాడి కంటే ఆడపిల్లను తక్కువగా చూడరాదని ఇద్దరినీ సమానంగా పెంచాలన్నారు. ప్రజలు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోకుండా సమాజంలో మార్పురాదని ఆమె హెచ్చరించారు.

ముంబైలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ముంబై : ముంబై మున్సిపాలిటీ అనధికారికి నిర్మాణాలపై దృష్టి సారించింది. శుక్రవారం పబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది మృతిచెందడంతో బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కఠిన చర్యలు చేపట్టి అక్రమకట్టడాలను కూలుస్తోంది. నూతన ఏడాది వేడుకల తర్వాత ఈ చర్యలు చేపట్టాలని హెూటళ్లు, పబ్‌లు, మాల్స్ యాజమాన్యాలు కోరినప్పటికీ బీఎంసీ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, శనివారం 314 అక్రమకట్టడాలు కూల్చింది.

రాష్ట్రపతి కార్యదర్శిపదవి నెల పొడిగింపు

న్యూఢిల్లీ : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మిలటరీ కార్యదర్శి మేజర్ జనరల్ అనిల్ ఖోస్లాకు నెలరోజుల పాటు పదవి పొడిగించారు. ఆయన పదవీకాలం డిసెంబరు 31తో ముగియనుంది. పొడిగింపుతో ఆయన జనవరి చివరివరకు కొనసాగుతారని అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయ సిబ్బంది శాఖ వెలువరించింది.

యూపీ నూతన డీజీపీగా ఓపీసింగ్

లక్నో : ఉత్తరప్రదేశ్ నూతన డీజీపీగా ఓం ప్రకాష్ సింగ్ నియమితులయ్యారు. సుల్ఖాన్‌సింగ్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో సింగ్ నియమితులయ్యాకరని హెూంశాఖ కార్యదర్శి అదవింద్ కుమార్ ఆదివారం తెలిపారు. పదవీనియామకం కోసం యూపీ ప్రధానకార్యదర్శి రాజీవ్‌కుమార్ నేతృత్వంలోని ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి, రాష్ట్రప్రభుత్వం సీఐఎస్‌ఎఫ్ డీజీగా ఉన్న ఆయనను డీజీపీగా నియమించాలని కేంద్రాన్ని కోరడంతో ఈ నియామకం జరిగింది.

మావోయిస్టు కాల్చివేత

రాయ్‌పూర్ : భద్రతాదళాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. చత్తీస్‌ఘడ్‌లోని సుకుమా జిల్లాలో ఈ ఘటన జరిగిందని ఆదివారం పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి కోబ్రా, సీఆర్‌ఎఫ్, జిల్లా రిజర్వుగార్డు, స్పెషల్‌టాస్క్ ఫోర్సు గాలింపు చర్యల్లో పాల్గొన్నాయని అదనపు పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర శుక్లా తెలిపారు. కాల్పుల అనంతరం వారి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కేంద్రానికి జ్ఞానం ప్రసాదించు : మాయావతి

లక్నో: కేంద్ర బీజేపీ పార్టీ ప్రజావ్యతిరేక పాలన చేపట్టకుండా బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని బీఎస్పీ అధినేత్రి మాయావతి వెల్లడించారు. గతేడాది కాషాయపార్టీ నిర్ణయాలవల్ల 90శాతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అహంకార ధోరణితో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా దేవుడు జ్ఞానం ప్రసాదించాలన్నారు. నోట్లరద్దు, జీఎస్టీ అమలుతో దేశంలో ఆర్థిక అత్యవరస్థితి నెలకొల్పారని ఆమె విమర్శించారు.

తల్లీబిడ్డను తొక్కిచంపిన ఏనుగులు

కోర్బా : చత్తీస్‌ఘర్‌లో మహిళ ఆమె కుమారుడిని ఏనుగుల గుంపు తొక్కి చంపింది. ఈ ఘటన బలరాంపూర్‌లో జరిగిందని ఆదివారం అధికారులు తెలిపారు. అతౌరీకి చెందిన దంపతుల కుటుంబం తమ ఇద్దరు పిల్లలతో మోటారు సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళుతుండగా ఈ ఘటన జరిగిందని అటవీ అధికారి వివేకానంద్ ఝా తెలిపారు. మృతిచెందిన వారిని గీత(30) ఆమె కుమారుడు డిలేష్ (7) గా గుర్తించామన్నారు. భర్త మరో బిడ్డ వాటినుంచి తప్పించుకున్నారు.

ఆప్ 'బదలేంగే మధ్యప్రదేశ్' యాత్ర

భోపాల్ : ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) 'బదలేంగే మధ్యప్రదేశ్' (మధ్యప్రదేశ్‌ను మార్చుదాం) యాత్రను ఆదివారం ప్రకటించింది. బీజేపీ ప్రభుత్వం నుంచి ప్రజలను రక్షించాలన్న ధ్యేయంతో రాష్ట్రంలోని 230 అసెంబ్లీ స్థానాల్లో ఈ యాత్రను నిర్వహిస్తున్నామని ఆప్ రాష్ట్ర కన్వీనర్ అలోక్ అగర్వాల్ తెలిపారు. బీజేపీ అవినీతి ప్రభుత్వాన్ని వేర్లతోసహా పెకిలించాలని ఆపార్టీ పిలుపు నిచ్చింది. నాలుగో విడతలో రేవా, గ్వాలియర్, ఉజ్జెయిన్, జబల్‌పూర్, ఇండోర్, భోపాల్ ప్రాంతాల్లో పర్యటిస్తామని అలోక్ వెల్లడించారు.

పబ్ యజమానుల బంధువులు అరెస్టు

ముంబై : ముంబైలో అగ్నిప్రమాదానికి గురైన 'ఏ1 ఎబవ్' పబ్ యజమానుల ఇద్దరు బంధువులను ఆదివారం అరెస్టు చేశారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో 14 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. పబ్ యజమానులు హితేష్ సంఘ్వీ, జిగార్ సంఘ్వీ, సహ యజమాని అభిజీత్ మంకా, ఇతరులను వేర్వేరు కేసుల్లో అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. సంఘ్వీ సోదరులపై శనివారం లుక్అవుట్ నోటీసులు జారీ చేసి, వారి మేనమామ రాకేష్, ఆదిత్య సంఘ్వీలను అరెస్టు చేశామని పోలీసు అధికారి అవినాష్ వెల్లడించారు.

'తత్కాల్' సాఫ్ట్‌వేర్స్‌పై సీబీఐ దృష్టి

న్యూఢిల్లీ : రైల్వే తత్కాల్ బుకింగ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్స్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దృష్టి సారించింది. ఇటీవల అక్రమ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి తత్కాల్ కుంభకోణానికి పాల్పడిన ఉదంతం వెలుగుచూసిన నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించింది. సీబీఐలో ప్రోగ్రామర్‌గా పనిచేస్తూ అక్రమ సాఫ్ట్‌వేర్‌ను ఏజెంట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అజయ్ గార్గ్ అనే వ్యక్తిని ఇటీవల సీబీఐ అదుపులోకి తీసుకున్నది. గార్గ్‌ను విచారించిన సందర్భంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. తత్కాల్‌బుకింగ్‌కు సంబంధించి మోసపూరిత సాఫ్ట్‌వేర్‌లు ఆన్‌లైన్‌లో కొంతమొత్తం చెల్లింపుపై దొరుకుతున్నాయని గుర్తించారు. ఆయా సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి కొందరు ఏజెంట్లు బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి టికెట్లను పొందుతున్నారని సీబీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అలాంటి సాఫ్ట్‌వేర్‌లపై దృష్టి సారించామని, ఎవరైనా తప్పుచేశారని తేలితే చర్యలు తప్పవని సీబీఐ అధికారి ఒకరు హెచ్చరించారు. అలా చేయడం ఐఆర్‌సీటీసీ, రైల్వే శాఖ నిబంధనల ప్రకారం అక్రమమని పేర్కొన్నారు. ఆయా సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగిస్తున్న ఏజెంట్లు టికెట్లను పొందడంతో పాటు వాటిని అధిక ధరకు విక్రయిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని వెల్లడించారు. తత్కాల్ టికెట్ల విక్రయం ప్రారంభమైనప్పుడు కొందరు ఇలాంటి సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఒకేసారి పలు యూజర్ ఐడీలతో లాగిన్ అవ్వడంతో పాటు ఒకే క్లిక్‌తో పెద్దమొత్తంలో టికెట్లను పొందుతున్నారని వెల్లడించాడు.



జన్మభూమిలో నిలదీయండి

విశాలాంధ్ర - శెట్టూరు : రాష్ట్రంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని, పచ్చచొక్కాలు వేసుకొన్న వారికే ప్రభుత్వ ఫలాలు దక్కుతున్నాయని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ఈ అన్యాయంపై రెండవ తేదీ నుంచి జరగబోయే జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు సంఘటితంగా పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా శెట్టూరు మండలంలోని ఐదుకల్లు, కనుకూరు, ములకలేడు, అనుంపల్లి, తిప్పనపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం 'ఇందిరమ్మ రాజ్యం-ఇంటింటా సౌభాగ్యం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బోయ వీరాంజినేయులు ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రఘువీరారెడ్డి ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ పేదలకు ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం అందని ద్రాక్షలా మారిందని, పచ్చచొక్కాలు వేసుకొన్న పెద్దలకు పెద్దపీఠ వేస్తున్నారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల కోసం తిమ్మసముద్రం వద్ద 1100 ఎకరాల భూమి కొనుగోలు చేసినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు అయినా ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కృష్ణాజలాలను నియోజకవర్గవ్యాప్తంగా చెరువులను నీటితో నింపుతామన్నారు. బాబు అధికారంలోకి వస్తే జాబు వస్తుందని ఊరూరా ప్రచారం చేసినా ఎక్కడా కనబడలేదన్నారు. నేటికీ నిరుద్యోగ భృతి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితీసి ప్రతి పేదోడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమచేస్తామని ఇచ్చిన మాటను మోడీ నిలబెట్టుకోలేక పోయారన్నారు. ఈ ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే ప్రత్యేక హోదాపై మొదటి సంతకంచేసి తిమ్మసముద్రానికి పరిశ్రమలు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బాలనరేంద్రబాబు, సుధీర్, సింగల్‌విండో అధ్యక్షుడు శివన్న యాదవ్, పార్టీ మండలాల కన్వీనర్లు అశోక్, ఈరన్న, బసవరాజు, రాఘూపాల్‌రెడ్డి, కుబేరయాదవ్, మాజీ సర్పంచ్ వీరబద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



విశాలాంధ్ర - దుర్గి : కమాండర్ జీపును కోళ్ళ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లాలో దుర్గి మండలం అడిగొప్పల గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. దుర్గి- కారంపూడి ప్రధాన రహదారిలో ఎర్రవాగు బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ ఘోర ప్రమాదం తీవ్ర విషాదం మిగిల్చింది. కారంపూడికి చెందిన కమాండర్ జీపు తొమ్మిది మంది ప్రయాణీకులతో మాచర్ల వైపుకు బయలుదేరింది. దుర్గి నుంచి కారంపూడి వెళ్తున్న కోళ్ళవ్యాన్ ఎర్రవాగు బ్రిడ్జిపై జీపును వేగంగా ఢీ కొట్టింది. దుర్గి మండలం కాకిరాలకు చెందిన పుట్టా మంగమ్మ (70), కమాండర్ జీపు డ్రైవర్ మస్తాన్‌వలి (45), మరో మహిళ అక్కడిక్కడే మృతి చెందారు. ఆవుల పున్నయ్య తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలకు మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు మృతి

విశాలాంధ్ర - గుర్ల : విజయనగరం జిల్లా గుర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. గుర్ల, కోటగండ్రేడు గ్రామాలకు చెందిన యువకులు వంకర శ్యామ్ (18) పొట్నూరు ప్రసాద్ (26) ప్రమాదంలో మృతి చెందటంతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. విజయనగరం నుంచి ప్రసాద్, శ్యామ్ కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో పాలకొండ నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. గుజ్జింగవలస గ్రామ సమీపంలో ఇటుక బట్టీ వద్ద కూలి పనులతో జీవిస్తున్న శ్యామ్, ప్రసాద్ విజయనగరంలో సరుకులు కొనుక్కొని వస్తుండగా ఈ ఘోరం జరిగింది. గుర్ల ఎస్సై రవి కేసు దర్యాప్తు చేస్తున్నాన్నారు.



నాటక కళకు పరిషత్‌ల ప్రోత్సాహం అభినందనీయం

విశాలాంధ్ర - తెనాలి : తెనాలి నాటక కళ మసకబార కుండా పరిషత్‌ల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా ఐదు రోజులుగా కొనసాగుతున్న పోలేపెద్ది నరసింహామూర్తి, తుమ్మల వెంకట్రామయ్య, నందమూరి తారకరామారావు 10వ రాష్ట్ర స్థాయి ఆహ్వాన సాంఘిక నాటికల పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. కళాపరిషత్ కమిటీ కన్వీనర్ షేక్ జానీబాషా అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ తుమ్మల వెంకట్రామయ్య, పోలేపెద్ది నరసింహామూర్తి సమాజ చైతన్య కరదీపికలుగా నాడు కళారంగానికి అందించిన సేవలను గుర్తు చేస్తూ ఎన్టీఆర్ కళాపరిషత్‌ను ముందుకు తీసుకువెళ్తున్న ప్రతినిధులు అభినందనీయులన్నారు. కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు దిలీప్‌రాజా మాట్లాడుతూ కళాపరిషత్‌ల నిర్వహణకు పారితోషకాలు కూడా ప్రభుత్వమే ఇవ్వడం ద్వారా మరింత ప్రోత్సాహం అందించినట్లు అవుతుందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పెండేల వెంకట్రావు మాట్లాడుతూ కళలకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు

ఉత్తమ ప్రదర్శనగా శ్రీకారం, మరో నాలుగు బహుమతులు

కాకినాడకు చెందిన ఎస్.ఎస్.ఆర్.పి.గురుప్రసాద్, హైదరాబాద్‌కు చెందిన కె.వి.బలరామ్‌మూర్తి, ఫిరంగిపురానికి చెందిన పి.రాజారావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన కళాపరిషత్ నాటిక పోటీల్లో మొత్తం 13 నాటికలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'శ్రీకారం' నాటకం ప్రథమ బహుమతితోపాటు ఉత్తమ సహాయనటిగా సురభి ప్రభావతి, ఉత్తమ సంగీతం తుమ్మల సాంబశివరావు, ఉత్తమ నటుడుగా గోపరాజు రమణ, ఉత్తమ దర్శకుడిగా గోపరాజు విజయ్‌లు బహుమతులు అందుకున్నారు. ఉక్కునగరం చైతన్య కళాస్రవంతి వారి 'నాన్న నువ్వో సున్నానా' నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శన బహుమతి అందుకుంది. ఉత్తమ రచన, ఉత్తమ సహాయ నటుడిగా బాలాంజనేయులకు లభించాయి. ఉషోదయా కళానికేతన్ కట్రపాడు వారి 'గోమాలక్ష్మిలో' నాటికలో లహరికి ఉత్తమ నటి అవార్డు, చెరుకూరి సాంబశివరావుకు ఉత్తమ సహాయ నటుడు అవార్డు దక్కాయి. మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి తెలుగు నాటికకు జూరీ అవార్డు దక్కింది. ఆయా నాటికలలోని కళాకారులు శివప్రసాద్, వీరభద్రయ్య, సుబ్బారావు, జి.ప్రసన్న, పి.నాగేశ్వరరావులు జూరీ అవార్డులు అందుకున్నారు.. ఉత్తమ ప్రదర్శనకు రూ.10 వేలు, ద్వితీయ ప్రదర్శనకు రూ.5వేలు నగదు పారితోషకం అందజేశారు. హైదరాబాద్ మిత్ర క్రియేషన్ తగులు నాటిక, థియేటర్స్ ఆర్టిస్ అసోసియేషన్ అమరావతి ప్రత్యేక ప్రదర్శన 'జీవన వేదం' నాటికలు ప్రేక్షకులను అలరించాయి. సభలో కావేటి సామ్రాజ్యం, ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, సౌపాటి కిరణ్, బి.వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం



విశాలాంధ్ర- విజయవాడ (కల్చరల్) : విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ, ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో 29వ పుస్తక మహోత్సవం నేటి నుంచి ప్రారంభమవుతుందని సొసైటీ అధ్యక్షులు వెంకట నారాయణ తెలిపారు. స్థానిక సొసైటీ భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీన పుస్తక మహోత్సవాన్ని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారన్నారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 11 గంటలకు ప్రారంభసభ ఉంటుందన్నారు. సొసైటీ మీడియా విభాగం కన్వీనర్ బి.బాబ్జీ మాట్లాడుతూ పుస్తక మహోత్సవ ప్రాంగణానికి మహాలక్ష్మీ బుక్‌ఎంటర్ ప్రైజెస్ అధినేత యూఎస్.యోగి పేరు పెడుతున్నామన్నారు. 300 స్టాల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. సాహితీవేదికపై సాహిత్య సభలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రోజుకు ఎనిమిది మంది రచయితలతో సమలోచన కార్యక్రమాలు ఉంటాయన్నారు. జనవరి 4వ తేదీ సాయంత్రం విజయవాడ ప్రెస్‌క్లబ్ నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు పుస్తకప్రియుల పాతయాత్రలో విద్యావంతులు, ఉన్నాతాధికారులు, రచయితలు, కవులు పాల్గొంటారన్నారు. సమావేంలో నావ్యంధ్ర పుస్తక సంబరాల కమిటీ కన్వీనర్ ఎమ్మెల్సో దూపాటి విజయ్‌కుమార్, సోసైటీ గౌరవాధ్యక్షులు కె.లక్ష్మయ్య, కోశాధికారి కె.రవి, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో విష్ణు, ప్రతినిధి పెద్దిరామారావు, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ డి.విజయ్‌భాస్కర్ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

'రామతీర్థ సాగర్'కు మంగళం!

- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- గడువు ముగిసినా ప్రశ్నించని పాలకులు
- విజయనగరం పట్టణానికి తాగునీరు ప్రశ్నార్థకం

(విశాలాంధ్రబ్యూరో-విజయనగరం) :
ఆదినుంచీ కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజుకు ఇష్టంలేని తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టుకు మంగళం పాడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ పథకం నుంచి విజయనగరం పట్టణానికి తాగునీరు అందించే ప్రతిపాదనపై నీలినీడలు అలముకున్నాయి. ఇటీవల కేంద్రమంత్రి చేసిన ప్రకటనతో ఈ అనుమానాలు నిజమయ్యే అవకాశాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చే ప్రతిపాదనే కరవైంది.

జిల్లాలోనే అత్యంత సీనియర్ శాసనసభ్యుడు నెల్లిమర్ల, భోగాపురం నియోజకవర్గాల నుంచి ఎనిమిదిసార్లు గెలుపొందిన పతివాడ నారాయణస్వామి నాయుడి కలల ప్రాజెక్టు తారకరామ తీర్థసాగర్. అయితే ఈ ప్రాజెక్టును ఆదినుంచీ ప్రస్తుత కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు వ్యతిరేకిస్తున్నారు. పూసపాటిరేగ, డెంకాడ భోగాపురం మండలాల్లోని 49 గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూర్చడంతో పాటు 24,710 ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టు డిజైన్ రూపొందించారు. 0.48 శతకోటి ఘనపు టడుగుల నీరు విజయనగరం పట్టణానికి అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. తొలుత రూ.220.04 కోట్ల ప్రతిపాదనతో ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా అంచనా వ్యయం రూ.471.31 కోట్లకు పెరిగింది. సవరించిన అంచనాలతో ఈ ఏడాది జులై నెలాఖరుకు పనులు పూర్తికావాల్సి ఉంది. ప్రాజెక్టులో భాగంగా చంపావతి నదిపై గుర్లమండలం కోటగండ్రేడు వద్ద బ్యారేజి, పూసపాటిరేగ మండలం కుమిలి వద్ద రిజర్వాయర్ నిర్మాణాలు ప్రధానమైనవి. దీనికోసం మధ్యలో 1.472 కిలోమీటర్ల మేర సొరంగం కూడా తవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రాజెక్టు కోసం మొత్తం రూ.202.3663 కోట్లు ఖర్చు చేశారు. బ్యారేజి పనులు 80 శాతం, రిజర్వాయర్ పనులు 41 శాతం వరకు పూర్తయ్యాయి. అయితే ఈ పథకంపై ఇప్పటివరకు కేంద్రమంత్రి అశోక్ ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదు. చంపావతిలో నీరు లేనందున ఈ ప్రాజెక్టే దండగని అశోక్ ముందునుంచీ



విముఖత వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలోని రెండు నెలల్లో వృథాగా సముద్రంలోకి పోయే నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేసి ఆ తరువాత వ్యవసాయం, తాగునీటి అవసరాలకు వాడుకొనేందుకు ఈ ప్రాజెక్టును ఇంజనీర్లు డిజైన్ చేశారు. ఇప్పటికే దాదాపు సగం నిధులను ఖర్చు కూడా చేశారు. మంత్రులు పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలుగా ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. కాంట్రాక్టర్‌ను అడిగినవారు లేదు. మంత్రులే పట్టించుకోకపోవడంతో అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. జులై నెలాఖరునాటికి పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టు నేటికీ అతీగతి లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వ పెద్దల వైఖరి గమనిస్తుంటే ఈ ప్రాజెక్టుకు మంగళం పాడే అవకాశాలే ఎక్కువ ఉన్నాయన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

విజయనగరం పట్టణానికి తాగునీరు ఎలా ?

తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తయితే విజయనగరం పట్టణానికి 30 ఏళ్ల పాటు తాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కుమిలి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా 0.48 టీఎంసీ నీటిని పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చి పట్టణ ప్రజలకు సరఫరా చేయాలన్నది ప్రతిపాదన. దీనికోసం రూ.38 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా ప్రాజెక్టు ఆలస్యమవడంతో అంచనా వ్యయం రూ.50.6 కోట్లకు పెరిగింది. దీనికి సంబంధించి ఇప్పటికే దాదాపు 45 శాతం పనులు పూర్తయ్యాయి. వివిధ కారణాలతో ఈ పనులు కూడా మూడేళ్ల నుంచి మూలకు చేరాయి. తారకరామ తీర్థసాగర్, పట్టణానికి తాగునీటి పథకాలను ఏమాత్రం పట్టించుకోని అశోక్ గజపతిరాజు కొత్త ప్రతిపాదనలు తెరపైకి తెచ్చారు. తోటపల్లి నీటిని గడిగెడ్డలోకి, అక్కడినుంచి చంపావతి నదిలోకి మళ్లించి పట్టణవాసులకు తాగునీరు అందించాలని నిర్ణయించారు. దీనికోసం కొద్దిరోజుల క్రితమే చంపావతిలో ఊటబావుల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే దీనిద్వారా కూడా పట్టణానికి వచ్చే నీరు అంతంత మాత్రమే అనే విమర్శలు లేకపోలేదు. ఈ బావులు పూర్తయినా అదనంగా పట్టణానికి చేరే నీరు కేవలం రోజుకు 10 మిలియన్ లీటర్లు మాత్రమే. ఈ నీరు పట్టణప్రజల భవిష్యత్ అవసరాలకు ఎంతమాత్రం సరిపోదు.

చంపావతిలో తగినంత నీరు లేకపోవడంతో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టువల్ల పెద్దగా ప్రయోజనం లేదనేది కేంద్ర మంత్రి భావనగా తెలుస్తోంది. మరోవైపు అదే నదిలో ఊటబావుల నిర్మాణంతో తాగునీరు అందించేందుకు తోటపల్లిని చంపావతితో అనుసంధానం చేయాలని కేంద్ర మంత్రి నిర్ణయించారు. నదుల అనుసంధానం ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ, ఇప్పటికే సగభాగం నిర్మాణమైన తీర్థసాగర్‌పై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పట్టణ వాసులు భావిస్తున్నారు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో విలువైన ప్రజాధనాన్ని వృధా చేయకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని ప్రజలు కోరుతున్నారు.



టీచర్ చెంప దెబ్బకు విద్యార్థినికి చెముడు

విశాలాంధ్ర- విస్సన్నపేట : సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో ఓ ఉపాధ్యాయుడు దెబ్బలకు ఓ విద్యార్థిని వినికిడి కోల్పోయిన ఘటన కృష్ణాజిల్లా విస్సన్నపేటలో ఆదివారం వెలుగుచూసింది. నర్సాపురం సాంఘిక బాలికల పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థిని మల్లాది స్నేహ ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయన్న కారణంతో బయాలజీ ఉపాధ్యాయురాలు కవిత తీవ్ర ఆగ్రహంతో శుక్రవారం విద్యార్థిని చెవిపై కొట్టారు. తీవ్రంగా బాధపడుతున్న విద్యార్థిని స్నేహను ఆదివారం విస్సన్నపేటలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకొచ్చారు. ఉపాధ్యాయురాలు చెంపపై కొట్టిన వెంటనే స్నృహ కోల్పోయానని, రెండు రోజులుగా నొప్పితో బాధ పడుతున్నానని, నరాలు దెబ్బ తిన్నట్లు వైద్యులు సూచించినట్లు బాధిత బాలిక వాపోయింది. ఘటన జరిగిన రోజు విద్యార్థి స్నృహ కోల్పోయినప్పటికీ ఉపాధ్యాయులు కనీసం విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని, ఇటువంటి నిర్లక్ష్య ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజాసంఘాల నేతలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై ఆదివారం ఎస్సై తులసీధర్ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహ సహచర విద్యార్థులను, తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించామన్నారు. ఈ ఘటన వాస్తవమేనన్నారు. ఎంతో భవిష్యత్ కలిగిన పిల్లలను చదువు పేరుతో ఉపాధ్యాయులు కనీస బాధ్యత మరచి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం బాధాకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం అమ్మకాలకు వెసులుబాటుపై
అనంతలో మహిళల నిరసన



విశాలాంధ్ర - అనంతపురం అర్బన్ : నూతన సంవత్సర వేడుకల పేరుతో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు కొనసాగించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంపై ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యాలయంలో అధికారులెవ్వరు లేకపోవడంతో అక్కడ నుంచి గుల్జార్ పేటలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏ.పద్మావతి, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ నూతర సంత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 30, 31 తేదీల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలంటూ నాలుగైదు రోజులుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీల్లో అర్ధరాత్రి 12, 1 గంటల వరకు మద్యం షాపులు, బార్లు తెరుచుకుని ఉండేలా పైగా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఆదాయం కోసం ఇలా ప్రవర్తించడం దారుణమన్నారు. ప్రతి ఏడాది నూతన సంవత్సరం వేడుకల్లో ఎన్నో అపశృతలు చోటుచేసుకుంటున్నాయని, యువత మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బి.వరలక్ష్మి, నగర కార్యదర్శి ఈ.జయలక్ష్మి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు జమీర్, నగర నాయకులు కేశవ్‌గౌడ్, మోహన్, డి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికశాఖ ఆఫీసులకు సొంత భవనాలు

- ఆర్థికశాఖలో 40 వేల పోస్టులు ఖాళీ
- ప్రభుత్వ ఆదాయం తగ్గింది
- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల



విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో రూ.80 కోట్లతో ఆర్థికశాఖ కార్యాలయాలు, 66 సబ్ ట్రెజరీ కార్యాలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. కాకినాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని ఆర్థికశాఖ కార్యాలయాలు అద్దెభవనాల్లో కొనసాగడంతో ఖర్చు పెరుగుతుందన్నారు. దీంతో దశల వారీగా ఆధునిక టెక్నాలజీతో సొంత భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఆర్థికశాఖ కార్యాలయాల్లో 40వేల పోస్టులు ఖాళీలు ఉన్నాయని, త్వరలో భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బంది ఉన్నప్పటికీ పెండింగ్ బకాయిల బిల్లులు రూ.10 వేల కోట్లకు పైగా చెల్లించినట్లు చెప్పారు. సచివాలయం తదితర భవన నిర్మాణాలకు ఆకృతులను సిద్ధమయ్యాయన్నారు. ఆదాయవనరులు తగ్గడంతో అనుకున్నంత రెవెన్యూ రావడం లేదని, రియల్ ఎస్టేట్‌రంగం తగ్గుముఖం పట్టడంతో భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయి ఆదాయం తగ్గిందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యధికంగా ఖర్చు చేయడంతోపాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, పారిశ్రామికరంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు.

సీఈల బదిలీల్లో పైరవీలకు పెద్దపీట

విశాలాంధ్ర - విశాఖపట్నం : జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ కుర్చీకి యమ గిరాకీ పెరిగింది. పైరవీలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఆరు నెలలకోసారి సీఈని మార్చడంతో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వంపై న్యాయస్థానంలో పోరాడి ఆరు నెలల క్రితం మళ్లీ సీఈ బాధ్యతలు చేపట్టిన దుర్గాప్రసాద్‌ను నెల రోజుల క్రితం వుడా సీఈగా బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అయితే ఈ జీవో నేటికీ అమలు కాలేదు. తాజాగా ఈ జీవో అమలుకు సచివాలయంలో పైరవీలు మొదలయ్యాయనే ప్రచారం సాగుతోంది. వుడా సీఈగా కొనసాగుతూ ఈఎన్‌సీ విధులు కూడా నిర్వహిస్తున్న చంద్రయ్యను జీవీఎంసీ సీఈగా ప్రభుత్వం ఈ జీవో ద్వారా నియమించినప్పటికీ తాజాగా ఈఎన్‌సీగా కొనసాగించి సీఆర్‌డీఏ సీఈగా నియమించనున్నట్లు తెలుస్తుంది. గుంటూరులో ఎస్‌ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న మరియన్నను నీటి సరఫరా విభాగం ఎస్‌ఈగా నియమించి ఆయనకే ఇన్‌చార్జి సీఈ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. నాలుగు రోజులుగా సీఈ పోస్టు జీవీఎంసీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకోసారి ప్రభుత్వం ఎందుకు బదిలీ చేస్తుందో అంతుపట్టక తలలుపట్టుకుంటున్నారు. రాష్ట్ర మంత్రుల చెప్పు చేతుల్లో ఉండే అధికారులను కొనసాగిస్తూ నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేసే వారిపై బదిలీ వేటు వేస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి



చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం

విశాలాంధ్ర - విశాఖపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విశాఖ జగదాంబ జంక్షన్‌లోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పోలీస్‌వ్యవస్థను చంద్రబాబు చేతుల్లోకి తీసుకున్నారన్నారు. సమాజంలో వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న పత్రికారంగాన్ని అణచివేస్తున్నారన్నారు. 22 మంది ఎమ్మెల్యేలను చంద్రబాబు కొనుగోలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. కేంద్ర భూసేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ రాష్ట్రం చట్టం చేసి రైతుల ఉసురు తీసిందన్నారు. పోలవరం నిర్మాణంలో కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికే నిరంతరం ఆలోచిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయల ఖర్చుతో సమ్మిట్‌లు నిర్వహించినా ఎక్కడ పెట్టుబడులు రాలేదన్నారు. కొత్త ఏడాదైనా ప్రజా స్వామ్య పాలన సాగించాలని సూచించారు. సమావేశంలో వైసీపీ నేతలు తైనాల విజయ్‌కుమార్, గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

జన్మభూమికి ఇంటర్ విద్యార్థులు?

- ఇంటింటి సర్వేకు వినియోగం
- ఆందోళనలో తల్లిదండ్రులు
- ఇరకాటంతో కాలేజీల యాజమాన్యాలు

విశాలాంధ్ర-టెక్కలి : తెలుగుదేశం ప్రభుత్వం మానస పుత్రిక జన్మభూమి కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ప్రణాళిక రూపొందించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా జన్మభూమి-మాఊరు గ్రామసభల్లో ఈ సారి ఇంటర్మీడియట్ విద్యార్థులను పాల్గొనేలా చేస్తుందన్న సమాచారంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల రెండవ తేదీ నుంచి మొదలయ్యే జన్మభూమి గ్రామసభల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు బృందాలుగా హాజరుకావాలి. గ్రామసభ జరుగుతున్నంతసేపు విద్యార్థుల బృందాలు ఇంటింట సర్వే



నిర్వహించనున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. పర్యవేక్షకునిగా ఆయా కళాశాలల సీనియర్ అధ్యాపకులను నోడల్ అధికారులుగా నియమించాలని ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేయడంతోపాటు సోమవారం ఉత్తర్వులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. జన్మభూమి సభల విజయవంతం కోసం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కళాశాల యాజమాన్యాలకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రెండు నెలల్లో ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పదిరోజులపాటు కొనసాగే జన్మభూమి సభల్లో విద్యార్థులు పాల్గొనడం, వెంటనే సంక్రాంతి సెలవులు కావడంతో చదువులకు దూరమవుతారనేది తల్లిదండ్రుల ఆందోళన. ఫిబ్రవరి మొదటివారంలోనే ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను గ్రామాలకు తరలించాల్సి రావడంతో కళాశాలల యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి గ్రామసభలకు విద్యార్థులను వినియోగించాలన్న ఆలోచన వివాదాస్పదంగా మారింది.

విద్యార్థులపై వ్యాధుల సవారీ

విశాలాంధ్ర అమరావతి: సర్కారు బడులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పిల్లలకు వైద్య పరీక్షలు చేసేందుకు నియమించిన ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులు, ఒక ఏఎన్ఎం, ఒక ఫార్మసిస్టు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు 30 రకాల వ్యాధులకు వైద్యం అందించాల్సి ఉంటుంది. ఏడాదిలో పాఠశాలలను ఓ దఫా, అంగన్‌వాడీ కేంద్రాలను రెండుసార్లు సందర్శించి పిల్లలకు వైద్యసేవలు అందిస్తారు. చిన్నారుల్లో వ్యాధి తీవ్రతను బట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, కార్పొరేట్ వైద్యశాలలకు రిఫర్ చేస్తారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నారని వెల్లడైంది. చర్మ, కంటి, దంత సమస్యలతో సతమతమవుతున్నవారు అధికంగా ఉన్నారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, శుభ్రత పాటించడంలోనూ శ్రద్ధ వహించడం లేదు. ఒకవేళ చిన్నారులు అనారోగ్యం బారిన పడినా వారికి సకాలంలో వైద్యసేవలు అందించడంలో వెనకడుగు వేస్తున్నారు. ఫలితంగా సమస్య తీవ్రతరమవుతున్నట్లు ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం గుర్తించారు. విద్యార్థుల పరిశుభ్రతపై పాఠశాల ఉపాధ్యాయులకు బాధ్యత ఉంది. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకూ శుభ్రత, వారి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి. ఆ దిశగా చొరవ చూడటంలో ఉపాధ్యాయులు మిన్నకుండిపోతున్నారు. దీంతో చిన్నారులపై వ్యాధులు సవారీ చేస్తున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒకరు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఎక్కువ మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో దరిచేరడం లేదు. పోషకాహార లోపం కారణంగా పిల్లల్లో రోగ నిరోధక శక్తి తగ్గిపోతోంది. ఎండలో కాసేపు ఆడితేనే నీరసించిపోతున్నారు. ఇక జబ్బుకు కుంగిపోతున్నారు. కాల్షియం, విటమిన్ ఏ లోపంతో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆకు, కూరగాయలు తినేవారి సంఖ్య తగ్గిపోతోంది. ఫలితంగా పిల్లల ఆరోగ్యంపై ఆ ప్రభావం పడుతోంది. తిన్నాక నోరు శుభ్రం చేసేవారి సంఖ్య వేళ్లలో లెక్కించొచ్చు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడంతో వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోంది.

మరోసారి డ్రగ్స్ కలకలం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నూతన సంవత్సరం వేళ హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. రెండు రోజుల క్రితం డ్రగ్స్‌తో ముగ్గురు నైజీరియన్లు పట్టుపడగా, తాజాగా మరో ఇద్దరు చిక్కారు. నూతన సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్‌కు డ్రగ్స్ తెచ్చిన ముఠాను రాచకొండ పోలీస్ కమిష నరేట్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. యాప్రాల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఇద్దరు నైజీరియన్లు డ్రగ్స్‌తో దొరికారు. ఇద్దరు నైజీరియన్లను అరెస్టు చేయగా బెంజిమన్ అనే మరోవ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫోన్‌కాల్ డేటా ఆధారంగా డ్రగ్స్ కొన్న వారిని గుర్తిస్తామని రాచకొండ సీపీ మహేష్ భగవత్ విలేకరులకు తెలిపారు. రూ.50.70 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 16 గ్రాముల కొకైన్, 23 గ్రాముల హెరాయిన్, 40 గ్రాముల అల్ప్రాజెలం, 15 గ్రాముల అంఫిట మైన్, 7 ఎంకే జీహెచ్‌బీ స్టెరాయిడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. టోలీచౌకీ కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. డీజే అంకిత్ పాండే హైదరాబాద్ పబ్బులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని స్పష్టం చేశారు. వీరి పాస్‌పోర్టు, వీసాలు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు వివరించారు. విద్యార్థి వీసాపై వచ్చిన ఇద్దరిలో 19 ఏళ్ల నైజీరియన్ సికింద్రాబాద్ పీజీ కళాశాలలో, యువతీ ఆర్‌బీ బీఏఆర్ కళాశాలలో బీఫార్మసీ చదువుతున్నారన్నారు.

పైసా వసూల్..



విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి : దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్న చందంగా మారింది ఇళ్ల క్రమబద్ధీకరణ వ్యవహారం. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరించుకునేందుకు వీలుగా ప్రభుత్వం జీఓ నంబరు 388ని జారీ చేసింది. ఇదే వీఆర్‌ఓలకు అక్షయ పాత్రగా మారింది. ఇళ్ల క్రమబద్ధీకరించుకోవాలంటే వీఆర్‌ఓ విచారించి క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇదే వారి పాలిట కల్పతరువుగా మారింది. దరఖాస్తులు సమర్పించినా వీఆర్‌ఓ వరం కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారు. పైసలు ఇస్తేనే సంతకం చేస్తామని వీఆర్‌ఓలు తెగేసి చెబుతున్నారు. ఒక సంతకానికి రూ.10 వేలు ఇవ్వనిదే కుదరదంటు భీష్మించుకుంటున్నారు. రూ.2 నుంచి 3 వేలు ఇస్తామని, సంతకం పెట్టాలని బ్రతిమలాడినా ససేమిరా అంటున్నారు. ఇది జిల్లాలో ఇళ్లు క్రమబద్ధీకరించుకోవాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజల బతుకులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017 ఆగస్టు 24వ తేదీ జీఓ నంబరు 388ని విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో ఇది వరకే ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వాటిని ఎటువంటి అభ్యంతరం లేని పక్షంలో క్రమబద్ధీకరించుకోవాలని కోరింది. దారిద్రరేఖ దిగువన ఉన్న కుటుంబాలు 100 చదరపు గజాలలోపు ఇళు నిర్మించుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరించుకోవచ్చు. 100 నుండి 150 చదరపు గజాల లోపు ఉన్న వారు మార్కెట్ విలువలో 7.5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. 150 నుండి 250 చదరపు గజాలలోపు ఇళ్లు నిర్మించుకున్న వారు 15 శాతం, 250 నుండి 500 చదరపు గజాల లోపు ఉన్న వారు 30 శాతం చెల్లించాలి. 500 చదరపు గజాల పైబడి నిర్మించుకున్న వారి ఇళ్లు బహిరంగ వేలం నిర్వహించబడుతుందని ఆ జీఓలో ప్రభుత్వం పేర్కొంది. ఒక కుటుంబానికి ఒక ఇంటికి మాత్రం క్రమబద్ధీకరించబడుతుందని స్పష్టం చేసింది. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే వారు వారి ఆధార్ కార్డుతో పాటు నివాసం ఉంటున్న ఇంటికి సంబంధించిన ఇంటి పన్ను, కరెంటు బిల్లు, తదితర వాటిని సమర్పించాల్సి ఉంటుంది. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని సంబంధిత తహశీల్దార్‌లకు పంపిస్తారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో తహశీల్దారు విచారణ జరుపుతారు. అనంతరం 250 చదరపు గజాల వరకు గత ఇళ్లను ఆర్‌డీఓ పర్యవేక్షణలో క్రమబద్ధీకరిస్తారు. 500 వరకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరుగుతుంది. 2017 డిసెంబరు 15వ తేదీ వరకు 100 చదరపు గజాల ఇళ్లకు సంబంధించి 1,145 దరఖాస్తులు అందాయి. 500 చదరపు అడుగుల లోపు 1,874 దరఖాస్తులు అందగా 1,148 అప్లికేషన్‌లను తిరస్కరించారు. మిగిలిన 726 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారు నిరభ్యంతర సర్టిఫికెట్ ఇచ్చే క్రమంలో వీఆర్‌ఓలకు కాసులు కురుస్తున్నాయి. ఒక్కో సర్టిఫికెట్‌కు 10 వేల నుండి 20 వేల రూపాయల వరకు భూమి విలువను బట్టి డిమాండు చేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలోని ఓ మండలంలో పని చేస్తున్న వీఆర్‌ఓ రూ.10 వేలు ఇస్తేకాని నీ పని పూర్తి చేయనని తెగేసి చెప్పేసాడు.

ఆ దరఖాస్తుదారుడు తన పని ఎలాగైనా పూర్తి చేసుకోవాలన్న తపనతో 3 వేల రూపాయలు ఇస్తామనని చెప్పినా కుదరదన్నాడు. మీరిచ్చే మొత్తంలో నాకే దక్కదని కొంత ఉన్నతాధికారులకు కూడా ఇవ్వాలని చెప్పడం చూస్తే వీఆర్‌ఓల ఇష్టారాజ్యం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. వీఆర్‌ఓలతో విసిగిపోయిన ఆ దరఖాస్తు దారుడు జిల్లా ఉన్నతాధికారి, అవినీతి నిరోధక అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడ్డాడు. ఇదే తరహాలో జిల్లాలో క్రమబద్ధీకరణ జీఓను కల్పతరువుగా మార్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వీఆర్‌ఓల ఆగడాలపై దృష్టి సారించాలి. లేని పక్షంలో అవినీతి నిరోధక శాఖ అధికారులైనా వీరిపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

సాగర తీరంలో న్యూఇయర్ జోష్

హోటళ్లన్నీ కిటకిట... చర్చిలు, దేవాలయాలు కళకళ..



విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ సాగరతీరంలో న్యూ ఇయర్ జోష్ ఆదివారం సాయంత్రం నుంచే మొదలైంది. యువత, విద్యార్థులతోపాటు నగర ప్రజలంతా పార్టీలు, వేడుకలకు తరలివచ్చారు. దీంతో సాగరతీరం జనసంద్రంగా మారింది. నగరంలో ఉన్న దాదాపు 50 హోటళ్లు నిండిపోయాయి. ప్రధానంగా బీచ్ రోడ్డులో ఉండే హోటళ్లకు గిరాకీ పెరిగింది. మరోపక్క వీధుల్లో కూడా టెంట్లు వేసి, డెకరేషన్లు చేసి న్యూయర్ వేడుకలు జరుపుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలు సౌండ్ సిస్టమ్స్‌తో ఉర్రూతలూగారు. మరికొంతమంది రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్, సీనియర్ సిటిజన్స్‌తోపాటు వాకర్స్ వంటి సంఘాలు వివిధ పార్కులలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు తమ తమ నేతలు, అధికారులతో న్యూఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఇంకో పక్క నగరంలో చర్చిలు, దేవాలయాలన్నీ ప్రజలతో కిటకిట లాడాయి. షాపింగ్ మాల్స్‌లోనూ, నగర ప్రధాన వీధుల్లోనూ న్యూ ఇయర్ శోభ కనిపించింది. సాయంత్రం 7 నుంచే బ్యాకరీస్ వద్ద, ఫుడెక్స్‌లు వద్ద కేక్‌లు కోసం క్యూలు కట్టిన దృశ్యాలు కనిపించాయి. యువకులు కాస్త అత్యుత్సాహంతో సాగర తీరంలో భీమిలి బీచ్ వరకు బైకులపై రేసులు నిర్వహించి న్యూయర్ వేడుకలు జరుపుకున్నారు. అయితే కుర్రకారు జోరుకు పోలీసులు బ్రేకులు వేసారు. అడుగడుగునా పోలీస్ తనిఖీలతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో అనేకమంది పట్టుబడ్డారు. మొత్తంమీద న్యూ ఇయర్ వేడుకలు విశాఖలో ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. మరోపక్క మంచు, చలిని సైతం లెక్కచేయకుండా రాత్రి 1గంట వరకు బీచ్‌లోనే జనసందోహం న్యూ ఇయర్ వేడుకలకు తరలివచ్చారు.

సంక్రాంతి కంటే ముందే 'జన్మభూమి-మా ఊరు'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతి కంటే ముందే వస్తున్న నవక్రాంతి 'జన్మభూమి- మా ఊరు', పది రోజులు కొనసాగే పెద్ద పండుగని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారందరికి 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల సంబరమైతే ఇది 10 రోజుల పండుగని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రపంచంలో ఎక్కడున్నా స్వగ్రామాలకు తరలివచ్చి రెండో తేదీ నుంచి ఆరంభం కానున్న 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. నూతన సంవత్సరానికి నూతన సంకల్పం తీసుకోవాలని కోరారు. పదహారు వేల కోట్ల ద్రవ్య లోటుతో నవ్యాంధ్ర ప్రయాణం నలభై రెండు నెలల క్రితం ప్రారంభమైందని, దశాబ్దాలుగా నినాదంగా మోగిన నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా నిజం చేశామని చెప్పారు. కృష్ణానది ఎగువ ప్రాజెక్టుల నుంచి చుక్క నీరు రాని తరుణంలో పట్టిసీమ ద్వారా గోదావరి నదీ జలాలను ప్రకాశం బ్యారేజీకి తీసుకొచ్చామన్నారు. మూడేళ్లుగా కృష్ణా డెల్టాలో పట్టిసీమ గోదావరి జలాలతో 18 వేల కోట్ల విలువైన పంట రైతుల ఇంటికి చేరిందన్నారు. నదుల అనుసంధానం చేసి రైతాంగం కళ్లల్లో ఆనందం చూసి, ఇటీవల ప్రకాశం బ్యారేజీ 60 ఏళ్ల ఉత్సవాల్లో పాల్గొన్నందుకు తానెంతో గర్వించానని చెప్పారు. విభజన నాడు 22.5 మి.యూ. విద్యుత్ లోటు ఉందని, నిరంతర విద్యుత్ పథకంతో 3 నెలల్లోనే సాధారణ పరిస్థితికి తెచ్చామని, ఏడాదికే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో నెంబర్ వన్ ర్యాంక్ సాధించిందని సీఎం చెప్పారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించామన్నారు. ఆర్థికంగా ఒడిదుడుకుల్లో ఉన్నా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణ ఉపశమనం అమలు చేశామని, 45 లక్షల వరకు సామాజిక పింఛన్లు అందజేస్తున్నామని శరవేగంగా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతర శ్రమతో, పటిష్ట వ్యూహంతో ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి కోరారు.

ఢిల్లీలో భారీ భద్రత

- సరిహద్దు చెక్ పోస్టలను మూసివేసిన పోలీసులు
- ప్రముఖుల నివాసాల వద్ద గస్తీ
- కొత్త సంవత్సరం సందర్భంగా నిఘా వర్గాల హెచ్చరిక



న్యూఢిల్లీ-విశాలాంధ్ర బ్యూరో : కొత్త సంవత్సరం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీకి భారీ భద్రతను కల్పించారు. ఢిల్లీలోని పార్లమెంటు, రాష్ట్రపతి భవనం, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, ప్రముఖుల నివాసాలతోపాటు ఢిల్లీ సీఎం, గవర్నర్ నివాసాల వద్ద భద్రతా దళాలు మోహరించాయి. భారత్, పాక్ మధ్య సరిహద్దుల్లో కాల్పులు, మరోవైపు జమ్మూ కాశ్మీర్‌లోని సీఆర్‌పీఎఫ్ శిక్షణా శిబిరాలపై ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను పెంచారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ అప్రమత్తమైంది. మెట్రోనగరాలన్నీ కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. కాగా కొత్త సంవత్సరం సందర్భంగా ఢిల్లీలోని పలు కట్టడాలు విద్యుత్ కాంతులతో దగదగలాడాయి. పార్లమెంటు, రాష్ట్రపతి భవన్‌తో పాటు కేంద్ర మంత్రుల కార్యాలయాలకు విద్యుత్ దీపాలను అలంకరించారు. ఢిల్లీ లోపలికి వచ్చే రహదారుల వద్ద ఉన్న చెక్‌పోస్టులను మూసివేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఢిల్లీలోకి ఎవ్వరూ ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలను ఏకం చేస్తున్నందుకు ప్రతీకారంగా దేశంలోని పలు ప్రాంతాలపై దాడులు చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహరచన పన్నారని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు జనవరి 26 రిపబ్లిక్ డే కూడా రానున్న నేపథ్యంలో ఢిల్లీని భద్రతా దళాలు తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. జనవరి నెలాఖరు వరకు కూడా ఢిల్లీలోని అన్ని వీధులు పోలీసుల పహారాలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంటున్నాయి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భద్రతా దళాలు సన్నద్ధమై ఉన్నట్లు అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం.

రజనీకాంత్‌కి చదువేదీ?

రాజకీయ ప్రవేశ ప్రకటనపై సుబ్రమణ్యస్వామి



న్యూఢిల్లీ: రజనీకాంత్ 'నిరక్షరాస్యుడు' అని బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామి పేర్కొన్నారు. ఆదివారం రజనీ రాజకీయ ప్రవేశంపై స్వామి స్పందిస్తూ 'మరొక సినీ నటుడు రాజకీయాల్లోకి వస్తున్నారు. దానిపై రాద్ధాంత ఎందుకు, బహుశా ఆయనకు మంచి మీడియా మేనేజర్‌లు ఉండవచ్చు. అది కేవలం జోక్ మాత్రమే. పార్టీని తర్వాత ప్రకటిస్తానన్నారు. ఆయన ఒక నటుడు. అవినీతిని నిర్మూలించగలనని ఏవిధంగా చెప్పారు. సినిమా నటులు కూడా అవినీతిని నిర్మూలించగలరా. రజనీకాంత్ తమిళనాడుకు ఏం చేశారు. ఆయనకు సంబంధించిన వివరాలు లేదా ధ్రువీకరణ పత్రాలు లేవు. ఆయనొక నిరక్షరాస్యుడు' అని పేర్కొన్నారు. ఇదంతా కేవలం మీడియా ప్రచారమేనని, తమిళనాడు ప్రజలు చాలా తెలివైన వారని, రాజకీయాలను అర్థం చేసుకోగలరని స్వామి చెప్పారు. 'మీడియా ద్వారా సినిమా నటులు రాజకీయాలు చేయలేరు. అవినీతిని నిర్మూలిస్తామని ప్రకటిస్తారు. వాస్తవం బయటకు వస్తే పారిపోతారు. బీజేపీ మద్దతు ఇస్తుందో లేదో తెలియదు కానీ నేను కచ్చితంగా వ్యతిరేకిస్తాను' అని సుబ్రమణ్య స్వామి స్పష్టం చేశారు.

రజనీకి బిగ్‌బీ, కుష్బూ అభినందన

తమిళ సినీ రంగ సూపర్ స్టార్ తన రాజకీయ ప్రవేశంపై ఆదివారం ప్రకటన చేయడంతో మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌తోసహా ఇతర ప్రముఖులు తమ అభినందనలు తెలియజేశారు. 'నా ప్రియ మిత్రుడు, నా సహచరుడు రజనీకాంత్ రాజకీయాల్లో ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన విజయం సాధించాలని అభినందనలు తెలుపుతున్నా' అని బచ్చన్ ట్వీట్ చేశారు. 'రజనీకాంత్ రాజకీయాల్లో చేరడమే 2017 ఏడాది చివరి రోజు అతిపెద్ద వార్త' అని బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అన్నారు. రితేష్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ సూపర్ స్టార్ ఉద్దేశం ఉన్నతమైనది. విశేష అభిమానం పొందుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి, నటి కుష్బూ సుందర్ ట్వీట్ చేస్తూ, 'రజనీకాంత్ ప్రజాస్వామ్యాన్ని, అభివృద్ధిని విశ్వసిస్తారని మాకు తెలుసు. ఆయన ప్రయత్నాలను అభినందిస్తున్నాం' అని పేర్కొన్నారు.

న్యూఇయర్‌కు కాసుల వర్షం

- తెలుగు రాష్ట్రాల్లో రికార్డుస్థాయిలో బిజినెస్
- ఏరులై పారనున్న మద్యం
- రూ.500కోట్ల వరకు అమ్మకాలు : ఎక్సైజ్ శాఖ అంచనా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హుషారెత్తించే మ్యూజిక్, మత్తులో ముంచెత్తే లిక్కర్, ఆకాశం అంచులను తాకే బాణాసంచా, కేకులు, గ్రీటింగ్స్... న్యూఇయర్ అంటే ఇంకా ఎన్నో. న్యూ ఇయర్ వస్తుందంటే ప్రపంచవ్యాప్తంగా సందడి నెలకొంటుంది. అది మన సంస్కృతి కాకపోయినా దేశంలోనూ అదే సంబురం. న్యూ ఇయర్‌లో బిజినెస్ కూడా భారీగానే జరగనుంది. డిసెంబరు 31 వేడుకల కోసం వారం ముందు నుంచే ప్రణాళికలు సిద్ధమవుతాయి. ఇక ఈవెంట్స్ సంస్థలైతే 3, 4 నెలల నుంచే ప్రిపరేషన్స్ సిద్ధం చేశాయి. ఇలా ఎవరికి వాళ్లు న్యూ ఇయర్ పార్టీల కోసం రెడీ అయిపోతారు. అక్కడా.. ఇక్కడా అని కాదు, పల్లెల్లోనూ కొత్త సంవత్సరం వేడుకలు సర్వసాధారణంగా మారాయి. అందుకే ఎప్పటికప్పుడు న్యూ ఇయర్ బిజినెస్ రికార్డులను నెలకొల్పుతోంది. మద్యం అమ్మకాల మొదలుకొని పార్టీలు, ఈవెంట్లు ఇలా అన్నింటిలోనూ రికార్డు స్థాయిలో వసూళ్లు ఉంటాయి. మద్యం అమ్మకాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. కొత్త సంవత్సరం సబురంలో ఎన్ని వేల కోట్లు చేతులు మారనున్నాయి. ఇది స్టార్ హోటల్స్ నుంచి గల్లీలోని బేకరీ వరకూ హైప్రొఫైల్ పార్టీల నుంచి సాధారణ చికెన్ సెంటర్ల వరకూ ప్రతీ ఒక్కరికీ కాసులు కురిపించే రోజు. ఒక్కసారి ఈ బిజినెస్ చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఆ రేంజ్‌లో బిజినెస్ జరగనుంది. కొత్త సంవత్సరానికి వెల్‌కమ్ చెప్పేందుకు పాత సంవత్సరానికి గుడ్ బై చెప్పేందుకు ఎవరి పరిధిలో వాళ్లు సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. న్యూ ఇయర్ అంటే చాలు టక్కున గుర్తొచ్చేది మద్యమే. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ న్యూ ఇయర్ అమ్మకాలు ఆల్ టైమ్ రికార్డులు సృష్టిస్తాయి. ఇప్పుడు కూడా ఆ రేంజ్‌లో సేల్స్ ఉంటాయని అబ్కారీ శాఖ అంచనాలు వేస్తోంది. న్యూయర్ వేడుకల్లో మద్యం ఎరులై పారనుంది. డిసెంబరు మూడో వారంలోనే లిక్కర్ అమ్మకాలకు రెక్కలొచ్చాయి. గత ఏడాది డిసెంబరులో రూ.200ల కోట్ల అమ్మకాలు జరిగితే ఈసారి అది రూ.500 కోట్లకు పెరగవచ్చని ఎక్సైజ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇది ఒక్క తెలంగాణలోనే. దేశవ్యాప్తంగా మొత్తం రూ.1000 కోట్లకు పైగానే ఉంటుందన్నది ఓ అంచనా. గతేడాది డిసెంబరు 31న రూ.100 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగగా ఈసారి అది పెరిగే అవకాశం ఉంది. నోట్ల రద్దు సమయంలోనే వంద కోట్లు అంటే ఈసారి రూ.120 కోట్ల వరకూ సేల్స్ జరుగుతాయని తెలంగాణ ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే 134 పార్టీలకు పోలీస్, అబ్కారీ శాఖ అనుమతులు వచ్చాయి. హైదరాబాద్‌వ్యాప్తంగా 542 బార్లు, పబ్బులు, క్లబ్బులకు పర్మిషన్ ఇచ్చింది. ఇక రిసార్టుల్లోనే కాదు చిన్నాచితకా పార్టీల్లోనూ మద్యం ఏరులై పారనుంది.

విదేశీ సాయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు మరో మూడు నెలల్లో మొదలవుతాయని తెలుస్తోంది. ఈప్రాజెక్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు విదేశీ సాంకేతిక నిపుణుల సాయం పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. చైనా, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన నిపుణుల బృందం మార్చిలో విచ్చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం. జూన్‌లోగా తొలి దశ పనులు ముగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈలోగానే ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకునే పంపుసెట్లను, మోటార్లను ప్రాజెక్టు పరిధిలో నిర్ణయించిన చోట ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పనులు సజావుగా జరిగేందుకు హామీ లభించనుంది. ఇందుకుగాను మొత్తం 11 పంపు సెట్లను దిగుమతి చేసుకోనున్నారు. దిగుమతి చేసుకునే యంత్రపరికరాలు, సాంకేతిక ఉపకరణాలు పంపుసెట్ల పని తీరును ప్రాజెక్టు ఇంజనీర్లకు విదేశీ నిపుణులు శిక్షణ ఇస్తారని అధికారుల కథనం. ప్రతిపాదిత యంత్రాలు, పంపు సెట్లు, విద్యుత్ ఉపకరణాలకు సంబంధించిన దిగుమతి ఆర్డర్లను ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చినట్లు తెలుస్తోంది. దిగుమతి ప్రక్రియ చురుకుగా సాగుతోందని ఫిబ్రవరి చివరినాటికి ప్రాజెక్టు సైట్‌కు యంత్ర సామగ్రి చేరుతుందని అధికారి ఒకరు తెలిపారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను అనుసరించి రాష్ట్ర ఇరిగేషన్ శాఖలో మొత్తం 300ల మంది ఎలక్ట్రికల్ ఇంజనీర్ల నియామకాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొత్తగా నియామకం పొందిన ఇంజనీర్లకు సంబంధిత ఎత్తిపోతల పథకాల్లో ఉపయోగించనున్న ఆధునిక సాంకేతికత ఇమిడిన పంపుసెట్ల పని తీరు గురించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. 20సంవత్సరాల పాటు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు సంస్థ చూడాలి. గడువు ముగిసిన తరువాత ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వ పరం అవుతాయి. ప్రాజెక్టులో ఇతర పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఇరిగేషన్ శాఖలోని ఇతర ఇంజనీర్లు చూస్తారు.

పీజీటీ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్స్ (పీజీటీ) నియామక ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెల్లడించింది. గణితం, జీవ, భౌతిక, సాంఘిక శాస్త్రాల పీజీటీ ఫలితాలను ప్రకటించింది. మొత్తం 513 పోస్టులకు జూలై 18, 19 తేదీల్లో రాతపరీక్షలు జరిగాయి. గణితంలో 126 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన టీఎస్‌పీఎస్సీ. 114 అభ్యర్థులను భర్తీచేసింది. దివ్యాంగులకు సంబంధించిన ఫలితాలు వైద్య ధృవీకరణ పత్రాలందిన తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. జీవ శాస్త్రంలో 22 పోస్టులకుగాను 21 భర్తీచేసి, మరో పోస్టుకు అర్హులు లభించలేదని తెలిపింది. సాంఘిక శాస్త్రంలో 177 పోస్టుల్లో 166, భౌతిక శాస్త్రంలో 188 పోస్టులకు 174 భర్తీచేసినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు 921 పీజీటీ పోస్టుల ఫలితాలు వెల్లడించినట్లు తెలిపారు. ములుగులో కొత్తగా ఏర్పాటు చేసిన అటవీ కళాశాలలో ప్రొఫెసర్ల ఉద్యోగ నియామకాల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ రెండు పోస్టులకు 8 మందిని ఎంపిక చేసినట్లు వాణిప్రసాద్ తెలిపారు. లైబ్రేరియన్ పోస్టు కోసం జనవరి 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు

రైళ్ళు, విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగ మంచు కమ్మేసింది. రోజంతా పొగమంచు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోవటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దట్టమైన పొగ మంచు కారణంగా పలు రైళ్లు, విమానాల రాకపోకలకు తీవ్రమైన ఆటంకం కలిగింది. సుమారు 20 రైళ్ళు ఆలస్యంగా నడవగా, కొన్ని రైళ్ళను రద్దు చేశారు. విమానాల రాకపోకల్లో తీవ్రమైన ఆలస్యం కారణంగా ఢిల్లీ ఎయిర్ పోర్టులో ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. ఢిల్లీలో ఉదయం 6 గంటల నుంచే పొగమంచు ప్రారంభమై రాత్రి వరకు కూడా అదే పరిస్థితి కొనసాగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 7 డిగ్రీలుగా నమోదయ్యాయి. కొత్త సంవత్సర వేడుకులకు కూడా ఈ పొగ మంచు తీవ్ర అంతరాయం కలిగించింది. భారీ పొగమంచు కారణంగా అప్రమత్తంగా ఉండాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది.

యువతే పునాది (మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలన్నారు. ఈ నూతన సంవత్సరంలో ఒక 'ప్రగతిశీల భారతదేశం' కోసం ప్రజలు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాశ్మీర్ సివిల్ సర్వీస్ పరీక్షల్లో టాప్ ర్యాంకర్ అంజుమ్ బషీర్ ఖాన్ కట్టక్ స్ఫూర్తిదాయక కథను ఈ సందర్భంగా ప్రధాని మోడీ గుర్తుకు తెచ్చారు. 'వాస్తవంగా అతను ఉగ్రవాదం, ద్వేషం నుంచి బయటపడ్డాడు. కాశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ పరీక్షలో టాప్‌గా నిలిచాడు. 1990లో అతని పూర్వీకుల ఇంటికి ఉగ్రవాదులు నిప్పుపెట్టారన్న విషయం తెలిస్తే మీరు ఆశ్చర్య పోతారు' అని మోడీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, హింస విస్తృతంగా ఉన్నాయి. దీంతో అతని కుటుంబం పూర్వీకుల భూమిని వీడి వెళ్లాల్సి వచ్చింది. ఒక చిన్నారి హృదయంలో ఇటువంటి హింసయుత వాతావరణం చీకటిని, చేదును సులభంగా సృష్టింగలదు. కానీ అంజుమ్ అలా ఉండలేదు. తన ఆశను విడిచిపెట్టలేదు. ప్రజలకు సేవ చేయాలన్న కొత్త పథాన్ని ఎంపిక చేసుకున్నాడని మోడీ పేర్కొన్నారు. 2000 సంవత్సరం లేదా ఆ తర్వాత పుట్టిన వారు 2018, జనవరి 1 నుంచి ఓటర్లుగా అర్హత పొందే క్రమం ప్రారంభమవుతుందన్నారు. 'నూతన భారత ఓటర్లు అయిన 21వ శతాబ్దపు ఓటర్లకు భారత ప్రజాస్వామ్యం స్వాగతం పలుకుతుంది. మన యువతకు అభినందనలు తెలుపుతున్నారు. ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అభ్యర్థిస్తున్నా. నూతన భారత్‌కు పునాది అని మీరు నిరూపించాలి. ఓటు శక్తి ప్రజాస్వామ్యానికి గొప్ప బలం. లక్షలాది మంది ప్రజల జీవితాల్లో ఒక సానుకూల మార్పు తీసుకురావడంలో అత్యంత సమర్థవంతమైన సాధనం' అని తెలిపారు. 'పేదరికం, మురికివాడల నుంచి, అవినీతి, ఉగ్రవాదం, మత, కులతత్వ విషం నుంచి నూతన భారతం విముక్తి పొందనున్నది. ఈ నూతన భారతంలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు లభిస్తాయి. అలాగే వారి ఆకాంక్షలు, కోరికలు నెరవేరుతాయి' అని మోడీ చెప్పారు. పరిశుభ్రతపై మోడీ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం రూపంలో ఒక మార్పును ఇపుడు చూడవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాలలో మిషన్ లక్ష్యాల అంచనాకు జనవరి 4వ తేదీ నుంచి మార్చి 10 వరకు పరిశుభ్రత సర్వే-2018 నిర్వహించనున్నట్లు చెప్పారు. 4 వేలకుపైగా నగరాల్లో 40 కోట్లకుపైగా ప్రజలకు ఈ సర్వే జరుగుతుందన్నారు. రాజ్‌పథ్ వద్ద 2018, జనవరి 26 రిపబ్లిక్ డే పరేడ్‌కు ఒకరు కాదు 10 మంది ఏసియన్ (అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఏసియన్ నేషన్స్) దేశాల నుంచి ముఖ్యఅతిథులు రానున్నారని, భారతదేశ చరిత్రలో ఇది అపూర్వమైనదని తెలిపారు.

పురుషుడి సంరక్షణ లేకుండా హజ్‌కు ముస్లిం మహిళలు

హజ్ యాత్రకు ముస్లిం మహిళలను కేవలం మగ సంరక్షుడితో మాత్రమే అనుమతించే విధానం అన్యాయమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. హజ్ యాత్రకు ఒక్కరే వెళ్లేందుకు వందలాది మంది మహిళలు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో తన ప్రభుత్వం ఆంక్షలను తొలగించిందన్నారు. ప్రస్తుతం 45 ఏళ్ల వయస్సు పైబడిన ముస్లిం మహిళలు 'మహరమ్' లేకుండా హజ్ యాత్రకు వెళ్లేందుకు అనుమి ఇవ్వనున్నట్లు మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రధాని మాట్లాడుతూ 'మహరమ్ లేదా మగ సంరక్షకుడిని కలిగి ఉండాలన్న ఆంక్షలను తొలగించడం ఒక చిన్న విషయంగా కనిపించవచ్చు. కానీ అటువంటి విషయాలు మన సమాజంపై చాలా ప్రభావం చూపుతాయి' అని పేర్కొన్నారు. 'మనకు స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా ఈ వివక్ష ఎందుకు' అని ప్రశ్నించారు. 'మహరమ్' లేకుండా హజ్ యాత్రకు వెళ్లేందుకు ఈసారి సుమారు 1300 మంది ముస్లిం మహిళలు దరఖాస్తు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఉత్తర భారతం, కేరళ నుంచే కాకుండా దేశంలోని అనేక ప్రాంతాల మహిళలు దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ముస్లిం మహిళలందరికీ అనుమతి ఇవ్వాలని మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఆయన సూచించారు.

'తలాక్'పై మార్గం గుర్తించిన ముస్లిం మహిళలు

లోక్‌సభలో ఒక నిషేధ బిల్లు ఆమోదం తర్వాత ట్రిపుల్ తలాక్ అంశంపై ప్రధాని మోడీ తొలిసారి వ్యాఖ్యానించారు. కేరళలోని వర్కాల శివగిరి మఠం వద్ద 85వ శివగిరి తీర్థయాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల ఇబ్బందుల తర్వాత ట్రిపుల్ తలాక్ నుంచి తమను తాము స్వతంత్ర కోరుకోవడానికి ముస్లిం మహిళలు చివరిగా ఒక మార్గాన్ని గుర్తించారని అన్నారు. ట్రిపుల్ తలాక్‌పై నిషేధం మహిళల హక్కుల కోసం చేపట్టిన అతిపెద్ద చర్యగా ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదం, బినామీ ఆస్తులు, అవినీతి, నల్లధనం కట్టడికి సంస్కరణ చర్యలను తన ప్రభుత్వం చేపట్టినప్పటికీ 2018లో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా ప్రజలు పని చేయాలన్నారు.

సమాచారం లేకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లొద్దు

ముఖ్యమంత్రులకు కేంద్ర హోంశాఖ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : చెప్పాపెట్టకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లవద్దని కేంద్ర హోంమంత్రిత్వశాఖ ముఖ్యమంత్రులందరికీ విజ్ఞప్తి చేసింది. అలా చేయడం వల్ల భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నది. ఆకస్మికంగా ఆయా రాష్ట్రాలకు వెళ్లడం వల్ల సంబంధిత రాష్ట్రాలు భద్రత కల్పించడం కష్టంగా మారిందని తెలిపింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు పంపింది. అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం ఇవ్వకుండానే కొన్నిసార్లు ముఖ్యమంత్రులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని చెప్పింది. ఇది పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా అక్కడి ప్రభుత్వం భద్రత కల్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని తెలిపింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రులకు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉందని చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది. కేవలం భద్రతా కారణాల వల్లే ఇలాంటి హెచ్చరికలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నది. ముఖ్యమంత్రి ఎవరైనా ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళితే ముందుగానే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించాలని సూచించింది. ముఖ్యమంత్రులందరికీ జెడ్ లేదా జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉంటుంది. ఎవరైనా ఇతర రాష్ట్రాల్లో పర్యటించాలనుకుంటే ముందుగా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారమిస్తే అవసరమైన భద్రత కల్పించడం సాధ్యపడుతుందని హోంశాఖ స్పష్టంచేసింది. అందువల్ల ఇతర రాష్ట్రాలకు వెళ్లేటప్పుడు పూర్తి వివరాలు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పాల్సిందేనని చీఫ్ సెక్రటరీలకు తేల్చిచెప్పింది.

ప్రాక్టీస్ మ్యాచ్‌కు వరుణుడి అడ్డంకి

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో కొత్త ఏడాదిలో జరిగే ప్రతిష్ఠాత్మక సిరీస్ కోసం టీమిండియా ఇప్పటికే కేప్‌టౌన్ చేరుకొని అక్కడ ప్రాక్టీస్ ప్రారంభించింది. సౌతాఫ్రికాతో భారత్ మూడు టెస్టులు, ఆరు వన్డేలు, మూడు టీ-20లు ఆడనుంది. శ్రీలంకపై వరుస విజయాల ఉత్సాహంతో ఉన్న టీం ఇండియా దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌ని కూడా కైవసం చేసుకొనేందుకు కసరత్తు చేస్తోంది. అయితే కోహ్లిసేన చేస్తున్న ఈ కసరత్తుకు తాజాగా వరుణ దేవుడు అడ్డుపడ్డాడు. కేప్‌టౌన్‌లో భారీ వర్షం కురుస్తుండటంతో టీం ఇండియా సభ్యులు ఇన్‌డోర్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను టీం ఇండియా అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. జనవరి 5న జరిగే తొలి టెస్టుకు ఓపెనర్ శిఖర్ ధవన్ గాయం కారణంగా దూరమయ్యాడు. దీంతో ధవన్ స్థానంలో శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో రెండు సెంచరీలు కొట్టిన తమిళనాడు ఆటగాడు మురళీ విజయ్‌ను జట్టులోకి తీసుకున్నారు.

సమయం లేదు మిత్రమా..

రణమా..! శరణమా..!

- గతంలో కన్నా బలంగా ఉన్నాం
- మేం సవాలుకు సిద్ధం
- భ్రమల్లో లేం.. ఎలా ఆడాలో తెలుసు
- మీడియాతో కోచ్ శాస్త్రి, కెప్టెన్ కోహ్లి



కేప్‌టౌన్:
దక్షిణాఫ్రికా కఠిన సవాల్‌కు టీమిండియా సిద్ధంగా ఉన్నట్టు కోచ్ రవిశాస్త్రి ప్రకటించాడు. గతంతో పోలిస్తే తామిప్పుడు మరింత బలంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశాడు. విదేశీ గడ్డపై పరిస్థితులను ఆకళింపు చేసుకోవడమే పర్యాటక జట్టుకు అత్యంత కీలకమన్నాడు. దక్షిణాఫ్రికా చేరుకున్న తర్వాత మీడియాతో మాట్లాడాడు. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఈనెల 5న కేప్‌టౌన్‌లో రెండు జట్ల మధ్య తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. 'సవాల్‌కు భారత్ సిద్ధంగా ఉంది. నాలుగేళ్ల క్రితం మీరిది అడిగివుంటే నేను కాదని చెప్పేవాడిని. ఇప్పటి జట్టు అనుభవం సంపాదించింది. ప్రత్యర్థి ఎవరైనా వెన్ను చూపకపోవడమే ప్రస్తుత జట్టు అందం. మేం అవతలి వారిని గౌరవిస్తాం. పిచ్‌ను చూసి పరిస్థితులను అన్వయించుకుంటాం. రిజర్వు బెంచ్‌లో ఫాస్ట్ బౌలింగ్ విభాగం బలం పెరిగింది. ఇరవై వికెట్లు తీయడంలో ఇదెంతో కీలకం' అని రవిశాస్త్రి అన్నాడు. టీమిండియా పేస్ విభాగం బలం పెరగడంతో క్యురేటర్లు ఊరించే పిచ్‌ను తయారు చేస్తారా అన్న ప్రశ్నకు శాస్త్రి స్పందించాడు. 'ప్రతి మ్యాచ్‌ను మేం స్వదేశంలో ఆడినట్టే ఆడతాం. కేప్‌టౌన్‌నూ అలాగే భావిస్తున్నాం. ముందు పిచ్‌ను పరిశీలిస్తాం. పరిస్థితులను అర్థం చేసుకుంటాం. ఎలాంటి ఫిర్యాదులు చేయం. రెండు జట్లూ అదే వికెట్‌పై ఆడతాయి కదా! ఇంగ్లండ్‌లోనూ పేస్ పిచ్‌లే ఉంటాయి. భారత్‌లో టర్న్ అవ్వొచ్చు. ఎక్కడికెళ్లినా పరిస్థితులకు తగ్గట్టు ఆడాల్సిందే. ఇక మా కుర్రాళ్లు వృత్తిలో సంతృప్తి కోరుకుంటున్నారు. పరుగులు చేసి వికెట్లు తీసినప్పుడు అది కలుగుతుంది. అందుకే కష్టపడుతున్నారు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ ప్రతిభ ఉన్న జట్టు. కోహ్లిసేనకు ఇది మంచి అవకాశం' అని శాస్త్రి చెప్పాడు.

ఎలా ఆడాలో మాకు తెలుసు : కోహ్లి

దక్షిణాఫ్రికా పర్యటనలో ఎలా ఆడాలో తమకు తెలుసని, భ్రమల్లో లేమని టీమిండియా సారథి విరాట్ కోహ్లి స్పష్టం చేశాడు. ఈ పర్యటనలో ఎదురయ్యే సవాళ్ల కోసం ముందుగానే సిద్ధమయ్యామని పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో ఇప్పటి వరకు ఒక్క సిరీస్ కూడా గెలవలేదని పేర్కొన్న కోహ్లి, గత నాలుగేళ్లతో పోలిస్తే జట్టు ఆటతీరు ఎంతో మెరుగుపడిందన్నాడు. సిరీస్‌ను గెలిచి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. దక్షిణాఫ్రికా-ఎ జట్టుతో వార్మప్ మ్యాచ్ రద్దు కావడపై కోహ్లి స్పందిస్తూ.. దానివల్ల ఎటువంటి నష్టమూ లేదని, మ్యాచ్‌తో రెండు రోజుల సమయాన్ని వృథా చేసుకోవడం కంటే నెట్స్‌లో కష్టపడడమే మంచిదని పేర్కొన్నాడు. ఈ సిరీస్‌ను తనకు, డివిలియర్స్‌కు మధ్య పోటీగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్న కోహ్లి, అతడిని ఔట్ చేస్తే గెలిచినట్టు కాదని స్పష్టం చేశాడు.

రెండోస్థానంలో కోహ్లి



2017 ముగింపు ర్యాంకులు ప్రకటించిన ఐసీసీ

దుబాయ్:
ఐసీసీ 2017 ఏడాదికిగాను చివరిసారి టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకులు జాబితా వెల్లడించింది. టీమిండియా సారథి విరాట్ కోహ్లి 893 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. వీరోచిత ఫామ్‌లో ఉన్న ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్ తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 947 రేటింగ్ పాయింట్లతో డాన్ బ్రాడ్‌మన్‌కు చేరువ అవుతున్నాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌లో అతడు 76, 102 నాటౌట్‌తో నిలిచిన సంగతి తెలిసిందే. అదే మ్యాచ్‌లో 244 పరుగులు చేసిన ఇంగ్లాండ్ మాజీ టెస్ట్ సారథి అలిస్టర్ కుక్ తొమ్మిది స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంకుకు చేరుకున్నాడు. అతడు 2017 తొలినాళ్లలో 15వ ర్యాంకు, యాషెస్‌కు ముందు పదో ర్యాంకులో ఉన్నాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు హషీమ్ ఆమ్లా ఏడు, డేవిడ్ వార్నర్ ఆరు, జోరూట్ ఐదు, కేన్ విలియమ్సన్ నాలుగు, టీమిండియా నయావాల్ ఛెతేశ్వర్ పుజారా మూడో ర్యాంకులో ఉన్నారు. ఇక బౌలర్ల జాబితాలో ఇంగ్లాండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ 892 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ఏడాది ముందు అతడు 810 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. ఒకానొక దశలో అగ్రస్థానం కోసం హోరాహోరీగా పోటీ పడ్డ టీమిండియా స్పిన్ ద్వయం రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో నిలిచారు. శ్రీలంక బౌలర్ రంగనా హెరాత్ ఆరో ర్యాంకు దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా పేసర్ హేజిల్‌వుడ్ ఐదో ర్యాంకుతో ఏడాదిని ఆరంభించి అదే స్థానంతో ముగించాడు. కొత్తగా దక్షిణాఫ్రికా బౌలర్ మోర్నీ మోర్కెల్ మూడు స్థానాలు ఎగబాకి 10వ ర్యాంకు దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ జాబితాలో షకిబ్ అల్ హసన్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వరుసగా తొలి మూడు ర్యాంకుల్లో ఉన్నారు.

సింహంలాంటోడు.. జాగ్రత్త : కలిస్



కేప్‌టౌన్:
టెస్ట్, వన్డే, టీ20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టు అడుగుపెట్టిన వేళ సౌతాఫ్రికా మాజీ దిగ్గజ ఆటగాడు కలిస్ సొంత జట్టుకు హెచ్చరికలు జారీ చేశాడు. వచ్చింది భారత జట్టు అని, గత రికార్డులను పక్కనపెట్టి జాగ్రత్తగా ఎదుర్కోవాలని సూచించాడు. టీమిండియాను తక్కువ అంచనా వేస్తే మొదటికే మోసం వస్తుందని హెచ్చరికలు జారీ చేశాడు. ఐపీఎల్‌లో కోహ్లిని తాను చాలా దగ్గరగా చూశానని, అతడు ప్రపంచ స్థాయి ఆటగాడని కితాబిచ్చాడు. భారత్ వరుస విజయాలతో మంచి ఊపు మీద ఉందని, వారి బౌలింగ్ లైన్ కూడా బాగుందని పేర్కొన్న కలిస్.. వీటన్నింటికీ మించి ఆ జట్టు కెప్టెన్ కోహ్లి అని, ఆకలితో ఉన్న సింహం లాంటోడని అభివర్ణించాడు. ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా అసలుకే మోసం వస్తుందని పేర్కొన్నాడు. ప్రత్యర్థుల బౌలింగ్‌కు కనుక అతడు అలవాటు పడితే ఇక అతడిని ఎదుర్కోవడం ఎవరి తరమూ కాదన్నాడు. టీమిండియా పేసర్లు మహమ్మద్ షమీ, భువనేశ్వర్ బౌలింగ్ విషయంలో సఫారీ బ్యాట్స్‌మెన్ అప్రమత్తంగా ఉంటే మంచిదని కలిస్ సూచించాడు. పాండ్యా బౌలింగ్‌ను అయితే తాను ఇప్పటి వరకు పరిశీలించలేదని, ఇప్పుడు చూస్తానని పేర్కొన్నాడు.

ద్రవిడ్ వల్లే పాండ్య ఎంట్రీ



న్యూఢిల్లీ:
టీమిండియాలో సారథి విరాట్ కోహ్లిస్థానానికి తప్ప అందరికీ పోటీ ఉంది. ఒకరు పోతే మరొకరు జట్టులోకి దూసుకొస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను ఒడిసిపడుతున్నారు. గాయపడి దూరమైన వారు తిరిగి జట్టులోకి వస్తామో రామో అని సందేహపడేలా ప్రదర్శనలు ఇస్తున్నారు. ఐతే యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు మాత్రం ఆ సంకట పరిస్థితి లేదు! భారత్ ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పేస్ బౌలర్ ఆల్‌రౌండర్‌గా అతను గుర్తింపు పొందడమే కారణం. భారత్-ఏ కోచ్ రాహుల్ ద్రవిడ్ సిఫార్సు వల్లనే పాండ్య భారత జట్టులోకి దూసుకొచ్చాడు. పాండ్య ఎదుగుదలలో, మానసిక పరిణతి సాధించడంలో ద్రవిడ్ పాత్ర ఎంతైనా ఉంది. 'హార్దిక్ తన సామర్థ్యంతో జట్టులోకి వచ్చాడు. అతడు చక్కని ప్రదర్శనలు ఇవ్వగలడు. బృందంలో ఎక్స్ ఫ్యాక్టర్‌గా కనిపిస్తాడు. భారత జట్టులో ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఉంటే పోటీ మరోలా ఉంటుంది. పేసర్, స్పిన్నర్‌గా జట్టులో ఉంటే చాలా కష్టం. దేశంలో చాలా మంది ఉన్నారు. అదే మీరు ఫాస్ట్ బౌలర్ ఆల్‌రౌండర్ అయితే ఆ ప్రత్యేకతే వేరు' అని ద్రవిడ్ అన్నాడు. అంతకుముందు సెలక్షన్ కమిటీతో సమావేశం అయినప్పుడు ఏం జరిగిందో ద్రవిడ్ వివరించాడు. 'నేను భారత్-ఏ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు భవిష్యత్తు కోసం ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను వెతకాల్సిన ఆవశ్యకత ఉంది. విజయ్ శంకర్, స్టువర్ట్ బిన్నీ ఆ పాత్రలు పోషించారు. శంకర్ గాయపడటంతో హార్దిక్ పాండ్యకు అవకాశం వచ్చింది. ఆస్ట్రేలియా సిరీస్‌లో అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టాడు. వేగంగా బౌలింగ్ చేయడమే కాకుండా అందంగా బ్యాటింగ్ చేశాడు. బ్రిస్బేన్ టెస్ట్‌లో 46 పరుగులకే 6 వికెట్లు తీయడమే కాకుండా బ్యాటింగ్‌లో 79 పరుగులు చేశాడు. అలా టీమిండియాకు ఎంపికయ్యాడు' అని ద్రవిడ్ పేర్కొన్నారు.

యోయో... మరింత కఠినం..?



ముంబై:
యో-యో! ఈ ఏడాది భారత క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారిన ఫిట్‌నెస్ పరీక్ష. టీమిండియా ప్రపంచకప్ హీరో యువరాజ్‌సింగ్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడానికి కారణం ఇదే అని సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ చెప్పడంతో ఈ సంగతి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అశ్విన్, యువీ, రైనా వంటి సీనియర్లు తొలుత విఫలమైనా తర్వాత పరీక్ష పాసయ్యారు. ప్రస్తుతం 16.1గా ఉన్న టీమిండియా యోయో బెంచ్ మార్క్‌ను ఇంకా పెంచబోతున్నారని సమాచారం. జట్టు ఫిట్‌నెస్ ప్రమాణాలను మరింత పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకోనున్నారట. బెంచ్‌మార్క్‌ను 16.5 లేదా 17కు పెంచాలని యోచిస్తున్నారు. 'యోయో ఫిట్‌నెస్ బెంచ్‌మార్క్ పెంచడంపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుత మార్క్‌ను దాటి 16.5 లేదా అంతకుమించి పెంచాలని ఆలోచిస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ టీమిండియా మెరుగ్గా ఉండాలి. అందులో ఫిట్‌నెస్‌కు మినహాయింపేమీ లేదు. తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. టీమిండియా మాజీ కోచ్ అనిల్ కుంబ్లే యోయో ఫిట్‌నెస్ పరీక్షను తప్పనిసరి చేశారు. ప్రపంచంలోని ఆయా జట్లు వేర్వేరుగా బెంచ్‌మార్క్‌ను నిర్ణయించుకున్నాయి. పొరుగుదేశం పాక్‌లో ఇది 17.4 కాగా న్యూజిలాండ్‌లో 20.1గా ఉంది.

లోధా కమిటీ నిబంధనలకు ఓకే..!



పుణె:
క్రికెట్ పరిపాలనలో జస్టిస్ ఆర్‌ఎం లోధా కమిటీ ప్రతిపాదించిన అన్ని సంస్కరణలను అమలు చేయనున్నట్టు మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) తెలిపింది. ఇటీవల జరిగిన ప్రత్యేక పరిపాలనా కమిటీ సమావేశంలో సంస్కరణల అమలుకు తలూపింది. 'సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర క్రికెట్ సంఘం లోధా కమిటీ సంస్కరణలు అమలు చేసేందుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సభ్యులందరూ తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సంస్కరణలను ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను' అని ఎంసీఏ అధ్యక్షుడు అభయ్ ఆప్టే పేర్కొన్నారు. ఈ సమావేశానికి సుప్రీం కోర్టు ఉద్వాసన పలికిన బీసీసీఐ మాజీ కార్యదర్శి అజయ్ షిర్కే హాజరయ్యారని తెలిసింది. ఎంసీఏలో షిర్కే సభ్యుడు కాబట్టి సమావేశాలకు హాజరయ్యే అధికారం ఆయనకు ఉంటుందని మరో సభ్యుడు తెలిపారు. సుప్రీం ఆదేశాల అనుసరం ఒక్కొక్క అనుబంధ సంఘం లోధా సంస్కరణలకు అంగీకరిస్తున్నాయి. నిధులు విడుదల చేయకుండా అడ్డుకోవడంతో అవి ఒత్తిడికి తలొగ్గుతున్నాయి. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. బీసీసీఐ మాత్రం కొన్ని నియమాలను వ్యతిరేకిస్తోంది. ఒక రాష్ట్రానికి ఒక ఓటు, పాలకులకు వయో పరిమితి విధింపు, ఒక వ్యక్తికి ఒక పదవి, రెండు పదవుల మధ్య కూలింగ్ ఆఫ్ పీరియడ్ అంశాలను ఒప్పుకోవడం లేదు.

కేప్‌టౌన్ వీధుల్లో కోహ్లి, ధావన్ డ్యాన్స్



కేప్‌టౌన్:
టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, ఓపెనర్ శిఖర్ ధావన్‌లు కేప్‌టౌన్ వీధుల్లో చిందేశారు. దక్షిణాఫ్రికాతో జనవరి 5 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టు నేపథ్యంలో ఈ స్టార్ క్రికెటర్లు కేప్‌టౌన్ నగరంలో ఫ్యామిలీతో చక్కర్లు కొడుతూ సరదాగా గడుపుతున్నారు. కేప్‌టౌన్ వీధుల్లో జనసమూహం మధ్యలో కొందరు డ్రమ్స్ వాయిస్తుండగా.. ఏ మాత్రం వెనకడుగు వేయకుండా కోహ్లి, ధావన్‌లు డ్యాన్స్ చేశారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయగా.. నెట్టింట్లో హల్ చల్ చేస్తోంది. ఈ వీడియోలో ధావన్ కొడుకు కూడా ఉన్నాడు. తొలి టెస్టుకు చీలిమండ గాయంతో ధావన్ దూరమైన విషయం తెలిసిందే.

'విశాలాంధ్ర' సేవలు అమోఘం

- అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్
- నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ:
తెలుగు జాతికి ఆరు దశాబ్దాలుగా విశాలాంధ్ర దినపత్రిక, ప్రచురణాలయం అందిస్తున్న సేవలు అమోఘమని అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగుజాతి చరిత్రతో విశాలాంధ్రకు అవినాభావ సంబంధం ఉందని కొనియాడారు. విజయవాడ చుట్టుగుంటలోని చంద్రం బిల్డింగ్స్‌లో ఉన్న విశాలాంధ్ర ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలను పారదోలేందుకు, రాష్ట్ర అభ్యుదయానికి విశాలాంధ్ర విశేష కృషి చేస్తోందన్నారు. తెలుగునాట అభ్యుదయ సాహిత్యం వెలుగొందడానికి విశాలాంధ్ర కారణమని చెప్పారు. జై ఆంధ్ర ఉద్యమం 1972లో ఉధృతంగా సాగిన సమయంలో ఆ వార్తలను విశాలాంధ్ర ఒక్కటే ప్రచురించిందని గుర్తుచేశారు. జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్న తన తండ్రి మండలి వెంకటకృష్ణారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేయలేదని అవనిగడ్డలో ఓ హరిజనుడికి గుండు కొట్టి, సున్నం రాసి ఊరేగించిన వార్తను విశాలాంధ్రలో ప్రచురించడంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ విషయాన్ని నాటి ఎంపీ భూపేష్‌గుప్తా పార్లమెంట్‌లో ప్రస్తావించగా, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విచారం వ్యక్తంచేశారని చెప్పారు. అనేక గ్రంథాలు తెలుగు వారికి లభిస్తున్నాయంటే దానికి విశాలాంధ్ర ప్రచురణాలయమే కారణమని చెప్పారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, తాపి ధర్మారావు వంటి ప్రముఖుల రచనలను వెలుగులోకి తీసురావడంతో పాటు నేటి తరానికి కూడా చేరువ చేయడం విశాలాంధ్ర గొప్పతనమని కొనియాడారు. ప్రజానాట్యమండలి సహా అభ్యుదయ రచయితలకు విశాలాంధ్ర గొప్ప వేదికగా నిలిచిందన్నారు. విశాలాంధ్ర గతంలో ప్రచురించిన 'ఆంధ్ర దర్శిని'ని మళ్లీ తీసుకురావాలని బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు చండ్ర రాజేశ్వరరావుతో తమ కుటుంబానికి గొప్ప అనుబంధం ఉందన్నారు. తనకు విశాలాంధ్రతో సుదీర్ఘ కాలంగా సంబంధాలు ఉన్నాయని వివరించారు. విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలి బుద్ధప్రసాద్ తండ్రి వెంకటకృష్ణారావు గాంధేయవాది అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. విశాలాంధ్ర ప్రచురించే సాహిత్యంపై మక్కువ చూపేవారని చెప్పారు. విజయవాడలో ప్రారంభమైన విశాలాంధ్ర దినపత్రిక గతంలో ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకు సైతం వెళ్లేవని తెలిపారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ రెడ్డి మాట్లాడుతూ 2017లో సంస్థ సాధించిన ప్రగతి, రానున్న నూతన సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు. విశాలాంధ్ర ఎడిటర్ ముత్యాల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పాకెట్ డైరీ, ఆఫీస్ క్యాలెండర్‌ను బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. విశాలాంధ్ర కలర్ క్యాలెండర్‌ను ఈడ్పుగంటి నాగేశ్వరరావు, కోర్టు క్యాలెండర్‌ను కమ్యూనిజం మాసపత్రిక ఎడిటర్ ఎంసీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. విశాలాంధ్ర స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి చావా రవి, సిబ్బంది పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. R.No.32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.